ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

2-4-'52

విషయాను క్రమణిక

ముఖచిత్రం : 'ఫాబియోలా' చిత్రం లో అభినేత్రి శాలీ ఫారెస్ట్

వ్యాఖ్యలు, విమర్శలు 3

మద్రాస్ డైరీ—సవ్యసాచి 5

భూప్రదక్షిణ—శ్రీ మా. వి. శేషాచారి 8

రెండుమహానగరాలు(సీరియల్ నవల) చార్లెస్ డికెన్స్ 9

టిగిబిగి—శ్రీ అంగర వెంకటకృష్ణారావు 14

తప్పెవరిది?—"అనిల్ కుమార్" 16

ఊసికుక్కలు—శ్రీ భాగవతుల రామారావ్ 20

తీసిపోని తెలివి—"జానకీరాణి" 22

కేడియోగింజలు—శ్రీ తోట్యోటి భానుమూర్తి 23

బొమ్మరిల్లు :

ఒట్టు—'రవి' 24

ఏప్రిల్ ఫూల్— 25

హాకల్ బెరీఫిన్ (సీరియల్)— మార్క్ ట్వేన్ 26

స్వప్నలోకంలో ఆలిస్ 32

అంతులేని బేరం—శ్రీ గురజాడవారి శాచీ 34

కంగారూ— 36

బొమ్మల గారడీ— 39

సినిమా : 41

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 30
2.4-52

నందన సంవత్సర చైత్ర శుద్ధ అష్టమి బుధవారము

వ్యాఖ్యలు, విమర్శలు


ఆలిండియా కాంగ్రెస్ కమిటీ

దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల ఫలితాలను సమీక్షచేసిన భవిష్యత్కర్తవ్యాన్ని నిర్ణయించుకోడానికి ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కలకత్తాలో మార్చి 22, 23 తేదీలలో సమావేశమయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకూ అనుసరిస్తున్న విదేశాంగవిధానాన్ని ఆమోదించి, దక్షిణాఫ్రికా ప్రభుత్వ జాతిద్వేషవిధానాన్ని నిరసిస్తూ తీర్మానించింది. కాంగ్రెస్ సంస్థ పునర్నిర్మాణానికి సూచనలు చేస్తూ తిరిగి పావలా సభ్యత్వాన్ని నెలకొల్పింది. కాంగ్రెస్ కమిటీల ఎన్నికల విచారణనిమిత్తం ఇదివరలో చెయ్యబడిన ఏర్పాట్లను సవరించింది. దేశంలో కులమత రాష్ట్ర స్వాభిమానాలు ప్రమాదకరమైనవని హెచ్చరిస్తూ కాంగ్రెస్‌వాదులను ఈ ముప్పు నివారించడానికి కృషిచెయ్యాలని ఆదేశించింది. ప్రస్తుత క్లిష్టపరిస్థితిలో కాంగ్రెస్‌వాదుల కర్తవ్యాన్ని నిర్దేశిస్తూ శ్రీ బి. జి. ఖేర్ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదించబడింది. ప్రజల అవసరాలను కనిపెట్టి తీర్చడానికి కాంగ్రెస్‌వాదులు చెయ్యవలసిన కృషినీ తీర్మానం నిర్దేశిస్తున్నది. కాంగ్రెస్ ప్రాంతీయ సంఘాలను పునర్నిర్మించి సంస్థను ప్రజలకు సన్నిహితపరచడానికి నిర్ణయించబడింది.

* * *

రిపబ్లిక్ అధ్యక్షపదవికి ప్రస్తుత అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గారినీ, ఉపాధ్యక్షపదవికి సర్వేపల్లి రాధాకృష్ణ గారినీ నిలబెట్టడానికి కాంగ్రెస్ అధిష్ఠానవర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం కాంగ్రెస్ వారికే, గాక తదితరులలో చాలమందికీ దేశానికి ఆమోదయోగ్యమైనదని వేరే చెప్పనక్కరలేదు. ఇద్దరూ కూడా

(6 వ పేజీ చూడండి)



కలకత్తా ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో పతాకావిష్కరణచేసిన కాంగ్రెస్ అధ్యక్షులు పండిట్ నెహ్రూ.



నిర్మల

హిందూస్థాన్ చిత్రావారి "ఘనశ్యామ్" హిందీచిత్రంలో రాధ పాత్రధారిణి నిర్మల. ఈ చిత్రం ప్రొడ్యూసరు కిశోర్ సాహు; డైరెక్టరు నానాభాయిభట్. నటీనటులు నిర్మల, శోభనసమర్థ, జీవన్, రాజ్ కుమార్; భారత్ భూషణ్ మున్నగు వారు. శ్రీకృష్ణుని బాల్యలీలలనుండి, అవతార సమాప్తి వరకూ జరిగిన వృత్తాంతాన్ని చూపించే ఈ చిత్రం త్వరలో మద్రాసుకు, ఆంధ్రకేంద్రాలకు రానున్నది.

★ మద్రాసు డైరీ ★

గడచినవారం కేంద్ర, రాష్ట్ర కౌన్సిళ్ళ ఎన్నికల హడావిడి మూలంగా నగరంలో ఎక్కడ చూసినా తెలుగు ఎమ్. ఎల్. ఏ. లే కనిపించారు. బస్సుల్లో, కటూముల్లో, హోటళ్లలో, ఖద్దరు బట్టలు కట్టుకున్న తెలుగు పెద్దమనుష్యులు నిండిపోయారు. తెలుగు జిల్లాలనుండి వచ్చిన ఆసాములను ఈ మద్రాసు ఎంతెండలోనైనా సరే ఇట్టే పసిగట్టవచ్చు. ఈ ఖద్దరి కలగాపులగపు వాతావరణంలో తెలుగు మనిషి తెలుగుగడ్డనుండి ఒక ముక్క కోసి తెచ్చి ప్రతిష్ఠించినట్లు కనిపిస్తారు. బహుశా తమిళ జిల్లాలనుండి వచ్చిన తమిళ మనిషి ఇలా ప్రత్యేకత కొట్టొచ్చినట్టు కనబడకుండా కనిపిస్తాడని అనుకోను. కొత్తగా ఈ ఊరు వచ్చిన తెలుగువారికి మొదట ఎదురయ్యే చిక్కు భాషా సమస్య. తెలుగు వచ్చిన అరవలుకూడా తెలుగు మాట్లాడరు. ముఖ్యంగా బస్సు, ట్రాము కండక్టర్లు మరీ బాధపెడతారు. "ఈ బస్సు మౌంటురోడ్డుకు పోతుందా?" అని అడిగితే "పోదు" అంటాడు కండక్టరు. పోదుకాబోలనుకుని, "ట్రిప్లికేన్ పోతుందా?" అని అడిగితే "పోవాదు" అంటాడు కండక్టరు. అట్టే మాట్లాడితే ఆ మాటనే రకరకాలుగా కూడా (పోకాదు, పోఖాదు, పోహాదు) అనగలడు. దీనితో ఆ తెలుగు మనిషి తెల్లబోయి ఏం చెయ్యాలో తెలియక తబ్బిబ్బవటం జరుగుతుంది. కాని ఇప్పుడిప్పుడు మద్రాసులో బస్సు, ట్రాము కండక్టర్లు కూడా ధారాళంగా తెలుగు మాట్లాడుతున్నారు.

* * *

భారత – సోవియట్ సాంస్కృతిక సమితి ఆహ్వానంపై భారతదేశంలో పర్యటిస్తున్న సోవియట్ సాంస్కృతిక ప్రతినిధులు గతనెల 23 వ తేదీన మద్రాసు వచ్చారు. వారిలో ఒక కవి, ఒక గాయకుడు, ఒక పియానిస్టు, ఒక చిత్రకారుడు, ఒక ... నృత్యకారులు ఇంకా ఇతరులు ఉన్నారు. ... మహాజన సభలో, ... గొప్ప సన్మానం జరిగింది. ఆ సందర్భంలోను అజర్ బైజాన్ గాయకుడు రషీద్ బెహబుదోవ్ ఎక్కువగా ఆకర్షించాడు. అజర్ బైజాన్ జానపద గేయాలు వారికి శ్రోతలను ఆనందపరవశులను చేశాడు. అజర్ బైజాన్ సంగీతంలో కొంత పాశ్చాత్య ఛాయలు ఉన్నప్పటికీ మన సంగీతానికి బాగా సన్నిహితంగా తోస్తుంది. ఆ దేశంవారికి మనకున్నంత స్పష్టంగా కాకపోయినా కొంతవరకు రాగ పద్ధతికూడా ఉన్నట్లుంది. అందుచేతనే అజర్ బైజాన్ గాయకుడు రెండుమూడు హిందీ పాటలను తేలికగా పట్టుకొని పాడగలిగాడు.

మూడుసార్లు స్టాలిన్ బహుమతిపొందిన కవి నికొలాయ్ తిఖనోవ్ మాట్లాడుతూ, తమ దేశపు రచనలలో సోషలిస్టు వాస్తవికత ప్రతిఫలిస్తుందనీ, సోషలిస్టు సమాజం ఉన్న దేశంలోనే కాని మరే దేశంలోనూ సోషలిస్టు వాస్తవికత సాధ్యపడదనీ అన్నారు. ఇతర దేశాలలో రచయితలు విమర్శనాత్మకమైన వాస్తవిక రచనలు (క్రిటికల్ రియలిజం) మాత్రమే చేయగల్గరని కూడా అభిప్రాయపడ్డారు.

రష్యా ప్రజలు ఇంకా తమ్ముతాము సమర్థించుకోవలసిన స్థితిని దాటిపోలేదు. రష్యన్లు స్లావ్ జాతీయులు. స్లావ్ జాతీయులు అనాగరికులు, అసంస్కృతులు అని, 'ఆసియాలోని బర్బరులు' అని పాశ్చాత్య యూరోపు దేశాలవారికి నమ్మకం. అందుచేతనే పుష్కిన్ నాటి నుంచి నేటివరకూ ప్రతి రష్యన్ సారస్వతాన్ని, మారిన రష్యాను, రష్యన్ వ్యక్తిత్వాన్ని సమర్థించటానికి పోరాడు ప్రయత్నం కనిపిస్తోంది. మన దేశం కూడా ప్రాచీనమైన తన గొప్పదనాన్ని మీదపడ్డ దాస్యానికి ... భారతీయ సంస్కృతిని ... సమర్థిస్తూ రాయవలసి వచ్చింది. ఈనాటి రష్యా కూడా అదేస్థితిలో ఉంది. సైన్సు మొదలు సాహిత్యంవరకూ అన్ని శాఖలలోను రష్యన్లు తమ ప్రత్యేకతను సమర్థించుకోక తప్పటం లేదు.

* * *

స్వాతంత్ర్యసిద్ధి అనంతరం భారత సర్కారు



విశాఖపట్నంలో శ్రీ కళా వెంకట్రావు గారిని సన్మానించిన పత్రికారచయితలు.

మంతటా జమీందారీలరద్దు ఉద్యమం చెల రేగింది. ఈఉద్యమంలో కాశ్మీర్ మిగతా భారతదేశంకంటే ఒకడుగు ముందుకు వేసింది. షేక్ అబ్దుల్లా ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా జమీందారీలు రద్దుచేయ సంకల్పించింది. పరిహారం ఇవ్వకుండా రద్దు చేయటంలో అబ్దుల్లా ప్రభుత్వానికి సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలు కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలే లక్ష్యమని ఒక ప్రసిద్ధపత్రిక ఆరోపించింది. కాని అబ్దుల్లా ప్రభుత్వం కయో జనుల వోటింగుద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం. అందుచేత ఆప్రభుత్వం ఆంతరంగికంగా ఎలాంటి సంస్కరణ కార్యక్రమాలు తలపెట్టినా అడ్డుపెట్టగల హక్కు మరొకరికి లేదు. ఒకవేళ అబ్దుల్లాప్రభుత్వం రాజకీయంగా సుస్థిరమైనది కానిపక్షంలో దాన్ని సుస్థిరం చేసుకోవలసిన అవసరం ఉన్నది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న కాశ్మీర్ ప్రజలకే కాకుండా భారతభూభాగంలో చేరిన కాశ్మీర్ ప్రజలకుకూడా తన ప్రభుత్వం ఆకర్షణీయంగా ఉండేట్టు చూసుకోవలసిన బాధ్యత షేక్ అబ్దుల్లాపై ఉన్నది. ఎందుకంటే ఒకవేళ జనవాక్యనిర్ధారణ అంటూ జరిగితే కాశ్మీర్ ప్రజలు షేక్ అబ్దుల్లానే వరించటానికి ఒకబలమైన కారణం ఉండాలిగదా! అందుకే అబ్దుల్లా పరిహార రహితంగా జమీందారీలను రద్దు చేయ బూనుకొని వుండవచ్చును. లేక కొందరు అనుమానిస్తున్నట్టు అబ్దుల్లా సామ్యవాది కావచ్చును. ఏ కారణాలు ప్రోద్బలమిస్తే నేమి అబ్దుల్లా తలపెట్టిన భూమి సంస్కరణలు గొప్ప సాంఘిక పరిణామాలకు దారితీయగలవు. 1950 లో కాశ్మీర్ ప్రభుత్వం తమ సంస్కరణ కార్యక్రమం ప్రకటించినప్పుడు భారతప్రభుత్వం అధిక్షేపించటం జరిగింది. కాని ఇంకా వివాదగ్రస్తంగానే ఉన్న కాశ్మీర్‌లో అభ్యుదయకరమైన సంస్కరణలు జరగటం భారతదేశానికే లాభమన్న సంగతి మరిచిపోగూడదు.

* * *

నిర్వచనం :

ఆశావాది—నిరాశను దాచుకునే మనిషి.

—సవ్యసాచి.

వ్యాఖ్యలు, విమర్శలు

(3-వ పేజీ తరువాయి)

కేవలం పార్టీ అభిమానాలకు అతీతులై దేశక్షేమమే ప్రధానాశయంగా వ్యవహరించగల ఉత్తములు.

* * *

ఆంధ్రరాష్ట్రసమస్య :

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశ సందర్భంలో ఆంధ్రరాష్ట్ర ప్రసక్తి తేవడానికి యత్నం జరిగింది కాని అసలా విషయాన్ని మాట్లాడానికైనా అగ్రనాయకులు సమ్మతించలేదట. అంటే ఇంకకొన్ని సంవత్సరాలవరకూ (కాంగ్రెస్‌కు సంబంధించినంతవరకూ) ఆంధ్రరాష్ట్ర స్థాపనకు అవకాశం లేదనే భావించాలి. నాయకులమధ్య ఐక్యత లేకపోయినంతమాత్రాన దేశపరిపాలన ఆగిపోలేదు. ఆ వాస్తవిక దృక్పథంలో చూసినట్లయితే ఆంధ్రరాష్ట్రసమస్య బొత్తిగా మూలపడవెయ్యవలసినది కాదని తోచకమానదు. దురదృష్టవశాత్తూ ఇటీవల ఆంధ్రరాష్ట్రోద్యమం పెడదోవ తొక్కిందని అంగీకరించకతప్పదు. ఈ ఉద్యమం ఇతరులచేతుల్లో మరొకపంథా పట్టకమునుపే కాంగ్రెస్ సంస్థ జాగ్రత్తపడి సరైనతోవలో పెట్టడం అవసరమౌతోంది. భాషారాష్ట్రోద్యమాన్ని మతద్వేషాలతోటీ కులద్వేషాలతోటీ దేశవిచ్ఛిన్నకరమైన ఇతరవాదులతోటీ పోల్చి దూషించడం ఇంక మాని, కాంగ్రెస్ నాయకులు సక్రమపథంలో నడపడానికి పూనుకోడం అవసరం. ఆంధ్రదేశంలో సర్వవర్గాలకూ ఆమోదమైన ఉద్యమాన్ని కాంగ్రెస్ ఉపేక్షించినట్లయితే అది ఇతరుల చేతుల్లో ముప్పుగా పరిణమించగలదని ఆంధ్రకాంగ్రెస్ నాయకులకు తెలుసును. తెలిసికూడా కర్తవ్యాన్ని ఎందుకు నిర్ణయించుకోడం జరగలేదో తెలియదు. ఎన్నికల రద్దీ దాదాపు ముగిసిపోయింది కనక, ఇప్పుడు సంస్థ ఐక్యతను లక్ష్యపెట్టనివారు దూరమైపోయినారు కనక, ఆంధ్రకాంగ్రెస్ ఇంక ఆంతరంగిక కక్షలూ వైషమ్యాలబాధ లేకండా ఏకోన్ముఖంగా కృషి చెయ్యడానికి అవకాశం కలిగింది కనక కనీసం ఇప్పుడైనా ఆంధ్రకాంగ్రెస్ ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని సక్రమపథంలో నడిపించడానికి కార్యక్రమాన్ని నిర్ణయించవలసిఉంది. ఇందులో జాప్యమైతే ఎలాంటిపరిణామాలు సంభవించగలవో ఆంధ్రకాంగ్రెస్ నాయకులకు తెలియకపోదు. ఈ పరిస్థితిని ఉన్నదున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ ఒక కమిటీని నియమించి నివే

దిక తయారుచేసి కేంద్ర కాంగ్రెస్‌కి సమర్పించడం అవసరం.

*   *   *

మద్రాసు మంత్రివర్గనిర్మాణం:

మద్రాసులో మంత్రివర్గ నిర్మాణం గురించి చర్చ జరిగింది కాని తుదినిర్ణయం జరగలేదు. నిర్ణయాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు నెహ్రూగారికే మద్రాసు కాంగ్రెస్ నాయకులు విడిచిపెట్టారని మొదట వార్త వచ్చింది కాని తరవాత ఆంధ్ర, తమిళ కాంగ్రెస్ అధ్యక్షులు మద్రాసు తిరిగి వచ్చినప్పుడు నిర్ణయం కొత్త కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకే విడిచిపెట్టారని చెప్పారు.

కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులు రాజగోపాలాచారిగారిని నాయకునిగా తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారు. కాని వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాలని వారనుకుంటున్నట్లూ కాంగ్రెస్ వారి కోరికను మన్నించలేని స్థితిలో ఉన్నట్లూ తెలియచేశారట. అధ్యక్షులు నెహ్రూగారిచేత కూడా చెప్పించడానికి యత్నం జరుగుతోంది. ఈ యత్నాలు విఫలమయ్యే పక్షంలో కూడా ఎవరినో ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకోడం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీకి కష్టంకాదు. నాయకులందరూ అన్నివర్గాలవారూ ఇందుకు సుముఖంగానే ఉన్నారు.

ఎవరిని నాయకునిగా ఎన్నుకోవాలని కాంగ్రెస్ పార్టీ సతమతమాతుంటే, కమ్యూనిస్టుపక్షం, ప్రజాపార్టీ, స్వతంత్రులు, రెండుమూడు ఇతరపార్టీలూ చేరి ఏర్పాటు చేసుకున్న డెమోక్రటిక్ ఫ్రంట్ తమ సభ్యత్వసంఖ్యని వృద్ధిపరుచుకోడానికి తాపత్రియ పడుతోంది. ఫ్రంట్‌కి నాయకుని ఎన్నిక సులభంగానే జరిగిపోయింది. ఆంధ్రుల అభిమాననాయకుడు ప్రకాశంగారు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వారు ఏవో గుణకారాలూ తీసివేతలూ వేసి లెక్కలుకట్టి ఫ్రంట్ సభ్యత్వం మొత్తం 164 ప్లస్ నాలుగు వెరసి 168, అంటున్నారు. ఆగుణకారాలూ తీసివేతలూ కలుపుకోడాలూ ఆట్టే ఎవరికీ అర్థంకాగు. ఫ్రంట్‌సభ్యుల్లోకూడా ఆట్టే మందికి తెలియదు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీబలం కంటె తమబలం అధికమని చూపించుకోడానికి ప్రకాశంగారు వారి అనుచరులూ తాపత్రయపడుతున్నారు గవర్నరుగారు బుద్ధిమంతుడే నని కూడా ప్రకాశంగారు అన్నారు. అంటే గవర్నరుగారు మంత్రివర్గాన్ని నిర్మించడానికి ఎన్నుకోబడగల కాంగ్రెస్ నాయకుని ఎలా ఆహ్వానిస్తారో చూద్దాంఅని ఫ్రంట్ నాయకుల ఆంతర్యం. తీరా ఆహ్వానిస్తే ఏం చెయ్యాలనుకుంటున్నారో తెలియదు. ఏమీ అనుకోలేదేమో కూడా.

*   *   *

పరిశ్రమలు, వాణిజ్యం:

పాతికేళ్ల కిందట స్థాపించబడిన వాణిజ్య పారిశ్రామిక సభాసమితి ఈయేడాది రజతోత్సవం జరుపుకుంది. బ్రిటిష్‌వారి హయాంలో బ్రిటిష్ పరిశ్రమలూ వ్యాపారాలతో పోటీచేసి నిలదొక్కుకోవాలంటే దేశీయపారిశ్రామికులూ వ్యాపారులూ కలిసికట్టుగా వ్యవహరించడం అవసరం అ[...] అభిప్రాయంతో ఈసంస్థ ఆనాడు స్థాపిం[...] బడింది. ఈ ఐకమత్యభావం ఆనాడేకాద[...] ఈనాడు కూడా అవసరమైనమాట నిజమే[...] అయితే సమితి కార్యకలాపాలు కూడ[...] కాలానుగుణంగా మారడం అవసరం[...] వ్యాపారులు పారిశ్రామికులూ తమ కార్య[...] కలాపాలను ప్రజలకూ ప్రభుత్వాని[...] సంతృప్తి కలిగించేవిధంగా నిర్వహించాలి[...] దేశంపట్ల తమ కర్తవ్యాన్ని ఏరీతిగా నిర్వ[...]

(46–వ పేజీ చూడండి)

భూప్రదక్షిణ

శ్రీ మా. వి. శేషాచారి

పదే పదే పరీక్ష తప్పటంతో మూర్తికి మతిపోయినట్లయింది. గజినీ మహమ్మదు దండయాత్రల్ని గురించి హైస్కూల్లో చదివింది జ్ఞాపకం వచ్చి తనలో తనే నవ్వుకున్నాడు. యింతకీ మోక్షం అంటూ వుందా లేదా అన్న సమస్య అతణ్ణి కలవర పెట్టింది. కాకపోతే ఒకసారా? రెండు సార్లా? యిది ఆరోసారి యింటరు గ్రూపు పరీక్షల్లో తప్పటం. అదేం ఖర్మమో కాని ప్రతిసారి యీమారు తప్పక ప్యాసైపోతాననుకోవటం, రిజల్ట్సు వచ్చిన తర్వాత మళ్ళీ చదువు మొదలు పెట్టాల్సి రావటం. విసుగొచ్చి యిహ చదువు మానేద్దామనుకున్నాడు. కాని 'మొదట్లో యెన్నిసార్లు ఓడినా అంతిమ విజయం మనదే' నన్న ప్రభువారి ధోరణిలో వున్న సత్యం నగ్నంగా నృత్యం చేసింది అతనెదుట.

ఎదురింటమ్మాయి శాంత కూడా పరీక్షకి వెడుతోందన్న వార్త మిగతా విరక్తి భావాలన్నింటినీ వెనక్కి మళ్ళించి పరీక్షకి కట్టించింది ఆఖరికి అతనిచేత. బ్యాంకిలో చలానా కడుతూ అనుకున్నాడు. 'ఒకసారి ఏ యకరం పొలమో యూనివర్సిటీకి రాసేస్తే సరిపోయేటట్లుంది. తడవ తడవకీ డబ్బుకట్టటం యాతనన్నా వదిలిపోతుంది. పరీక్షకెళ్ళి కూచోటమే మనపని' అని.

ఏపనైనా మొదలు పెట్టేదాకా ఉన్నంత వుబలాటం తీరా ఆ పని మొదలు పెట్టాక వుండదు. మూర్తిని పరీక్షకి డబ్బు కట్టించేదాకా తోడ్పడిన పరిస్థితులు క్రమంగా ఎండమావుల్లాగా కరిగిపోయినయ్. ఎదురింటమ్మాయి శాంత కాపరాని కెళ్ళటంతో ఆమె పరీక్షా తిన దారి తను చూసుకుంది. పోనీ చివరికి విజయం మనదే అనుకున్నా, అదీ ఎండమావుల్లా కనపడుతోంది. చదువు సాగటం అంతంత మాత్రమే అయింది. ఎలాగో సరి పెట్టుకొని దొరికిన విరామసమయాల్లో చదివాడు. అయినా పరీక్షకి కావలసినంత చదువు చదవలేకపొయ్యాడు. ఎప్పుడా ఎప్పుడా అనుకున్న పరీక్షలు, పది హేను రోజుల్లో కొచ్చిందాకా మూర్తికి వేడెక్కలా. రాత్రింబవళ్ళూ కూర్చొన్ని, రోజుకో సిజరు సిగిరెట్ల టిన్ను తగలేసి అలాగే చదివాడు. "ఈ బాధంతా ఎవరు పడతారు. పోనీ మానేద్దా" మని పించింది. ఒకసారి. కాని యింట్లో ముసలాళ్ళపోరు జాస్తయింది. రిటైరై యింట్లో కూర్చున్న ముసిలి తండ్రి సణుగుడు ఎక్కువైంది. యింటి కొచ్చిన నానా అడ్డమైన వాళ్ళతో తనని గురించి దీర్ఘమైన వుపన్యాసా లిచ్చి నిట్టూరుస్తుంటాడు అక్కడికి తనెక్కడా తప్పకుండా ప్యాసైనట్లు. పరీక్షప్యాసు కావటంమీదే ఆధారపడివుంది తన జన్మ సాఫల్యం. "ముందుగా ప్యాసైన వాళ్ళంతా మాత్రం యేం జేస్తున్నారులే" అన్న వెట్టి వేదాంతమే మూర్తి నింతవరకు పట్టుదలగా చదివిస్తోంది.

చిన్నతనంలో ఎంత అల్లర్లిగా తిరిగినా కొంత వయసొచ్చాక వెనకటిదంతా మాసిపోతుంది. మూర్తి పరీక్ష ప్యాసుకావటంతో అతని పూర్వ దండయాత్రలన్నీ లెక్కలోకి రాలా.

మూర్తి తండ్రికూడా ఆలోచించాడు "అతణ్ణో యింటివాడిని చేసి ఏదో వుద్యోగంలో ప్రవేశపెడితే వృద్ధాప్యంలో తనకి ఆసరాగా వుంటా" డని. పెద్దవాళ్లకి సంకల్పం అంటూ ఏర్పడాలే కాని, అవి యింతలో కార్యరూపం ధరిస్తాయి, కనీసం బి. ఏ. అయినా పూర్తిచేద్దా మనుకున్న మూర్తి వుద్దేశ్యం వుద్దేశ్యంగానే వుండిపోయింది పెళ్లి కావటంతో. దాంతోనే మెడమీద కాడిపడింది. స్కూలు ఫైనలు చదువుతున్న రోజుల్లో కనీసం ఏకలెక్టరు గిరీ అయినా చలాయిద్దా మనుకున్న మూర్తి పరిస్థితులని బట్టి తాలూకాఫీసులో గుమాస్తాగా ప్రవేశించాల్సి వచ్చింది నెలకి డెబ్బై రూపాయల జీతంమీద. ఫస్టు తారీకు వచ్చేటప్పటికల్లా వంద రూపాయలకి బడ్జెట్టు ముందుపెట్టేవాడు ముసిలి తండ్రి. కొత్తగా కాపరాని కొచ్చిన పెళ్లానికి రిబ్బన్లూ, పౌడర్లూ తేవటం అటుంచి తన స్వంత ఖర్చులే మానుకోవలసి వచ్చింది మూర్తికి గత్యంతరం లేక. మధ్యాహ్నంపూట తోటి గుమాస్తాలంతా కాఫీ కెడుతుంటే తను మాత్రం నేరం చేసినవాడిలా మొహం తప్పించేవాడు. ఏదేలాగున్నా వృద్ధాప్యంలో వున్న తండ్రిని సుఖపెడుతున్నా నన్న పారమార్థిక చింత మాత్రం అతణ్ణి వూరుకోబెట్టింది. కాని యింటికొచ్చేసరికి అతని హృదయం చిలుకుతున్నట్లనిపించేది. తన చెల్లెళ్ళకున్న స్వతంత్రం యింట్లో తన భార్యకి లేకపోవటం వల్ల ఎంత సరిపెట్టుకుందా మనుకున్నా గాని కష్టంగానే కనిపించింది మూర్తికి. తను చెమటుంతా ఓడ్చి సంపాదస్తున్నా తన భార్య తన చెల్లెళ్ళలాగా సినిమాలు చూడటానికి బజార్లో అమ్మవచ్చిన అడ్డమైన వస్తువులు కొనడానికి వీల్లేదు. ఏమన్నా నోరు తెరిచి అన్నా తల్లి వూరుకోదు. "పెళ్ళి కాని పిల్లల్ని వాళ్ళనేం ఆడిపోసుకుంటావురా" అంటుంది. దేశంలో విప్లవాలు వస్తాయంటే వింతేముంది? ఎక్కువైన అన్నం దిబ్బల్లో కుక్కలకి వెయ్యటం చూసి ఏ అన్నం లేనివాడు సహించి వూరుకుంటాడు? తినెంత అణిచి పెట్టుకుని ఓర్పుగా వున్నా, భార్య పోరు రోజు రోజుకీ జాస్తయింది. నిజానికి జరుగుతున్నదీ అంతే. భార్యని అనాల్సిన పనేముంది? తను సంపాదించటం తన భార్యకి కనీసకోర్కెల కూడా హక్కు లేకపోవటం. విప్లవ

(13-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

3

మానవతత్వాన్ని అర్థం చేసుకోగలగటం దుర్ఘటం. ఒకడి మనసులో యేముందో రెండోవాడికి అర్థంకాదు. రాత్రివేళ నడివీధినిబడి పోతూవుంటాం. చుట్టూ, అనేక యిళ్లూ వాకిళ్ళూ చీకటిపొదల్లా గుంపులు గుంపులుగా కంటబడతై. కాని ఆ యిళ్ళల్లో యే యింట్లో యేవిఁ జరుగుతుందో మనకేం తెలుసు! ఏ గదిలో ఏ రహస్యం దాగివున్నదో ఎవరికి తెలుస్తుంది! ఆ యిళ్లల్లోవుండే వందలూ వేలూ మానవహృదయాల్లో యేయే పరమ రహస్యాలు నిక్షిప్తంగా అణగివున్నాయో ఎలా అవగతం చేసుకోగలం? జీవితంలో ప్రాణపదంగావుండే ప్రియురాలికి కూడా తెలియకుండా ఏ వ్యక్తి యే భావాన్ని హృదయాంతరంలో మహానిక్షేపంలా భద్రపరచుకుని దాచుకున్నాడో ఎలా ఊహించగలం! మానవుల మాటేగాదు—సృష్టిసర్వస్వం ఒక గభీరమైన పరమరహస్యం అవగతంగాని అనేక మహాభీభత్సాలు!—మృత్యువు! ఏవిఁటి వీటికన్నిటికీ అర్థం? సృష్టి రహస్యాన్ని ఛేదించటానికి ప్రయత్నించినకొద్దీ అయోమయమైపోతూ వుంటుంది. ఈ మహాగ్రంథాన్ని విప్పి ఒకటి రెండు పుటలు అలా తిరగవేసేసరికే గ్రంథం అమాంతం ముడుచుకుపోయి అంధకారం అలుముకుంటుంది. ఏవో కాగడాలు గట్రా వేసుకుని అంధకారం ఆవరించివున్న ఈ మహార్ణవగర్భంలోకి తొంగిచూస్తాం—జలధిగర్భంలో ఏవో మణులూ—రత్నరాసులూ వున్నట్టు అనుమానం తగులుతుంది. అలా చూస్తూచూస్తూ వుండగానే ఏదో మంచుతెర జలధిగర్భంమీద విచ్చలుకుని ఘనీభవించి—కన్ను కప్పేస్తుంది. వెలుగుతూన్న కాగడాలు వెలుగుతూ వుండగానే వొడ్డున నిల్చుని తెల్లమొహం వెయ్యవలసివస్తుంది. చూస్తూచూస్తూ వుండగా పరమాప్తుడైన మిత్రుడు పడి చస్తాడు. ఆత్మలో ఆత్మగా ఉండే ప్రియురాలు హఠాత్తుగా ప్రాణాలు విడుస్తుంది. వారి హృదయాలలో వుండే రహస్యాలు వారితోనే అంతరించిపోతై; వారి వ్యక్తిత్వం వారితోనే అణగిపోతుంది. అలానే మన హృదయాలలో వుండే భావాలు మనలోనే అణగి మనతోపాటే భూస్థాపితమౌతై. గోరీలక్రింద శాశ్వతనిద్రలో మునిగివున్న శవాల హృదయాలు మనకు ఎంత అయోమయంగా వుంటాయో సజీవులై బజారులో తిరిగే వ్యక్తుల హృదయాలు కూడా అంతే అర్థమౌతై.

వ్యక్తిత్వవిషయంలో మహారాజైనా ఒకటే, సమస్త రాజ్యభారాన్నీ వహించే మహామంత్రైనా ఒకటే, లండన్‌లోకల్లా గొప్ప ధనికుడైన వ్యాపారస్థుడైనా ఒకటే, చివరికి గుర్రంమీద స్వారీచేస్తున్న వార్తాహరుడు జర్రీ అయినా ఒకటే. ఏవ్యక్తి గభీరమైన ఒక పరమరహస్యం. మెయిల్ కోచ్‌లో ప్రయాణంచేస్తున్న ఆ ముగ్గురు సంగతీ కూడా అంతే. ఒకడికొకడు దురవగాహమైన ఒక అయోమయం.

ఆ వార్త తీసుకుని జర్రీ గుర్రంమీద ఖులాసాగా తిరిగి వచ్చేస్తున్నాడు. మధ్యమధ్య రోడ్డుమీద తగిలిన సారాదుకాణాల దగ్గర దిగి, మితి మీరని పద్ధతిలో ఔన్సో అరౌన్సో మప్పితంగా పుచ్చుకుంటున్నాడు. నెత్తిమీది మడత టోపీ కళ్ళమీదిదాకా ముందుకు సరిజేసుకుని జాగ్రత్తగా ప్రయాణం చేస్తున్నాడు. కంఠానికీ గడ్డానికీకూడా కలిపి చుట్టాడు, పెద్ద వారాటి మఫ్లరు. దాని కొసలు మోకాళ్ళమీదికి వ్రేలాడుతున్నయ్. సారా తాగవలసివచ్చినప్పుడల్లా, ఎడమచేత్తో గడ్డంమీది మఫ్లరు కొంచెంగా క్రిందికి ఒత్తిగించి, కుడిచేత్తో సారా రెండు గుక్కలూ నోట్లోపోసుకుని, మళ్ళీ ఆ పని పూర్తిఅయిపోయిన వెంటనే, మఫ్లర్ యథాప్రకారం మూతిమీదికి సరిచేసుకుంటున్నాడు.

'లాభంలేదు జర్రీ! లాభంలేదు'—అదే పనిగా ఆలోచిస్తున్నాడు—'అలాంటి వ్యవహారాలు నీకు పనికిరావు; పలుగుర్లో మర్యాదగా బ్రతకవలసినవాడివి—"పునర్జన్మ"—ఇదేం మాట!—తప్పదాగినవాడు కాకపోతే యేఁవిటాపిచ్చి కూత!'—

ఈ వార్త అతనికెంతో చిరాకెత్తించింది. ఏఁవీ రవ్వంతేనా అర్థంకాక అనేకసార్లు, నెత్తిమీదినుంచి టోపీతీసి బుర్ర గోక్కున్నాడు. అతని మాడుపట్టు సున్నటి బట్ట తల; మిగతా తలచుట్టూ సీసాపెంకులు గుచ్చిన ప్రహరీగోడలాగు గరికల్లాంటి బిరుసువెంట్రుకలు యీతపొదలా పెరిగివున్నయ్—నుదురుమీదిదాకా. (ఒకరి తలమీదినుంచి ఒకరు గెంతిపోయే) కప్పగంతులాటకు గనక అతను సవాలుచేస్తే ఎంతలావు మనగాడికైనా గుండెలుండవ్, అతని నెత్తిమీదనుంచి ఉరకటానికి!

జర్రీ, యీ వార్తను తీసుకువెళ్ళి టెల్‌సన్సు బ్యాంకుగేట్లోవుండే కాపలామనిషికి చెప్పాలి. కాపలామనిషి ఆ వార్తను, బ్యాంకుపై అధికార్లకు అందజేస్తాడు. ఆ రాత్రివేళ అలా గుర్రంమీద వెడుతుంటే, ఆ చెట్లనీడలూ గుట్టల నీడలు అతనిలో అనేక రకరకాల భావాలను రేకెత్తించుతున్నయ్. ఆ వార్తవల్ల కలిగిన ఊహాల మాదిరి ఊహాలే కలుగుతున్నయ్. గుర్రం మనస్సులో కూడా అనేక ఊహాచిత్రాలు! దానికి కష్టసుఖాలకు సంబంధించినవి దానికి!

మెయిల్ కోచ్, అతలాకుతలమౌతూ రోడ్డువెంట పోతోంది. లోపలున్న ముగ్గురుప్రయాణీకులు మాగన్నుగా కునుకు తీస్తున్నారు. ఆ మగత నిద్రలో ఎవరి జీవితానికి సంబంధించినట్టు వాళ్లు ఏవేవో కలలు గంటున్నారు.

అనువాదం తెన్నేటి సూరి

మన బ్యాంకు ఉద్యోగి, పక్కనున్న పెద్దమనిషిమీద తూలి పడకుండా వుండటానికి, దండచెయ్యి కిటికీకి వ్రేలాడుతున్న తోలుపట్టాలో దోపి కళ్లు అరమూసుకుని కోడినిద్ర పోతున్నాడు. ఆ కలతనిద్రలో, అతనికి, కట్టెదుట కూర్చునున్న లావాటి ప్రయాణీకుడు, టెల్సన్సు బ్యాంకులా కనుపించుతున్నాడు. బ్యాంకివ్యాపారం ఉజ్వలంగా సాగిపోతోంది. గుర్రాలమెళ్లలో వున్న మువ్వల చప్పుడు రూపాయల మోతలా వినిపిస్తోంది. టెల్సన్సు బ్యాంకు అతఃపూర్వం ఎప్పుడూ నిర్వహించనంత పెద్ద పెట్టున వ్యాపారం అమోఘంగా సాగిపోతోంది. చెక్కులమీద చెక్కులు డ్రాఫ్టులమీద డ్రాఫ్టులు హుడావిడిగా మారిపోతున్నయ్. టెల్సన్ బ్యాంకు అడుగుభాగంలో వుండే ఇనప్పెట్టెల గదులూ—వాటిలో వుండే—నగలూ నాణాలూ—ధనరాసులూ—పెద్దపెద్ద తాళంచెవుల గుత్తులూ—ఆ గదుల్లో మిసుకుమిసుకుమంటూ వెలుగుతున్న కొవ్వత్తులూ—బ్యాంకియావత్తూ అతని కళ్లముందు తాండవమాడుతోంది. అతనితోపాటు బ్యాంకి కూడా తెల్లవార్లూ మెయిల్ కోచ్‌మీద ప్రయాణంచేస్తూనే వుంది. అతని బుర్రలో అదొక్కటేగాదు. మరొక ధోరణికూడా పనిచేస్తోంది. భూగర్భంలో పూడ్చిపెట్టబడిన ఒక వ్యక్తిని బయటికి త్రవ్వుకు వచ్చే ప్రయత్నంలో అతను ఇలా ప్రయాణమై వెడుతున్నాడు.

అతని మనోవీధిని కనుపించుతున్న వందలూ వేలూ, ముఖాల్లో భూస్థాపితుడైవున్న ఆ వ్యక్తి ముఖం ఏది? అదిమాత్రం గుర్తు తెలియడంలేదు—అన్ని ముఖాలూ ఒకేమాదిరిగా వున్నయ్; అన్నీ 45 సంవత్సరాల వయస్సుగల ఒకేరకం ముఖాలు! వున్న తేడా అల్లా, చివికి చీకాకై భీభత్సాకారంలోవున్న ఆ ముఖాల మీద కనుపించుతున్న భావాలలోనే ఆత్మాభిమానం—జుగుప్స—ధిక్కారం—మొండితనం—నిరాశ—దుఃఖం—ఒకదాని తరవాత ఒకటి వరుసగా కనుపించుతున్నయ్. వివిధభావాలతో ఇన్ని ముఖాలు కనుపించుతున్నా మొత్తానికి ఈ ముఖాలన్నీ ఒక్క మనిషివే. ప్రతితలా కూడా వయసు ముదరకముందే తెల్లబడి పోయినబాపతే. కునుకుతీస్తున్న బ్యాంకుఉద్యోగి ఆ ముఖాన్ని పదేపదే ప్రశ్నించుతున్నాడు:

'భూస్థాపన జరిగి ఎన్నాళ్ళయింది?'—

'పద్దెనిమిదేళ్లు'—

'త్రవ్వి బయటికి తీస్తారనే ఆశలన్నీ వదులుకున్నావ్?'

'ఏనాడో నిరాశ చేసుకున్నాను.'

'నీకు పునర్జన్మ లభించిందని తెలుసా?'

'అని అంటున్నారు'

'నీకు బ్రతకాలని వుందా?'

'చెప్పలేను'

'ఆవిణ్ణి నీకు చూపించమంటావా?—నువ్వొచ్చి ఆవిణ్ణి చూస్తావా?'

ఆముఖం, ఈ చివరిప్రశ్నకు "అవును," "కాదు," అంటూ, పరస్పరవిరుద్ధమైన అనేక సమాధానాలు చెబుతోంది. ఒకొక్కసారి గొణుగుడు స్వరంతో: 'కొంచెం ఆగు వెంటనే చూస్తే చచ్చిపోతానేమో'—అంటోంది. మళ్ళా 'పోనీ నన్నే అక్కడికి తీసుకువెళ్లు' అంటోంది—మళ్ళీ ఏదో అయోమయమై పోయి వెర్రి మొహంపెట్టి—'ఆ అమ్మాయెవరో నే నెరగను—నాకు అర్థంకావటంలేదు,' అంటోంది.

ఇలా, ఊహాసంభాషణ అంతమై తునిగిపోయినప్పుడల్లా—బ్యాంకు ఉద్యోగి తిరిగి తాను ఆ వ్యక్తిని భూగర్భంలోనుంచి బయటికి త్రవ్వుతున్నట్టు మరొక రకంగా కలగంటున్నాడు. విధివిరామం లేకుండా త్రవ్వుతున్నాడు. పార చేత బుచ్చుకు కొంతసేపూ—తాళం చెవి చేత బట్టుకుని కొంతసేపూ—చేతులతో పెళ్లగించటం కొంతసేపూ—ఇలా, దురదృష్టవంతుడైన ఆ వ్యక్తిని బయటికితీయటానికి నానాతంటాలూ పడుతున్నాడు. మచ్చెమటలు పడుతున్నయ్. అమ్మయ్యా! బయటికి లాగేశాం తలా మొహం యావత్తూ మట్టితో నిండివుంది! అయ్యయ్యో మళ్ళీ గోతిలో పడి పూడుకు పోతాడేమో! ఈ భావం తోచగానే అతను త్రుళ్ళిపడి నిద్రలేచాడు. ఆ నిద్రమత్తులోనించి వాస్తవిక జగత్తులోకి రావాలనే అపేక్షతో మంచూ, వర్షపుచినుకులూ బుగ్గమీద పడి చలిబాధ తెలిసేలాగు, కోచ్ కిటికీతలుపు వారగా తెరుస్తాడు.

అతను కళ్లు తెరుచుకునే కూర్చున్నాడు. కోచ్ దీపాల కాంతులు రోడ్డుమీద వలయాలుగా కనుపించుతూనే వున్నయ్. కాని రోడ్డుమీది చీకటిక్రీనీడలన్నీ అతని మనస్సులోవున్న నీడలలో లీనమై—కళ్లు తెరచుకుని వున్నా మళ్లీ అవే దృశ్యాలు కట్టెదుట కనుపించుతున్నయ్—బ్యాంకు, వ్యాపారం, ధనపుకొట్లు, తనకు వచ్చిన వర్తమానం, సర్వం మళ్లీ యధాతధంగా కనుపించుతున్నయ్. వాటి అన్నిటికీ మధ్య ఆ భీభత్స ముఖం ద్యోతమానమౌతోంది. ఆ ముఖాన్ని మళ్లీ అదేవిధంగా ప్రశ్నించుతున్నాడు:

'భూస్థాపన జరిగి ఎన్నాళ్లయింది'—

'పద్దెనిమిదేళ్లు'

'నీకు బ్రతకాలని వుందా?'

'చెప్పలేను'

మళ్లీ అదేరకంగా త్రవ్వటం సాగించుకుపోతున్నాడు — ఇంతలోనే ప్రక్కనున్న ప్రయాణీకుడు: 'కిటికీ మూసెయ్యరాదుటయ్యా!' అని చివాట్లేసేసరికి త్రుళ్లిపడి లేచి, కిటికీతోలుపటకాలోనుంచి నెమ్మదిగా చెయ్యి జార లాక్కున్నాడు. అలాగే, కునికిపాట్లుపడుతూ కూర్చుని ఆ యిద్దరి ప్రయాణీకులవంకా చూస్తున్నాడు. ఒకటిరెండు క్షణాలలో మళ్లీ మెదడు తలక్రిందులై బ్యాంకూ, సమాధిగొయ్యీ ప్రత్యక్షమైనయ్:

'భూస్థాపన జరిగి ఎన్నాళ్లయింది'

'పద్దెనిమిదేళ్లు'

'తవ్వితీస్తారనే ఆశలు వదులుకున్నావా?'

'ఏనాడో'—

ఆ మాటలు ఇంకా అతని చెవుల్లో వినిపించుతూనే వున్నయ్. ఇంతలోనే సూర్యకాంతులు కిటికీలోనుంచి కోచ్‌లోకి చొచ్చుకువచ్చి చీకటినీడలన్నీ అదృశ్యమైపోయినై ప్రయాణబడలికతో యాలగిలబడివున్న ప్రయాణీకుడు మేలుకున్నాడు.

కిటికీ సాంతం తెరిచేశాడు. చాళ్లుదున్నిన ఒక చేను కనుపించింది. చేనుమధ్యగా ఒక నాగలి కొట్టేసేని వుంది. చేను చుట్టూవున్న కొండ తంగేటిచెట్లు ఎర్రగా విరియబూసి మిడిసిపడుతున్నయ్; భూమి తడితడిగావున్నా ఆకాశం నిర్మలంగా వుంది. సూర్యుడు ఉజ్వలంగా గగనానికి ఎగప్రాకుతున్నాడు.

'అయ్యో పాపం! పద్దెనిమిదేళ్లు!—అనుకున్నాడు అతను, జాలిగా—ఆకాశంలోకి పొటమరించుకొస్తున్న సూర్యబింబం వంక చూస్తూ.

'నిండుప్రాణాలతో పద్దెనిమిదేళ్ల జీవసమాధి!'—

4

నానా అవస్థలూపడి, ఎలాగైతేనేం, మెయిల్ కోచ్ డోవర్ చేరుకుంది. కోచ్ "రాయల్ జార్జిహోటల్" ముందు ఆగేసరికి మధ్యాహ్నం దాటింది. మామూలుప్రకారం, హోటల్

నౌకరీల మేస్త్రీ స్వయంగా వచ్చి కోచ్ తలుపు తెరచాడు. ఆ తెరవటం ఏదో మహోత్సవం నెరపుతున్న వాడులా నిర్వహించాడు. అవును మరి, ఆరోజుల్లో, శీతాకాలంలో లండన్ నుంచి డోవరుకు ప్రయాణం చెయ్యటమంటే సామాన్య విషయమా? వాస్కోడిగామా భారతదేశానికి చేరుకున్నంత అభినందనీయమైన ఘనకార్యం.

అప్పటికి, కోచ్‌లో మిగిలివున్న ప్రయాణీకుడు మనబ్యాంకు ఉద్యోగి ఒక్కడే. మిగతా యిద్దరూ తమతమ ఊళ్ళదగ్గిర మధ్యే మార్గంలోనే దిగిపోయారు. కోచ్‌లోపలిభాగమంతా మంచుకు దమ్మ్రుకునుంది. తడిచెత్త ముంజుకంపు కొడుతోంది. తలుపు తెరిచేసరికి కుక్కలకొట్టాంలా వుంది జర్వీస్ లారీ ఒళ్లంతా చుట్టుకున్న గడ్డిపోచల బందాలలోనుంచి తెంపుకు ఎలాగోలా బయటపడ్డాడు. మీద కప్పుకున్న ఆ గొంగడి, ఆ బురదకాళ్లూ ఆ మురికి గుడ్డలూ—అతని వాలకమంతా, సరీగా ఓ పెద్దజాతి కుక్కలానే వున్నాడు.

'రేపు కేలేకి ఒక పాకెట్ పంపించాలి మేస్త్రీ!' అన్నాడు, లారీ.

'అట్టాగే సర్—గాలిగట్రా సరీగావుంటే—అట్టాగే పంపుదాం—పడకగది కావాలాసర్ ?'—

'రాత్రిదాకా పడుకోనక్కర్లేదు—కాని, విశ్రాంతి తీసుకోటానికి గది కావాలి—అన్నిటికంటే ముందు మంగలి కావాలి'

మేస్త్రీ తక్కిన నౌకర్లందర్నీ కేకేసి—తలోపనీ పురమాయించాడు :

'అయ్యగారి సామాను పెద్దభవంతిలో వున్న పడకగదిలో పెట్టండి—వేణీళ్లు చూడండి—అరే ఎవ్రడా!—మంగల్ని కేకెయ్!'—

మెయిల్ కోచ్ ప్రయాణీకు లెవరొచ్చినా పెద్దభవంతి పడకగదిలోనే మకాంచేస్తారు. సాధారణంగా మెయిల్ కోచ్ ప్రయాణీకులు ఆపాదమస్తకం కప్పుకునే వస్తారు. అందుచేత గదిలోకి వెళ్లేటప్పుడు ఒకేరకం మనుషులుగా వెళ్లినా లోపల దుస్తులు మార్చుకురావటం రకరకాల మనుషులుగానూ బయటికి వస్తారు. అలానే మన బ్యాంకుపెద్దమనిషి కూడా బయటికి వచ్చాడు. దాదాపు అరవై సంవత్సరాల ప్రాయంలోవున్న పెద్దమనిషి; పాతగిలిపోయిన గోధుమవర్ణం సూటు. పెద్ద పెద్ద మూతలున్న కోటు జేబులు, నలుచదరంగా కుట్టిన ముంజేతులు.

తనగదిలోనుంచి బయలుదేరి, దూరానున్న భోజనశాలకు వచ్చేలోగా, ఆయనకు, ఒక రిద్దరు మగ నౌకర్లూ, కొంతమంది ఆడ నౌకర్లూ,యజమానురాలు, త్రోవలో అక్కడక్కడ తారసిలి, విచిత్రమైన జంతువును చూసినట్టు చూసి పక్కలకు తొలగుతున్నారు.

భోజనశాలలో, ఆ మధ్యాహ్నం ఆయన ఒక్కడు మినహా మరొక రెవ్వరూ లేరు. ఆయన బల్లా, కుర్చీ నిప్పులగుణ్ణానికి దగ్గిరగా లాగివున్నయ్. ఆయన వెళ్లి, ఆ కుర్చీలో, ఫొటో తీయించుకోవటానికి కూర్చున్నట్టు, చేతులు రెండూ, కుర్చీపట్టెలమీద ఆనించి చలనరహితంగా కూర్చున్నాడు. నిప్పులగుణ్ణంలో మండుతున్న జ్వాలల కాంతులు ఆయనముఖంమీదికి ప్రసరించుతున్నయ్.

దైవప్రార్థన చేస్తున్న వాడిలా అచంచలుడై కూర్చున్నాడు. ఆయన వేయిస్టుకోటుజేబులోవున్న గడియారం ప్రార్థనగీతం పాడుతున్నట్లు, లయలో వినిపిస్తోంది. ఆయన పిక్కలు బాగా పైర్లు తిరిగి గుండ్రంగా వున్నయ్. వాటిని సిల్కు మేజోళ్లు బిర్రుగా అంటిపెట్టుకుని కదనొక్కుకున్నయ్. నెత్తిమీద నిగనిగలాడుతున్న ఒక 'విగ్గు' చెవులమీది దాకా అమర్చివుంది. (ఆరోజుల్లో మర్యాదస్తులైన వాళ్ళందా విగ్గులు ధరించేవాళ్ళు) కోటు లోపల తొడుక్కున్న చొక్కా, మేజోళ్ళ మోస్తరుగా మిస మిసలాడకపోయినా సముద్రపు కెరటాలమీది నురుగు దబ్బలులాగా తెల్లగా మెరుస్తున్నయ్. టెల్‌సన్సుబ్యాంకు బాణీకి సరిపోయేలాగు తనకున్న ఆవేశాల నన్నిటినీ మార్చుకుని అణచేసుకోవటంతో, ఆయనముఖంమీద యేవిధమైన భావరేఖలూ కనుపించకపోయినా, ఆ ప్రయత్నంలో ఆయనపడ్డ బాధంతా, కన్నీటిపొరజాలులో మిలమిలలాడుతున్న కనుగుడ్లలో స్పష్టంగా కనుపిస్తూనేవుంది. ముఖవర్చస్సూ అదీ, మంచి ఆరోగ్యంగల వ్యక్తిలా నేవున్నాడు. నుదురుమీద మాత్రం కొన్ని ఆందోళన రేఖలు సన్నటి ముడతలుగా ముడుచుకుంటున్నయ్. టెల్‌సన్సుబ్యాంకు, తాలూకు ఆంతరంగిక ఉద్యోగి బృందంలో బ్రహ్మచారులుగా వున్న వాళ్ళు కొందరికి స్వంతబాధ్యత లేమీ ఆటే లేకపోయినా, పరాయివాళ్ల బాధ్యతలుపట్టుకు వేధించుతూ వుంటై.

ఆకుర్చీలో అలాగే కూర్చుని, లారీ, కొంచెం గుడ్డి కునుకు తీస్తున్నాడు. నౌకరు భోజనం తెచ్చి బల్లమీదపెట్టిన అలికిడి తగిలి, కళ్లు విప్పి చూచాడు. కుర్చీ బల్లముందుకు లాక్కుంటూ నౌకరుతో :

'వేరే, ఒక ఆడమనిషికి, ప్రత్యేకం గది యేర్పాట్లు కావాలి; ఆవిడ ఇప్పుడో, ఇంకాసేపటికో వస్తారు జర్విస్ లారీ, అని గాని, టెల్‌సన్సుబ్యాంకు ఉద్యోగి అనిగాని అడుగుతుంది; నాతో వచ్చి చెప్పండి.'

'అట్టనే స్వామీ!—టెల్‌సన్సు బ్యాంకీ అంటే—ఆ లండన్ బ్యాంకీ యేనా స్వామీ!'

'అవును'

'అవును స్వామీ—ఆరంతా లండన్ నుంచి పారిస్‌కీ—పారిస్ నుంచి లండనుకూ తిరుగుతా, ఇక్కడ శానాసార్లు మాకాం శాత్తావుంటారు.'

'అవును మాకు పారిస్‌లో చాలా పనులుంటూ వుంటై. అసలు మాది చాలావరకు ఫ్రెంచి బ్యాంకే.'

'మిమ్మల్ని గాని, ఎప్పుడూ సూసినట్టు లేదు'

'నే నెప్పుడూ ఈమధ్య రాలేదు—మేము—నేను—ఎప్పుడో పదిహేనేళ్ల క్రింద ఒకసారి యిక్కడ మకాం చేశాను—ఫ్రాన్సునుంచి వస్తూ.'

'అయితే కావొచ్చుసామీ! అప్పటికింకా, నే నీ ఉద్యోగంలో చేరలేదు—అప్పటికి ఈ హోటలు మరో కావందు కింద వుండేది.'

'టెల్‌సన్సు బ్యాంకీ గొప్ప బ్యాంకీ అయివుండాల! ఏభై అరవై యేళ్లనుంచీ ఆ పేరు యింటానే వుండాం.'

'ఏభైఖర్మ్మేవిటి? నూటయాభైయేళ్లనుంచీ పేర్లో వుంది'—

'అవును అట్టనే సర్!'—

కళ్లూ మూతీ తుడుచుకుని ఆయన భోజనం చెయ్యటానికి ఉపక్రమించాడు. నౌకరు కుడిచేతిమీద వున్న మురికితువ్వాలు ఎడంచేతిమీద వేసుకుని, విశ్రాంతిగా గోడకి యాలిగిలబడి నిల్చుని ఆయనవంక తదేక ధ్యానంగా చూస్తున్నాడు.

భోజనం ముగిసిన అనంతరం, లారీ, కొంచెంసేపు తిరిగి రావటానికి అలా సముద్రపు ఒడ్డుకు వెళ్లాడు. డోవర్ పట్నానికీ సముద్రతీరానికి మధ్య సీమసున్నపు కొండలున్నయ్. సీమసున్నపు కొండల వెనక డోవర్ పట్నం, తల కొండగుట్లల్లో దాచేసుకుని

ముడుచుకుపడుకొన్న సముద్రపు నిప్పుకోడిలా వుంటుంది. సముద్రపు ఒడ్డంతా ఎడారిలా నిర్మానుష్యంగా వుంటుంది. ఇసుకా, రాళ్లూ ఎక్కడబడితే అక్కడ గుట్టలుబడి చెల్లాచెదురుగా వుంటై. సముద్రం కల్లోలంగా లేచి, సీమసున్నపు కొండలమీదా, నగరం మీదా గర్జిస్తూ వుంటుంది.

ప్రొద్దుతిరిగిన కొద్దీ, వాతావరణమంతా మళ్లా మసకమసక వేసి పోతోంది. అతఃపూర్వం దూరాన కనుపించుతున్న ఫ్రెంచి సముద్రతీరం అదృశ్యమైపోయింది. సముద్రగర్భంమీద పొగమంచు వ్యాపించిపోతోంది. లారీ మనస్సులో వున్న భావాలన్నీ కూడా మళ్లా యేదో మసకమసకగా అస్పష్టమౌతున్నయ్. మళ్లీ భోజనం బల్లముందు కూర్చుని మంటల్లోకి చూస్తూ, మనసులో తోవ్వాటం ప్రారంభించాడు. ముందున్న సారా సీసాలోనుంచి కొస్త కొస్తే ఖాళీచేస్తున్నాడు. ఇంతలోనే ఆవరణలోకి యేదో బండివచ్చినట్టు చక్రాలచప్పుడు వినిపించింది.'

చివాల్న గ్లాసుక్రింద బెట్టేసి: 'ఆవిడే అయివుంటుంది'అనుకుంటున్నాడు.

ఇంతలోనే, నౌకరు లోపలికివచ్చి :, లండన్‌నుంచి మిస్ మూసెట్ వచ్చారు. మిమ్మల్ని కలుసుకోవాలంటున్నారు!

మిస్ మూసెట్ త్రోవలోనే యేదో ఫలహారం తీసుకుంది. వెంటనే అప్రమేయమేమీ అక్కర్లేదు. ఓల్‌సన్ను ఉద్యోగిని తక్షణం కలుసుకొని మాట్లాడాలనే తహతహలో వుంది.

లారీ బల్లమీదపెట్టివున్న గ్లాసు పైకెత్తి ఆ గుక్కెడూ కూడా నోట్లో పోసుకొని విగ్గు సరిచేసుకున్నాడు. మిస్ మూసెట్‌ను కలుసుకోవటానికి, నౌకరు వెంట బయలుదేరాడు.

మిస్ మూసెట్ ఒక పెద్దచీకటి గదిలో కూర్చునుంది. లోపలున్న కొయ్య సామానంతా నూనెజిడ్డు గారుతున్నయ్. గది మధ్యలోవున్న బల్లమీద రెండు కొవ్వొత్తులు మినుకు మినుకుమంటూ వెలుగుతున్నయ్. ఆ గదిలో ఎక్కడేం వుందో తెలీడం లేదు.

ఆగదినబడి తడుముకుంటూ లారీ లోపలికి వెళ్లాడు. నేలమీదపరచి వున్న ఇక్ష్వాకుల నాటి తివాసీ పీచులు లేగి కాలికి చుట్టుకుంటోంది. మిస్ మూసెట్, ఇంకా, ఆ పక్కనున్న మరో గదిలో ఎక్కడో వున్నదనుకున్నాడు, లారీ కాని తీరా మైనపు వత్తులు వెలుగుతున్న మధ్యనున్న బల్లదగ్గరికి వెళ్లేసరికి, అక్కడొక స్త్రీ నిల్చునుంది. పదహారు పదిహేడేళ్ళప్రాయంలో వున్న పడుచు; యింకా ప్రయాణపు దుస్తులుకూడా మార్చుకోలేదు; అందమైన మనిషి; కొంచెం పొట్టికురచ; నిగనిగ లాడుతున్న బంగారు తలకట్టు. నీలపురాళ్ళలా మిల మిలలాడుతున్న కనుగుడ్లు. యౌవ్వనంతో మిసమిస లాడుతున్న నుదురుమీద సంభ్రమ భయాందోళనలు జిలిబిలిగా తాండవమాడుతున్నయ్. ఆ ముఖం వంకచూసేసరికి హఠాత్తుగా అతని మనస్సులో ఏదో ఒక స్ఫురణ కల్గింది. చాలా సంవత్సరాల క్రితం, తుపానురేగుతున్న అదే సముద్రంమీద ఫ్రాన్సునుంచి ఇంగ్లండుకు ఓడలోవస్తూ, అదే పోలికలున్న ఒక పసిబిడ్డను తాను ఒళ్ళో కూర్చోబెట్టుకు లాలించినట్టు ఒక స్ఫురణ కలిగింది. మరుక్షణంలోనే ఆ భావం మళ్లా అంతరించిపోయింది. ఆ స్త్రీ వెనకాలవున్న నిలువుటద్దం చట్రం మీద చెక్కవున్న నీగ్రోలబొమ్మలు అతని దృష్టిని మరల్చినై. గౌరవ పురస్సరంగా తలవంచి ఆ స్త్రీని ఆశ్వాసించాడు.

'అలా కుర్చీలో దయచెయ్యండి!' అన్నదా యువతి. ఆవిడ మాటలో, ఉండీలేనట్టుగా కొంచెం యాసకనుపించుతోంది.

పూర్వకాలపు మర్యాదల పద్ధతిని ఆవిడ చెయ్యి ముద్దుపెట్టుకుని తిరిగి మరోపర్యాయం తలవంచి అభివందనంచేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

'నాకు బ్యాంకునుంచి ఒక ఉత్తరం అందింది. ఆ వుత్తరంలో, మా నాన్నగారి తాలూకు, కొద్దిపాటి ఆస్తికి సంబంధించిన యేవో కొన్ని విషయాలు బయటకువచ్చినట్టు వ్రాశారు— ఆయన, నా పసితనంలోనే ఎప్పుడో చనిపోయారు నాకు తెలియనే తెలియదు.'

లారీ అద్దంచట్రం చుట్టూవున్న నీగ్రోబొమ్మలవంక బాధగా చూస్తున్నాడు.

'ఆ వ్యవహారం విషయంలో నేను పారిస్ వెళ్లవలసి వుంటుందని వ్రాశారు. అదే పనిమీద బ్యాంకి ఉద్యోగి నొకర్ని పారిస్ పంపుతున్నామనీ, ఆయన్ను కలుసుకోవలసిందనీ తెలియజేశారు.'

'అవును ఆ వెడుతున్నది నేనే'

'చిత్తం—నేను బ్యాంకికి వెంటనే సమాధానం వ్రాశాను. నేను ఫ్రాన్సుకు బయలుదేరుతున్నాననీ, తల్లీతండ్రీ దగ్గిర బంధువులెవరూ లేనిదాన్ని కావటంచేత, బ్యాంకినుంచి వెడుతున్న ఉద్యోగి వెంట తీసుకువెడితే కృతజ్ఞురాలననీ తెలియజేశాను'—

'సంతోషం—మీరు నాతోపాటు ప్రయాణం చెయ్యటం ముదావహం.'

'కృజ్ఞురాల్ని—తమరు నాకు, ఈ వ్యవహారానికి సంబంధించిన సమస్త వివరాలూ తెలియజేయగలరనీ, అవి సంభ్రమాశ్చర్యాలు కలుగజేసే సంగతులు కాబట్టి, వాటిని వినటానికి మనోబలం చేకూర్చుకుని సిద్ధంకావలసిందనీ హెచ్చరించారు—నేను మనస్తిమితం చేకూర్చుకున్నాను. ఆ వివరాలు వినాలని ఆతురతగా వుంది. దయవుంచి సెలవియ్యండి'—

'సహజం!— నేనూ...' — ప్రారంభించబోతో మళ్లా ఎందుకో హఠాత్తుగా ఆగి, విగ్గు సరిచేసుకున్నాడు.

'విషయం ఎలా ప్రారంభించాలో బోధపడటంలేదు'—

అతను ప్రారంభించలేదు. సందిగ్ధావస్థగా ఆవిడ కళ్ళవంక చూచాడు. ఆవిడ అతని ముఖంవంక, ఏదో చెప్పబోతున్నాడని ఆతురతతో చూస్తోంది. అతనిముఖంలో ఆవిడకు యేదో ఒక విషాదచ్ఛాయ పొడకట్టింది.

'ఏమండీ!—మీరునాకు సాంతం అపరిచితులేనా?'

'కాదామరి?'—అన్నాడు, రెండు చేతులూ బారచాచి, చిరునవ్వు నవ్వుతూ'.

ఆవిడ కనుబొమలు రెండూ దగ్గిరికి ముడుచుకున్నయ్. సాలోచనగా కుర్చీలో కూర్చుంది—అదివరకు నిల్చుని మాట్లాడుతున్న మనిషి. ఆవిడ ఆలోచించుతూ మౌనముద్రలో వున్నంతసేపూ, అతను ఆవిడ వంకచూస్తూ అలానే మెదలకుండావూరుకున్నాడు. తిరిగి స్ఫురణకు వచ్చి కన్నెత్తి అతని వంక చూడగానే, ఇలా ప్రారంభించాడు :

'మిస్ మూసెట్!'—

'సర్!—

'నేను వ్యాపారస్థుణ్ణి—వ్యాపార నిర్వహణబాధ్యతను నిర్వహించుతున్నాను—అలాంటి యంత్రం మాట్లాడుతున్నట్టే, నేను చెప్పేది విను—నిజానికి ఇందులో అంతకంటే నా ప్రత్యేకత ఏమీలేదు. మాతో వ్యాపార లావాదేవీలున్న ఒక కాతాదారుకు సంబంధించిన కథను యిప్పుడు నీకు చెప్పబోతున్నాను.

'కథా!'—

ఆవిడ ఆశ్చర్యాన్ని అర్థంచేసుకోని వాడులా నటించి! 'మా కంపెనీతో లావాదేవీలున్న వాళ్ల నందర్నీ—కాతాగార్లంటం మామూలు,' అంటూ కథ ప్రారంభించాడు. ★

భూప్రదక్షిణ

(8-వ పేజీ తరువాయి)

భావాలు మొలకెత్తకుండానే వుండాలి గాని ఎప్పుడో ఒకప్పుడవి బైటపడకుండా వుండవు. చాటుగా లోపల్లోపలే కుములుతున్న మూర్తి ఒక్కసారిగా తిరగబడి వేరింటి కాపరం పెట్టాడు అప్పుళ్ళోనే.

తీరా వేరుపడ్డాక గాని మూర్తికి తెలిసిరాలా కలిసి వుండటంలో వున్న సుఖం. వచ్చే జీతం రాళ్ళేటు పోతాయో గాని నాలుగో తారీకనించే అప్పుకు బయల్దేరాల్సి వచ్చేది. పోనీ వెళ్ళి మళ్ళా తండ్రితో కలిసి వుందామన్న ఆలోచన ఎప్పుడైనా తట్టినా అభిమానం దాన్ని పక్కకి నెట్టేసేది. ఇద్దరితో మొదలైన సంసారానికి ముగ్గురు పిల్లలు కూడా. తినో తినకో అలాగే నెట్టుకొస్తున్నాడు రోజులు.

*   *   *

యింటికొస్తూ ఆలోచనలో పడ్డాడు మూర్తి. "తారీకింకా నాలుగు రోజులుంది గదా. జేబులో కానీ లేకుండా ఎలాగడపటం" అని. పొద్దుటిబట్టి ఆ ఆలోచనే అతన్ని వేధిస్తోంది. బుర్రంతా వేడెక్కింది. ఏమీ పాలుపోవటం లేదు. అప్పుకు పోదామన్నా అందరి పరిస్థితులూ అలాగే వున్నాయి. నేల మీద పారాడుతున్న పంచె కుచ్చెళ్ళైనా సర్దుకోకుండా నడుస్తున్నాడు రోడ్డు మీద.

"ఆఫీసునించేనా ?" అన్న మాటలు విన్నదాకా వాస్తవిక జగత్తులోపడలా మూర్తి. ఎవరా అనుకొని తీరా వెనక్కి తిరిగి చూస్తే ముసలితండ్రి అవుపడటం మూర్తిని చాలా బాధపెట్టింది. కష్టసుఖాలు చెప్పుకుని కాస్తంత మనశ్శాంతి పొందుదామనుకున్నాడు. దిక్కుమాలిన అభిమానం అడ్డొచ్చింది. జవాబియ్యకుండానే చకచకా నడిచాడు "నిన్నేరా అగమంటం. అలా వున్నావేం ?" అంటున్న ముసలితండ్రి మాటలుకూడా వినిపించుకోకుండా "యిప్పటి కొక్క వలసివచ్చింది కాబోలు నేనెలా వున్నానో" గొణుక్కున్నాడు తనలో తానే.

గబగబా యింటికెళ్ళాడు పెద్దపెద్ద అంగలేస్తూ. అసలే వుక్రోషంతో వున్న మూర్తికి "తల్లిదండ్రులను గౌరవించవలెను" అని వీధిగదిలో చదువుతున్న కొడుకుని చూడటంతో వంటికి కారం రాచినట్లయింది. గట్టిగా వీపుమీద చరిచాడు. "పడుకో వెధవా" అని.

"లోజూ చదువుకోమని కోప్పత్తావే అన్నాయిని. మలి చదువుకుంతుంతే కొత్తావేం నాన్నా" అని వచ్చీ రాని మాటలతో ఏణ్ణర్ధం పిల్లకూడా అన్నతో శృతి కలపాలి సొచ్చింది.

"అల్లా కొట్టుకుంటారేమండీ పిల్లల్ని వాళ్ళిప్పుడేం తప్పుచేశారని ?" అంది భార్య రాధమ్మ అతని అసందర్భపు కోపాన్ని అర్థం చేసుకోలేక.

"నోర్ముయ్. నీకెందుకు ? నా పిల్లల్ని నేను కొట్టుకుంటా. నాయిష్టం" కసురుకున్నాడు మూర్తి. మరి మాట్లాడలేదు రాధమ్మ.

భోంచేసి పడుకున్నాక యింటి కప్పు కేసి చూస్తూ అన్నాడు మూర్తి. "పిల్లలు పడుకున్నారా ?"

"ఆ. యిప్పుడే పడుకున్నారు మీ ధర్మమా అని యింతదాకా ఏడ్చి." అన్నాయి నొక్కులు నొక్కింది రాధమ్మ.

బట్ట సరిచేసుకుంటూ లేచాడు మూర్తి. పిల్లల్ని దగ్గిరకి ముద్దెట్టుకున్నాడు అమాంతంగా. కళ్ళమ్మట నీళ్లుకూడా కార్చాడు "మిమ్మల్ననవసరంగా కొట్టాను నాన్నా" అంటూ.

"పసిపిల్లల్ని అలా నిద్రపోతుంటే ముద్దెట్టుకోకూడదు. అయినా యిప్పుడే మంత మించిపోయిందని" రెక్క పట్టుకు లేవదీస్తూ అంది రాధమ్మ.

"అయితే పెద్దయాక మనల్ని పిల్లలు సరిగా చూస్తారంటావా ?" అన్నాడు మూర్తి దుప్పటి కప్పుకుంటూ.

"ఏమిటా పిచ్చిమాటలు పడుకోక." పక్కగా వత్తిగిల్లింది.

క్షణం అయాక ఉన్నట్టుండి లేచి చొక్కా వేసుకు బయల్దేరాడు "నాన్నతో మాట్లాడివస్తా. పనుందం"టూ.

అర్ధరాత్రి పదకొండు గంటల వేళ యిన్నాళ్లుగా లేనిది యివాళింత హఠాత్తుగా మాట్లాడాలిసిన పనేమిటో అర్థంకాక శూన్యంలోకి చూస్తూ నిలబడి పోయింది రాధమ్మ.

★

జిగిబిగి

శ్రీ అంగర వెంకటకృష్ణారావు

నేను కథ వ్రాయడానికి కలం తియ్యగానే అది నన్ను ప్రశ్నిస్తుంది. 'ఏం వ్రాయబోతున్నావు' అని. అది యెదురింటి కోడలు భర్తని వేసిన 'ఎక్కడికెడుతున్నావు' అన్న ప్రశ్నతో జట్టు కడుతుంది.

ఇందుకే నేను విరివిగా వ్రాయలేను. కలం క్రిందపెట్టి, పైమీద తువ్వాలు వేసుకుని బయల్దేరుతాను. అలాగే రెండేళ్ల క్రితం బయల్దేరిననాడు యెదురింటిపిల్ల తొక్కుడుపోలేయడానికి వీధిలోకివచ్చి, యాదాలాపంగా నాకేసి చూసినప్పుడు, ఆమె భర్తయెక్కడనుంచోవచ్చి, భార్య చెంపమీద ఛెళ్లునవేసి, నావేపు వోరగా యెఱ్ఱగా చూస్తూ లోపలికి చరచర పోయేడు.

నేను కలాన్ని అడిగేను, యెందుకలా యెదురు ప్రశ్నలు వేస్తావని. అప్రక్కనే, చెట్టునీడని కూచుని మా పొరుగింటి పెద్దమనిషి తన పెళ్ళిలో గన్నెట్టు, బ్యాండు, పిల్లనగ్రోవి వాద్యాలు పెట్టేరని యెవరో స్నేహితుడితో చెబుతున్నాడు.

'పందిలాగు తిని పోతరిస్తావు — అంతసేపు భోజనమా' అని భార్యచెవులు పట్టుకుని లేవదీసి దావగొట్టేడుట యెదిరింటాయన. మా ఆవిడతో వచ్చి మధ్యాహ్నం చెప్పుకుంది. కలం అంది 'నువ్వు వ్రాసేవి తొందర తొందరగా వ్రాస్తే తప్పులౌతాయి, ఆలోచించి నిదానంగా వ్రాయి' అని. నేనన్నాను 'ఆలోచించి నిదానంగా వ్రాయడానికి కాలం పడుతుంది. కాలం మారిపోతే విషయాలతత్వం మారిపోతుంది. నిన్నటి ఒప్పు నేడు తప్పు' అని.

నాకు విసుకేసింది. సంజపడుతూంది. ఎదురింటి పిల్ల వెడిపోతూంది జోరుగా. లేత గులాబిరంగు చీరలోంచినాగుపాములా పొడుగాటి జడ, తెల్లటి జాకెట్టు అగుపిస్తూ ఆమె ప్రత్యక్షదైవానికున్న పరమ రహస్యాన్ని అవహేళన చేస్తూన్నాయి. నన్ను బిక్కు బిక్కు చూసింది. ఆమెను చూస్తే నాకు జాలి. పచ్చనిశరీరం, నల్లగలువల్లా చెంపకు చేరజేసి కళ్లు కాపురానికి వచ్చిన దగ్గిరనుండీ అవి చకితకురంగీ లోచనాలే.

మధ్య తోవలో పొరుగింటాయనతగిలేడు. 'ఏటిలా తొందరగా' నా ప్రశ్న. పాలడబ్బా చూపిస్తూ, తొందర తొందరగా అంటున్నాడు... 'పిల్లకి పాలడబ్బా... పొద్దున్నే అయిపో వచ్చింది......మా ఆవిడ...!

నేను లోలో నవ్వుకుంటాను 'సరే వెళ్ళండి.' నాలో అనుకున్నా ఆలస్యం అయితే బుగ్గలు మూరెడు సాగుతాయి... 'అన్నట్టు, యేమండోయ్! అది పాటినూల పంచలావుంది...ఎంతికి కొన్నారు?' అతడికి చమట పోస్తుంది. 'అదే అదే. ఇదే కట్టుకోడం. పాటినూలే. ఎంతుంటుందో ...నలభై చేస్తుందంటారా ... పెళ్లిలో అత్తవారు...ఏదో సందర్భంలో...ఒస్తా ...పాలడబ్బా..' అతని అవస్థకి నాకు నవ్వొస్తుంది. 'సరే వెళ్ళండి'

ఐదు నిముషాలు లేటయింది. ఆ పిల్ల యెటో వుడాయించింది. రేలంగిలా నా కలం జేబులోంచే మొఱిగింది, 'వెడిపోయిందేమిటి, తప్పు తప్పు. అదేమిటా దుకాణంలో! ఇలాగే అవకతవకలు వ్రాస్తావు!'

దీపాలు వెలిగినవేళ నేనూ వెళ్లా షాపులోకి.

'ఈ రిబ్బను బాగుందండీ సీతమ్మగారూ— మావాళ్ళకి తీద్దామని...' ఆమె బిక్కు బిక్కుగా నా గుండెకేసి చూచింది. ఆ చూపే అనుకున్నా అంత గట్టిగా గుచ్చుకుంది, నిజానికి కాదు. నా కలం గుండెల మీద తన్నింది. 'సీతమ్మగారేమిటి? ఆమె కష్టాలు పడుతూందని, నీకు కవిత్వం వచ్చని నోటికేపేరువస్తే అదే?' నేను సర్దుకొన్నాను. ఇంతకీ ఆమె పేరేమిటి?

చల్లటిగాలి. పార్కులో, వుద్యానవనంలో, యెవ్వరూ చేరని కాసా సిమ్మెంటరుగుల వెనక, కోడిజుత్తు చెట్లకీ పిట్టగోడకీ నడుమ...'పార్వతి అని పిలుస్తారు నన్ను...'

నా హృదయంలో, మంచు మలశిఖరం మీద పరమశివుడి నాట్యంలో మైమరచిన అర్థభాగపు తన్మయనేత్రాలు మెరిసేయి. ఆదిలో సాయపడవచ్చిన మదనుడు వంచిన విల్లువంపుతో వంగిన ఆ హిమాచల పుత్రి కనుబొమలే యివి. వెంటనే మళ్ళీ నా గుండెల్లో యేదో గుచ్చుకుంది. మదనబాణం కాదు, మళ్ళీ నా కలమే.

'ఇంకో తప్పు.. ఇది ఆ పార్వతి కాదు. ఇది శరత్కవి దేవదాసులో పారిన కన్నీటి వరద.'

పిట్టగోడవెనక మైదానం సిమ్మెంటరుగుమీద యెవరిదో కంఠం. అతడే మా పొరుగింటాయన. ఎవరో స్నేహితుడితో అంటున్నాడు.

'జానండీ సినీమాకు వెళ్లిందిలా వుంది.'

'డబ్బాలా వుందే. కీనీడలో సరిగా ఆనడం లేదు'

'అలాగే...పాలడబ్బా......బజారుకు వచ్చి యింటికి వెళ్ళేలోగా ఆవిడ సినీమాకు వెళ్లింది కామోసు'

'భోంచేసేరా?'

అతడు పొడిగా నవ్వేడు. ఆ నవ్వు యే అర్థం పడితే అదే యిస్తుంది

'అదృష్టవంతులు. పెళ్ళయిన కొత్తలో మిమ్మల్ని చూడగానే పోల్చేను. మీ భార్య మిమ్మల్ని వో పిల్ల జమీందారుగా చేసింది. ఏం అభిమానం మీ ఆవిడకి మీమీద!' దీనికీ అదే నవ్వు సమాధానం.

వెక్కి వెక్కి యేడ్పు నా పరధ్యానాన్ని యెగరగొట్టింది.

'ఏడ్చి యేం ప్రయోజనం పార్వతీ.

ధైర్యం వహించు.' ఆమె పీవు నిమరబోయేను. ఆమె అదోలా బాధ పడినట్టు పీవు వంచింది.

'పురుషులా?' ఆమె పెదవులు స్పందించిపోయేయి. ఆమె మనసుమీది గాయాన్ని అదర్శం కప్పటిలా కప్పతూంది. ఆమె వెక్కి వెక్కి యేడుస్తూ అంటుంది—'శరీరమల్లా నొప్పులే. రోజూ వేధిస్తూంటాడు'

'అతడికి వెర్రా?'

తల క్రిందకు దించి, పైకి బెదురు చూపులు చూస్తూ అంది, 'అనుమానం'

'మరిప్పు డెలా వచ్చావు?'

'ఇవాళ మీటింగుట. ఊరంటే మొహం వాచిపోయింది'

'తెలిసిపోతే?'

'విరగ్గానికి యెముకలు మిగిలితేనా?'

'దీనికి అంతేమిటి?'

'సముద్రం'

'అంతపని చెయ్యకు. ధైర్యం వహించు' మళ్లీ గుండెలమీద తన్నింది నా కలం.

'ఒకసారి అన్నావు, వూరుకున్నాను. మళ్ళీ ధైర్యం చెబుతావు ఆడవాళ్ళకి! నీకుందీ ధైర్యం? ధైర్యం వుంటే నువ్వా కలెక్టరాఫీసు వుద్యోగానికి రాజీనామా యెందుకిచ్చేవు?' నాకు ఉడుకుమోతుతనం వచ్చింది.

'అవినీతికి జడిసి'

'అదీ వో మాదిరి పిరికితనమే కదా. అక్కడ నీతిగా బతకలేవా?'

'అలా ప్రయత్నిస్తే బ్రతుకు నాశనమౌతుందని పోల్చా'

'చూడు ఆ దొంగలపల్లి పాషాణరావు యెలా ఆర్జిస్తున్నాడో సవ్యసాచిలా...'

'అతడు శవాల్ని రాబందుల్లా, బ్రతికున్న వాళ్ళని పొడుచుకు తింటాడని, అతనితో మాట్లాడేది డబ్బే గాని మరోటి కాదని ప్రతీతి. అతడు సిరద్దారుగా వున్నప్పుడు, రాత్రి పగళ్లని తారుమారు చేసేడు. అతడి చలవకి యెన్నో పేద సంసారాలు చల్లారేయి'

'అయితే నేం, అతడు నిర్వాకం చేస్తున్నాడు'

'కొంపలు కూల్చడం నిర్వాకమా?'

'వెఱ్ఱిమాటలాడకు. అతడికి చెయ్యెత్తి దండం పెట్టేవారే గాని, నిందించే వొక్కరూ లేరు'

'ఛీ ఛీ! నువ్వు నా కలానివేనా! పదేళ్ల క్రితం యీ పాషాణరావు కుమాస్తాగా ఉన్నప్పుడు, యెంతో సత్యసంధుడని, న్యాయశీలుడనీ పొగిడేదానివి. ఇప్పుడిలా ప్లేటు మార్చేవా?'

'నేను మార్చేదేముంది. అదే మారింది. దేశమే మారింది. కాలమే మారింది. దీపముండగానే తెలివైన ప్రపంచం చక్కబెట్టుకొంటూంది.'

ఆమె కొనుక్కున్న రిబ్బను కూడా నాకిచ్చి వెడిపోతుంది. 'నా కెందుకూ?' ఆమె వెనక్కి తిరిగి వొక్కసారి బిక్కు బిక్కు మూసి చరచర నడిచింది.

ఇది గంటేళ్ల క్రిందటి విషయం.

'ఏమిరోయ్?'

'ఎవరు...శివానందం! ఎక్కడనుంచి దిగబడ్డావు?'

'చెప్తా. తొందరపడకు. మనం యిక మీద తరుచు జతపడుతూంటాం...అన్నట్టు మా మూర్తి యిక్కడే వున్నాడా యింకా?'

'ఏ మూర్తి!'

'వాడురా. మీ పొరుగునే వుండేవాడు కదూ... పి. డబ్ల్యు. డి. సూపరువైజరు..'

'ఓహో అతనా...సుకుమారం...'

'నిజంగా అంతేరా.....చదువుకునే రోజులలో వాడు పిల్లిలా నడుస్తూ, మేకపిల్లలా మాట్లాడేవాడు. ఎంత సాత్వికుడనుకున్నావ్!'

ఇద్దరం 'కా కా' హోటలులో కూచున్నాం. మాటల సందడిలో సాయిబు 'ఏం కావాలి' అని అడిగినది వినబడనే లేదు.

'కాని వొక వాడికి హిడింబిలాంటి భార్యని కట్టబెట్టేరు సుమీ. వాడు బియ్యే పూర్తిచెయ్యగానే పిల్లని పంపమంటే, తల్లిదండ్రులే పంపలేదో, ఆ పిల్లే వెళ్ళనన్నదో, మొత్తాని కెలాగైతేనేం వాడి కాపురం ఆరంభం కాలేదు. మేం వుడికించేవాళ్లం...'

'ఏం కావాలీ సార్'

దుకాణంవాడికి నేను జవాబిచ్చా రెండు కప్పుల మంచి 'టీ' అని.

'ఆమ్లెట్ తినవూ?' శివానందం.

'క్షమించు'

'ఓరినీ ఆచారంమండ...అబ్బాయ్... నాకో డబుల్ ఆమ్లెట్...కొంపతీసి బాతుగుడ్లు కాదుకద...!

'కాదండీ తాజా కోడిగుడ్లే'

'బ్రదర్. వాడి భార్య వొస్తూనే వేరింటికాపరం పెట్టింది. వాడి ప్రాణాలు కొరుక్కు తినేదట...ఇంకా మీ పొరు

(40-వ పేజీ చూడండి)

తప్పెవరిది?

నేను స్కూలుఫైనల్ చదువుతుండే రోజులవి. మామూలుగా సాయంకాలం స్కూలునుండి వచ్చి, పుస్తకాలు బీరువాలో వదేసి వీధి అరుగుమీద కూర్చున్నా! "నాయనా! రేపు స్కూలుకు వెళతావేమో మర్చిపోయి, సెలవుపెట్టు." అంది మా అమ్మ వెనకాలేవచ్చి. "ఏం సంగతమ్మా!" అన్నాను. అదేమిట్రా! ఇంతట్లోకే మర్చిపోయావ్! రేపు మన అవధాన్లు మామయ్యగారింట్లో శుభకార్యం జరుగుతుంటేను" అంది.

"ఏం శుభకార్యమమ్మా?" "సరిపోయిందిరా! రేపు మన కామాక్షికి శోభనం కదూ?"

"అయితే నేనెందుకు సెలవుపెట్టాలి?"

"అలాగంటా వేమిట్రా! మామయ్యగారు మరీమరీ చెప్పారు, రేపు మనల్నందర్నీ భోజనానికి రమ్మనమనీ."

"నాకు పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి. ఇప్పుడు సెలవుపెట్టడానికి వీల్లేదు. అయినా చూస్తాలే" అన్నాను ఏదో ఆలోచిస్తూ.

"రా! శోభనం పెళ్ళికూతురా! అప్పుడే మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నావ్. ఇంక రేపు కాపురంచేస్తుంటే, ఎప్పుడైనా గుమ్మంలోకి వస్తే ఎవరుమీరని అడుగుతావు." అంది మా అమ్మ, అప్పుడే వస్తున్న కామాక్షిని చూసి.

"రేపు మీ బావ స్కూలుకి వెళతాట్ట. అదేమిటో నువ్వే చూడమ్మా. నే నెన్ని సార్లు చెప్పినా ససేమిరా అంటున్నాడు." అంటూ మా అమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

"అనిల్‌కుమార్"

"అవునా! బావా? అంది కామాక్షి!

"ఏమిటి!" అన్నాను.

"రేపు స్కూలుకు వెడతావా?"

"మరి...కార్యం నీకైతే...నేనెందుకూ...మధ్య...అయినా నాకు పరీక్షలు దగ్గరికి వస్తున్నాయి."

"రేపు వెడితే నామీద వట్టే..... మా నాన్నగారు కూడా చెప్పమన్నారు నీతో. 'రేపు సుందరం బావ మరిచిపోయి స్కూలుకు వెడతాడేమో, వెళ్లొద్దని చెప్పిరా' అని."

"అయితే పిలుపు పిలవడానికి వచ్చావన్న మాట" అన్నాను నవ్వుతూ.

"పో! బావా! నీకంతా వేళాకోళమే. పిల్లికి చెరలాటం ఎలక్కి ప్రాణసంకటంలా వుంది. అయినా బావా......" అంటూ అదోలా ముఖం పెట్టింది కామాక్షి.

"ఏమిటది కామాక్షీ!" అన్నాను ముఖంలోకి చూస్తూ.

"నాకేదో భయంగా వుంది బావా..." అంది. నాకు ఆపుకోలేనంత నవ్వు వచ్చింది. అది చూచి కామాక్షి ఏమనుకొందో ఏమిటో "నన్ను చూస్తే నీకంత నవ్వులాటగా వుంది" అంటూ చిరుకోపంతో రివ్వుమని మెరపులా వాళ్లింటికి వెళ్లిపోయింది.

అవధాన్లుగారి కుటుంబానికీ, మా కుటుంబానికీ కొంచెం దూరపు బంధుత్వం వుంది. అవధాన్లుగారికి బాగా వయస్సు వచ్చిన తర్వాత పెళ్లి అయింది. అయినా వారిది అనురాగ దాంపత్యం అనడానికి అభ్యంతరం ఏమీ లేదు. వారికి అపురూపంగా పుట్టింది ఈ కామాక్షి. తల్లో నాలుకలా వుంటున్నారు ఈ రెండిళ్ల వాళ్లూ. నేను థర్డుఫారం దాకా మా పిన తండ్రిగారి ఊళ్లో చదివాను. తరవాత మళ్లీ మా వూరు వచ్చేశాను హైస్కూల్లో చదువుకి. ఈ రెండు మూడేళ్లలోనూ, కామాక్షికీ నాకూ అపరిమితమైన చనువు ఏర్పడిపోయింది. ఎనిమిదవ ఏటే కామాక్షికి పెళ్లి చేశారు. అది తలచుకొంటే నాకు కామాక్షిమీద ఎంతో జాలి వేస్తుంది. శాస్త్రము, మతమూ పేరిట ఈ పండితులు చేసే దురంతాలకు పట్టరాని ఆగ్రహం వచ్చింది నాకు.

కామాక్షికిప్పుడు 12వ ఏడు. పసిడి కలాకలా వుంటుంది. తొలి యవ్వనపు వెలుగులు విరజిమ్మే విశాల నయనాలు. అందులో కాటుకకళ్లు. నవ్వితే ముత్యాలు రాలుతాయి. ఎప్పుడూ నవ్వుతోనే వుంటుంది నన్ను ఒక్కక్షణం చూడకపోతే "బావ ఇంకా రాలేదూ..." అంటూ మా ఇల్లంతా కదను త్రొక్కుస్తుంది. అటువంటి కామాక్షికి ఎటువంటి ద్రోహం చేశారు ఈ పెద్దలు! కామాక్షి తల్లికో తమ్ముడున్నాడు. అతనికి మొదటిభార్య పోయింది. కూతురికి ఎక్కడో దూరపుసంబంధం ఎందుకు, తన తమ్మునకిచేస్తే, దగ్గరగా కంటికి కనబడుతూ ఉంటుందని అతనికిచ్చి ఆఖరికి కట్టబెట్టారు. అతని వయస్సు సుమారు ముప్పైఅయిదు వుంటుంది. పొట్టిగా, లావుగా, చామనచాయగా వుంటాడు. ఉబ్బసరోగం. రైల్వేలో అసిస్టెంటు స్టేషనుమాస్టరుగా పని చేస్తున్నాడు. పెద్దల సులువుబలువులకోసం అన్నెమూ పున్నెమూ ఎరుగని అమాయిక కన్యల జీవితాల నిలా ఆహుతి చేస్తున్నారు. ఇవేనా, మునీశ్వరులు లిఖించి విడిచిపోయిన ధర్మశాసనాలు? అతనికి వండిపెట్టే వాళ్లు లేక నానాయిబ్బంది పడుతున్నాట్ట. అందుచేత కామాక్షి పెద్దమనిషవకుండానే కార్యం చేస్తున్నారు! ఈ అడ్డు రోజంతా తీరిపోతే అతను తీసుకెళ్ళడానికి అనుకూలంగా వుంటుందని.

మరునాడు పగటి కార్యక్రమం అంతా దివ్యంగా జరిగింది. ఇంక రాత్రి కార్యక్రమం అంతా ఆడవాళ్లదే. ఇదంతా చూస్తోంటే, నాకు నిజంగా, వీళ్ళంతా మనుష్యులా, పశువులా అనిపించింది. మొగుడంటే ఏమిటో తెలియని అజ్ఞానపుదశలో పెళ్ళయింది. ప్రపంచమంటే ఏమిటో తెలియని పసిప్రాయంలో కార్యమా? ఆ సాయంత్రం అవధాన్లుగారు నన్ను పిలిచి "సుందరం! బజారుకెళ్లి చామంతిపూవులూ పంచదార చిలకలూ పట్టుకురా" అంటూ నా చేతికి డబ్బిచ్చారు. లేనంటే, ఏం కొంపమునుగుతుందో అని ఎల్లాగో వెళ్లివచ్చాను. ఇంక వాళ్ళింటికి వెళ్ళలేదు ఆరోజుకి. మరునాడు మామూలుగా స్కూలుకు పోయాను. రాత్రిభోజనం చేసి వీధి అరుగుమీద గదిలో కూర్చున్నాను చదువుకోడానికి. మా అమ్మకూడా పని పాటలుచేసుకొని అరుగుమీదకి వచ్చింది. ఇంతలో ఒక్కొక్కళ్ళే కమిటీ సభ్యులంతా వచ్చి చేరుకొంటున్నారు. అందులో ముప్పాతికమంది ఆరితేరిన అయిదోతనం లేని అతివలే, ఒక్క మా అమ్మ మినహా. మా అమ్మ ఈ సభకి అధ్యక్షురాలు.

'నిన్నరాత్రి పడకటింటి ముచ్చట్లు ఏమైనా తెలుసునటే వెంకటలక్ష్మీ నీకు" అంటూ ప్రస్తావన బయలుదేరింది.

"ముచ్చట్లు ఏమిటే...ఏడుపులూ పెడబొబ్బలూను" అంది ఓ ముసలావిడ.

"అసలు ఇంతకీ ఏం జరిగిందేమిటే పిన్నీ..." అంది ఓ బాల వితంతువు

"ఏం జరగడం ఏమిటే నీ మొఖం వచ్చేట్లాదాన్ని బాదేడట, కుర్రపిల్లదానికేం తెలుసునని చెప్పవోదినా"

"అయినా సమర్తాడకుండా శోభనం చేయడం ఏమిట్రా!" అంది పళ్ళూడిపోయిన ఓ ముసలమ్మ వణుకుతూ.

"అదేమిటమ్మా! అంతా చోద్యంమీది. కామాక్షీ తల్లిమాటేమిటో చెప్పదురూ ఒక్క ముక్క. ఆవిడకు మాత్రం సమర్తాడకుండానే కదూ కార్యం జరుగుతా... ఆ తల్లి సాంప్రదాయమే దీనికిన్నీ" అంది ఓ ముప్పులేని ముత్తైదువ.

"ఏదో కుర్రపిల్లవునా...సిగ్గు చేతో మరేమో తలుపు వాదిగట్టుకేఅలా కూర్చుండి పోయిందట. మరి ఆ మొగుడు అంత ఎద్దు మొద్దు స్వరూపం అవుతే ఎల్లాగూ. రెండుసార్లు పిలిచి మూడోసారి రెక్కపట్టుకు లాగాడట.

అది రానని గింజుకొందిట. ఆ పళంగా అలా పట్టుకొని "ఛెళ్లు, ఛెళ్లున లెంపలు వాయించేయడమే! దాంతో అది ఒకటే గోల. ఆ మొగుడు తలుపు తీసుకొని యివతలకి వచ్చేశాడట ధుమ ధుమ లాడుతూ. ఈ రోజు అసలు అది గదిలోకే వెళ్లనందిట. ఆఖరికి బ్రహ్మాండంమీద తల్లీ, తండ్రీ నచ్చజెప్పి, దాన్ని ఏమీ అనవద్దని అల్లుడికి మనవి చేసుకుని ఎల్లాగైతేనేం లోపలికి తోసి గొళ్లెం పెట్టారట."

"ఇంత రభసా జరిగిందన్న మాట. నాకు కొంచం గూడ తెలియలేదు పిన్నిగారూ"

"అదంతా సరేగాని, ఎల్లుండి దాన్ని తీసుకుపోతాట్ట కూడాను."

"బాగుంది. చాలా అందంగా వుంది.



ఆఖరికి కుఱ్ఱదాన్ని, ఆ వూరుకాని వూరు తీసుకెళ్లి ఏం బాధలు పెడతాడో" అంటూ అందరూ సానుభూతి తెల్పుతూ ఎవళ్ళ తన్న వాళ్లు వెళ్లిపోయారు.

మర్నాడు మేము కాఫీ త్రాగుతుంటే, కామాక్షి మొగుడు మా యింటికి వచ్చాడు. "ఏం! పిన్నీ బాగా వున్నారా? బాబు ఊళ్లో లేరా ఏమిటి? ఎక్కడా కనబడ లేదు" అని పలకరించాడు.

"రా నాయనా! ఇలా కూర్చో! ఏదో ఇలా ఉన్నాం. మీ బాబుగారు ఏవో పెళ్లిళ్లు చేయించడానికి వెళ్లారు. అంతా నాలుగు రోజులయింది. బహుశా రేపు రావచ్చు. కొంచెం కాఫీ పుచ్చుకో" అంటూ గ్లాసు చేతికందించింది. కాఫీ త్రాగేక గ్లాసు కిందపెడుతూ నన్ను చూసి "ఏరా! సుందరం! ఏం చదువుతున్నావు" అన్నాడు. "స్కూలు ఫైనలు చదువుతున్నానండి" అన్నాను. "బాగుంది. వస్తా! పిన్నీ" అంటూ లేచాడు.

"రెండురోజులపాటు ఉంటావా?" అంది ఏమీ ఎరగనట్లు మా అమ్మ.

"అబ్బే... రేపు పొద్దున్నే వెళ్ళిపోతాం" అన్నాడు.

"వెళ్ళిపోతాం అని బహువచనం చెబుతున్నావ్, కూడా ఎవరువస్తున్నారేమిటి" అంది ముసి ముసి నవ్వు నవ్వుతూ—

"ఎవరేమిటిపిన్నీ! మీకోడలు పిల్లని కూడా తీసుకు వెళుతుంటేను" అన్నాడు నవ్వుతూ.

"అదేమిటే, కుఱ్ఱనాగమ్మని ఇప్పటి నించీ ఎందుకు... పెద్దమనిషిఅయ్యాక.." అంటుంటే అతను అందుకొని.

"పెద్దమనిషేమిటి పిన్నీ! ఓమూల అష్ట కష్టాలూ పడుతూంటే. ఇన్ని గంజినీళ్లు కాచిపోసే దిక్కెవ్వరూ లేరు. అందుకనే పెద్దమనిషి కాకుండానే, ఆ అడ్డురోవంతా తీర్చేసి మరీ తీసుకెళుతున్నాను." అన్నాడు ముఖం అదోలా పెట్టి.

"అవున్నాయనా. ఆ వూరుకానివూళ్లో నువ్వు పడేకష్టాలు ఎవ్వరికి తెలుస్తాయి." అంది మా అమ్మ ప్లేటుమారుస్తూ.

"వస్తానమ్మా. ఇంక మళ్ళీ కనబడ్డం వుండదు. ప్రయాణం హడావిడి. వస్తా సుందరం. ఏదో కొంచం శ్రద్ధగా చదివి ఎల్లాగో గట్టెక్కెయ్యి. పాపంమీఅమ్మా, నాన్నా ఎంతో కష్టపడుతున్నారు నీచదువు కోసం" అంటూ వెళ్లిపోయాడు.

ఆ రోజు స్కూలునుండి ఇంటికి వచ్చేసరికి బాగా చీకటిపడింది. ఇన్ని మెతుకులు నోట్లో వేసుకొని మామూలుగా వీధి గదిలో కూర్చొని చదువుతున్నాను. మా అమ్మ సావిట్లోనిద్రపోతోంది. నామనస్సు ఈ నాలుగురోజులనుంచీ సరిగ్గా లేదు. పాపం అమాయకురాలైన కామాక్షిని తలచుకొంటుంటే నాకు ఏదో చెప్పరాని బాధ కలుగుతోంది. ఆనందలక్ష్మిలా కలకల్లాడుతూ కళ్లెదుట తిరిగే కామాక్షి ఇంక రేపటినుంచీ కనబడదు. ఎందుచేతనో కామాక్షి అంటే నాకు అదోవిధమైన మమకారం, జాలి, ప్రేమ. ఈ ప్రేమ ఎటువంటిదో ఏ రకమో నేను వివరంగా చెప్పలేను. ఎందుచేతనంటే నాకూ పెళ్ళిఅయింది. ఘోర్తుఘారం చదువుతుంటే, వద్దు మొర్రోఅన్నా వినక, ఓ ఎద్దులాంటి పెళ్లాన్ని కట్టబెట్టారు. ఇహ నేడో రేపో ఆ నాంచారి రావడానికి సిద్ధంగావుంది. ఆ ఆలోచనలతో నా బుర్రంతా వేడెక్కిపోతోంది. ఇంతలో తలుపుకొట్టిన చప్పుడయింది. "ఎవరు వారు?" అన్నాను. సమాధానం రాలేదు. నెమ్మదిగా తలుపుతీశాను.

"కామాక్షీ!...ఏం ఇంత రాత్రివేళ ఇలా వచ్చావ్." అన్నాను. కాని ఆమె ఏమీ మాట్లాడలేదు. అదరిన మేనుతో, బెదరిన చూపులతో అల్లాగే నాకేసి చూస్తూ నించుంది. "కూర్చో కామాక్షీ" అన్నాను. "వద్దు బావా! వెళ్ళిపోతా" నంది.

"అయితే అంత చెప్పల్లో కాళ్లు పెట్టుకొని ఎందుకొచ్చావ్?"

"అదికాదు బావా, మరి...నీతో... నీతో..."

"ఏమిటే, నాతో...చెప్పు కామాక్షీ."

"నీతో ఒక్కసారి చెప్పేసి వెళ్లిపోదామని."

"ఏం చెబుతావు? ఎక్కడికి వెళతావు? అన్నాను.

"రేపు ... పొద్దున్నే... ఆయన... నన్ను..." అంటూ రెండుచేతులలో ముఖం కప్పేసుకొంది. నాకు అర్థమయింది.

"పిచ్చిదానా! ఈమాత్రం చెప్పడానికే అంత ఇదిచేశావు. అదేమిటే, ఏడుస్తున్నావా? తప్పుకదూ. ఏదీ ఇలా చూడు" అన్నాను.

"బావా నిన్నువిడిచి ఎలా వెళ్లనూ?"

"ఎలా వెళ్లడం ఏమిటి కామాక్షీ! చక్కగా రేపు మొగుడితో బండిలో కూర్చొని వెళుదుగాని."

"బావా! వేళాకోళమా" అశ్రునయనాలతో నా కళ్లల్లోకి చూస్తూ అంది. ఆ చూపు నా హృదయాంతరాళంలోకి చొచ్చుకుపోయింది. నా మనస్సు చివుక్కుమంది. నేను ఏమీ అనలేకపోయాను. "ఇంక వస్తాబావా! మళ్లీ నేను నిన్ను చూడగలనో లేనో. ఎప్పుడైనా ఈ దీనురాలిని చూడాలనివుంటే ఓసారి అక్కడకు రా" అంటూ లేచింది.

"కామాక్షీ! అనవసరంగా నీ మనస్సు కష్టపెట్టాను. ఏమీ అనుకోవుకదూ. నువ్వు వెళ్లిపోతుంటే నాకుమాత్రం సంతోషమా? తప్పకుండా వేసంగి సెలవుల్లో నిన్ను చూడ్డానికి ఆ వూరు వస్తాను." అన్నాను. కామాక్షి అలాగే చూస్తూ వెళ్లిపోయింది.

కాలచక్రం తిరిగిపోయింది. వైశాఖ మాసంలో నాకు కార్యమయింది. మా నాంచారి ప్రవేశించిన వేళావిశేషమో ఏమో - నా పరీక్ష సున్న అయింది. అందుకనే "వివాహో విద్య నాశాయ, సర్వం పాశాయ శోభనం" అని పెద్దలు ఊరికే అన్నారా? ఎల్లాగో మళ్ళీ ఓ ఏడాది చదివి గట్టెక్కాను. కామాక్షి మళ్ళీ రాలేదు. ఈలోపుగా పెద్దమనిషి అయిందనిమాత్రం తెలిసింది. తరువాత నేనూ ఓ రోజున ఉద్యోగం కోసం మిలిటరీలోకి పోయాను. జీవితం ఏదో చప్పగా నడుస్తున్నట్లు తోచింది. ఆ లోటు ఎందువల్లనో నాకు తెలియలేదు. చాలాసార్లు తెలుసుకోవాలని ప్రయత్నించాను కూడా. ఇంటి వద్ద అమ్మా నాన్న ఒకటే గోల పెడుతున్నారు, అక్కడనుంచి వచ్చేయమని. అదే పనిగా టెలిగ్రాములు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇంక తప్పనిసరిగా అక్కడ

నుంచి ఏదోవిధంగా, నానా తంటాలుపడి డిశ్చార్జి అయి, ఇంటికి వచ్చేస్తున్నాను. నేను ఎక్కివస్తున్న రైలు ఒక జంక్షనులో ఆగింది. మామూలుగా కాఫీ త్రాగడానికి టీస్టాలువద్దకు వెళుతున్నాను. ఇంతలో "ఏంరా! సుందరం! ఎక్కడనుంచి?" అన్న గొంతు వినబడింది. వెనుదిరిగి చూశాను. ఆయాసంగా దగ్గుతూన్న ఒక వ్యక్తిని చూసి ఆఖరికి "మీరా......" అన్నాను. "రా! ఈ రోజు ఇక్కడ ఆగి రేపు వెళుదు గానిలే" అంటూ నా పెట్టె, బెడ్డింగూ పోర్టరుకి ఎత్తి, నన్ను కూడా తీసుకువెళ్లాడు.

ఇంట్లోకి వెళ్లాక "ఏమే! ఎవరో వచ్చారు చూడు" అన్నారు. "ఎవరండీ" అంటూ ఇవతలకొచ్చి నన్ను చూచి నిర్ఘాంతపోతూ "ఏం బావా! ఎక్కడనుంచీ రాక? బాగా ఉన్నావా? ఏమిటీ మిలటరీ వాడి వేషం?" అంది నవ్వుతూ "తరవాత మాట్లాడుకోవచ్చుగాని, ముందర కాఫీ పెట్టి, త్వరగా వంట కానియ్యి" అన్నారు కామాక్షి మొగుడు. "రావోయ్! సుందరం. ఎంత వాడవయ్యావ్! రా! బట్టలు మార్చుకొని స్నానం చెయ్యి. తరవాత మాట్లాడుకుందాం!" అన్నాడు.

కామాక్షి ఎంతలా మారిపోయింది. ఇదివరకున్న పొడుగదిగింది. కొంచెం వన్నెకూడా చేసింది. నాలో ఏదో చెప్పరాని సంతోషం బయలుదేరింది. ఎప్పుడూ లేని ఉత్సాహం కలిగింది. ఒడలు పులకరించింది.

భోజనాలు అయ్యాయి. బడలిక చేత నేను పక్కమీద కన్ను మూశాను. ఒళ్ళు తెలియని నిద్రపట్టింది. "ఇంకా ఏం నిద్ర! లే బావా! సాయంత్రం అయింది. భోజనం వేళ కూడా అవుతోంది" అన్న కామాక్షి పలుకులు విని త్రుళ్ళిపడి లేచాను. "కాఫీ చల్లారిపోతోంది. పట్టుకొస్తానుండు బావా!" అంటూ కాఫీ తెచ్చియిచ్చింది. కాఫీత్రాగి అలా ఓసారి వీధిలోకి వెళ్ళివచ్చాను. "లే! బావా భోజనం చేద్దాము." అంది కామాక్షి. "అదేమిటి! మీవారు కూడా రానీ" అన్నాను. "ఆయన వచ్చేదాకా వుండే మాటయితే నీపనిసున్నే" అంది కిలకిలా నవ్వుతూ. "అంటే?" అన్నాను. "అంటేనా. ఆయనకి ఈవేళ నైట్‌డ్యూటీ, రానని చెప్పి వెళ్లారు." అంది. భోజనానికి వెళ్లాను. ఎంతపరిచయమైనా, ఇంట్లో ఇంకొకళ్ళు లేనందువల్ల అదోలావుంటుంది. అందుచేత నేను బుర్రవంచుకొని భోజనం చేస్తున్నాను. "అందేమిటి బావా! అంత సిగ్గుపడుతున్నావ్. పట్టుమని నాలుగు మెతుకులైనా తినలేదే" అంది. "అబ్బే! ఆకలిలేదు." అన్నాను.

"రాకరాక మాయింటికి అనుకోకుండా వచ్చావు. నిన్ను చూస్తుంటే, నాకు ఎంత సంబరంగా వుందో చెప్పలేను. ఇన్నాళ్లనుంచీ, ఆనందరహితనై, అడవి కాచిన వెన్నెల్లావున్నాను." అంటూ ఇంకా ఏదో చెప్పబోతోంది. "కామాక్షీ! ఏమిటో కవిత్వధోరణిగా మాట్లాడుతున్నావ్. ఎంత పెద్ద దానవయ్యావు." అన్నాను. "సరేలే! భోజనం చెయ్యి తర్వాత మాట్లాడుకొందాం!" అంది. నాకోసం వేసివున్న మంచంమీద సిగరెట్టు కాల్చుకొంటూ కూర్చున్నాను. "బావా! తాంబూలం వేసుకో" అంటూ ఆకులూ, వక్కలూ అన్నీ పళ్లెంలో పెట్టి తెచ్చింది. "నాకు వద్దు కామాక్షీ! అలవాటు లేదు" అన్నాను. "లేకపోతే చేసుకో బావా! నేను స్వయంగా సున్నం రాసి, చిలకలు చుట్టి ఇస్తాను." అంటూ నన్ను తాంబూలం వేసుకొనేదాకా బలవంతం చేసింది.

నేను ఉండబట్టలేక "కామాక్షీ ఈ అలంకారమంతా ఏమిటి?" అన్నాను. "ఇవాళ నాకు పండగ బావా!" అంది. నాకు అర్థం కాక "అంటే?" అన్నాను.

"బావా! ఇంకా అర్థం కాలేదా నీకు? చల్లకొచ్చి ముంతదాచడం దేనికి? కారుమబ్బులు కమ్మినప్పుడే, నెమలి పింఛాన్ని విప్పి నాట్యం చేస్తుంది. చంద్రుడురాగానే కలువలు వికసిస్తాయి. ఇన్నాళ్లనుంచీ ముకుళించుకు పోయిన నా హృదయకమలం ఈ, నీ రాకతో విచ్చుకొంది. ఆనంద దేవత ఇన్నాళ్లకు నాకు ప్రత్యక్షమయింది. ప్రణయదేవత నా వలపు కిన్నెర తంత్రులు మీటుతోంది. బావా...ఏం చెప్పను? నా యీ అయిదేళ్ల జీవితంలోనూ ఈ రోజే నాకు పండుగ. అయినా అది నీచేతిలో వుంది. పాలముంచినా నీటముంచినా నీదే భారం. అంగీకరించావా—ఆనందం. నిరాకరించావా – మరణం."

"కామాక్షి! ఏమిటీ ధోరణి. నీ మెడలో నిగనిగమెరిసే ఆ తాళి, నీ భర్తను, నీవు మనసారా వ్రాసియిచ్చిన బానిసపత్రం" అన్నాను.

"అవును. తెలుసు. అది పెద్దలు చేసిన పెళ్లి. నా మెళ్ళోకట్టినది తాళిగాదు. ఉరిత్రాడు. ఇప్పుడు నీ ఎదుట మాట్లాడుతున్నది నీ చిన్నతనపు కామాక్షిగాదు. ఆ అమాయకపు కామాక్షి చనిపోయింది. ఇప్పుడు భగ్నజీవి, అన్నీ తెలిసిన కామాక్షి! ఆచారం పేరిట, శాస్త్రాలను అడ్డువేసుకొని, ఎంతమంది కన్యల జీవితాలను తడిగుడ్డలతో, కుత్తుకలు త్తరిస్తున్నారో ఈ స్వార్థపరులు? బావా అన్నీ తెలిసిన నీవే ఇలా చేస్తే ఎల్లాగ? కట్టుకొన్నభర్త అనాకారి, రోగి. అయితే వలపుచంపుకొని, విధిలేక పశువులా శరీరాన్ని వాళ్ళకి అర్పించవలసిందేనా? ఈ కరకు సంఘం విధించిన కఠినశిక్షనిలా అనుభవిస్తూ, క్రుంగి కృశించిపోవలసిందేనా? స్త్రీల యందు ఇంత కాఠిన్యం దేనికి, ఈ స్వార్థపరులకూ, కరకు సంఘానికి? బావా... నా బాధ అర్థంచేసుకోలేవా?" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ నా పాదాలమీద వ్రాలింది. నా హృదయంలో రైళ్లు పరుగెడుతున్నాయి.


పెళ్లి కాకముందు నా కామాక్షి. కాని ఇప్పుడు...పరస్త్రీ! అందులోనూ తిన్న ఇంటి వాసాలు లెక్కించడమా!... ఇంత బంధుద్రోహమా?......ఎన్నో ఆలోచనలతో నా గుండె పగిలిపోతోంది. నా ఇంద్రియచాపల్యం ముందు నా మనోబలం, నిగ్రహశక్తి, క్షీణించిపోయాయి. ఏమి చెయ్యాలో తోచలేదు. కామాక్షి మళ్ళీ తల ఎత్తి, "బావా......ఇదంతా ఎవరి తప్పు?...నా తప్పే నంటావా...?"

నా మనస్సు కరిగిపోయింది. అప్రయత్నంగానే "కామాక్షీ!" అంటూ ఆమెను చేరదీశాను.

"బావా...ఎంత ఆనందం..."

"కామాక్షీ...ఇది ఇద్దరి తప్పూ కాదు" మరి ఎవరి తప్పు? ★

ఊరకుక్కలు



శ్రీ భాగవతుల రామారావ్



ఎవరో అమ్మాయిని శివయ్యా లేవదీసుకు పోయాడని ఒక్కమారు గుప్పుమంది తెల్లారేసరికి ఊరంతా!

అసలు అమ్మాయికాదు, ఎవరో 'తల్లబోడి' ట! 'ఎవరో ఏంటి? తాయారు లేదూ, మూడేళ్లాయి ముండమోసిన రండ? దాన్నే! కలిమాయ!' అన్నారు ఒక్కగుక్కని మార్కర్లంగారు పక్కింటి సులకక్షితో దంజాలాడుతుతూ.

'అదేంటండీ? తాయార్ని రక్కపోవట మేంటీ?- కమలేసాచారి కడగొట్టు సంతానం లేదూ, తలచెడ్డ తాయారూ? బొట్టు తప్పిస్తే విధవో సధవో తెలీకుండా కట్టుగా తయారై వీధులంట బోర విరుచుకొని తిరుగుతుంటే మైలురాయి,!' అదే అట్టు ముట్టు అనవాళ్ళన్నీ అప్పజెప్పారు అల్లప రాజుగారుతోటి అయ్యవారితో, పనిగాపిల్చి

'చెప్తే నమ్మవు కాని, నే కళ్లారా చూశాను! అర్ధరాత్రి చెంబట్టుకని లేచాను. అసలూ రంకుతనం, దొంగతనం దాగుతుందిటో? వాళ్ళ కర్మంగాలి నాకళ్లేపడాలి? ఆ ముండ ముందూ, ఆ వెధవ వెనకా వాళంవారి సందులో దూరేరు. చూడగానే అనుమానించాను ఇద్దరూ రాత్రికి రాత్రి ఎక్కడికో ఉడాయిం చేస్తున్నారని!' దల్లగా ఊదేసింది నీలాటి రేవులో చిచిం ద్రీరత్నం.

'విన్నావో! రామ! రామ! ఆ వెధవ తాయారు కంటె సహస్రాంతం చిన్నవాడట!! ఎక్కడైనా ఉంది ఇంత విడ్డూరం?' అన్నారు అచ్చయ్యమ్మగారు ఒత్తుత్తేస్తూ, వర్తిస్తున్న గోవిందనామాలు మరిచిపోయి సుభద్రమ్మతో.

'ఈ సంగతి విన్నారత్తా? అప్పుడే తాయారు రెండుమార్లు కడుపుల్దించుకుందిట!!!' అంటోంది అత్తగారితో చేపకొత్త కోడలు.

'నాకు మొదటే అనుమానం వేసింది మ్మండి చెప్పకేం? చూశారా. ముండ మోసిన ఈ మూడేళ్ళలో వేలు ముడిచి చెప్పటానికైనా ఒక్కమారు మూణ్ణాళ్ల పాటు మూల, కూచో లేదంటే నమ్మండీ గరమొద్దిరా!! అప్పుడే అనుకున్నా 'చాటుమాటున కక్కుర్తి పడిందిరా!' అని—' అని ఒత్తిగా యమ్మగారి బుల్లెటిన్.

నీలాటి రేవులో నీళ్ళమనిషి సుభద్రమ్మ దగ్గిర్నించి చైర్మన్ 'చెలమయ్యగారి వరకూ ఇవే కబుర్లు ఊరంతా అట్టుడికి పోతోంది. రచ్చరాయిలో నేటి చర్చనీయాంశం ఈ లేచి పోవటం గురించే.

తలో విషయం చారేస్తుంటే ఇంతలో 'ఇంతకీ ఎవరా కక్కుర్తి పడత?' అన్నదో గంభీరస్వరం, కొత్తో చ్చాను మొదలెట్టనట్టు. సభికులందరి దృష్టీ అటు మరిలేసరికి,' అరి వీడి దుంపతెగా! వాడే!! ఆ శివయ్యగాడే!!!' అన్నారు.

మొహా మొహాలు చూసుకోవటం మొదలెట్టారు. ఇహ రచ్చతాలి సభికులంతా!

'అఁహాఁ!... నువ్వు... నువ్వేనా ...ఆ వెధవముండ... తాయార్ని రాత్రి లేవదీసుకు పోయావట.' అన్నదో సుమ్ము కంఠం తిగులు వెగులుగా మూక వెనక నుంచి.

'ఎవరికా పోయేకాలం? నీ పెళ్ళాం లేచి పోయిందిరా కక్కగట్టా! ఎవర్రా నన్ను లేవదీసుకుపోయే మొగాడూ? ఎన్ని గుండెలుండాలా వాడికి? రమ్మనండి ఏ కొమ్ములొచ్చిన మొగాడొస్తాడో నన్ను లేవదీసుకు పోవడానికి!?... అరి వీళ్ళ జిహ్వపడ! తిన్నగా తినుండలేక ఎంత లేని వాదులు వేస్తున్నారు! వీళ్ల పెళ్లాలు ముండమొయ్య! వీళ్ళ కొంపల్లో పీనుగు పోనూ...' కట్టలు తెగిన ప్రవాహంతో కదిలొస్తోం దమాంతంగా ఊడిపడ్డ తాయారు!! చెరువునుంచి నీళ్లు తెస్తూ రచ్చరాయి దగ్గిర చిచ్చు రేగింది.

బస్! 'అరే!' అంటే 'అరె!'...మళ్లీ ఆవిడ ఊపిరి తీసుకునే లోపల రచ్చరాయి ఖాళీ అయిపోయింది. చంకలో నీళ్ళ బిందె, తడిబట్టతో తాయారూ, ఎదురుగ్గా శివయ్యా తప్ప!

రాత్రి ఆమె నతను లేవదీసుకు పోయాట్ట; అతనితో ఆమె లేచిపోయిం దిట. ఆ ఇద్దరే ఉన్నారక్కడ!

'విన్నారండీ? రాత్రి మీరు నన్ను లేవదీసుకు పోయారట! వీళ్ళ జిహ్వ పాడు! ఎందుకు పుట్టింది వీళ్ళకీ ఉప్పన్న బుద్ధి?' — తాయారే కదిపింది, హద్దు మీరిన కోపంతో ఆపసోపాలు పడుతూ.

'వెధవలు! లేకపోతే రాత్రి మీరు నాతో లేచిపోయారట! రామ! రామ!"

అప్పజెప్పాడు శివయ్య ఆవే మాటలు.

'పళ్లు రాలగొట్టలేక పోయారూ పట్టుగుని ఒక్కొక్క వెధవనీ. వాళ్ళ పెళ్లాలు ఎంగిలి పడటం పరిపాటు కాబోలు. అందుకే అందరిమీదా అలాంటి అనుమానాలే వాళ్ళకి'

'ముమ్మాటికీ! ఉన్నమాటన్నారు. అసలు ఆ చిచింద్రీ రత్నవే పుట్టించుంటుంది ఇదంతా. నేనప్పుడే అనుకున్నా'–

'ఏంటే? సోంబుగత మూడో పెళ్లి ముదు పెళ్లాం రత్నం పనా! వారాలబ్బాయితో వరస కలుపుకున్న, ఇంతోటి సొంపుకీ దాని కెందుకు పుట్టిందీ పోయే కాలబ్బుద్ధి?'

'అఁవా చాల కాలమాయి నా కాళ్లా వేళ్లా పడుతోంది లెండి. కాని వాళ్లు బతి దిగిపోయారని మనంకూడా దిగనారుతాం టండీ? మొన్న సందెవేళ పసుండి సోంబూత కోసం ఇంటికి పోతే, ఆయన ఇంట్లో లేకపోవటం చిక్కబట్టి చెయ్యి పట్టుకుందండీ! కామినీ భూతాన్ని విదిలించుకొని వీధిలోపడేసరికి నాతల ప్రాణం తోకొచ్చిందంటే నమ్మండి. ఇంతకీ అప్పుడావిడే మందను కున్నారు—'పిరికి వెధవ! అవినీతట! చూపిస్తా ఏడి బండారం అందరికీ ...'

'ఇంకేం? దానిపనే ఇదంతా? దాని తాడు తెగ! మద్దిని నేసేం అపకారం చేశానండీ దానికి?... అన్నట్టు, ఔను స్మండీ!... మొన్నా అడి వారాలబ్బాయితో సరస మాడుతున్నప్పుడు నాకళ్ళ పడ్డది! దొరికి పోయిందని కసికాబోలు నామీద. అయినా కోటికి ఉచ్చం నీచం ఉండొద్దూ?'

'అనుకో నిద్దురా. అందుకనే లోకులు కాకులన్నారు. ఏనుగు వెనకాల ఊర కుక్కలెంత అరిచి ఏడిస్తేమాత్రం ఏనుక్కి లక్ష్యవా ఏంటి?... పదండి, పోదాం!'

ఇద్దరూ ఇంటిముఖం పట్టారు. వీధిచివర ఎదురెదురు ఇళ్లు వాళ్లవి. తడిబట్ట పరపర మంటో నడుస్తోందామె ముందూ, అతడు వెనకా, దారి పొడవునా శివయ్య కళ్లు తడిబట్టలోని తాయారు 'మడి' మీదే ఉన్నయ్!

వీధిచివర ఆ పక్క ఇంట్లోకి ఆవిడా, ఈ పక్క ఇంట్లోకి ఈయనా పోయారు. పోతూ పోతూ ఎందుకో ఇద్దరూ వెనక్కి తిరిగి చూసుకున్నా రొకర్నొకరు! అతణ్ణి చూసి ఆమె నవ్వింది! ఆమె నవ్విందని అతడు నవ్వాడు!

*   *   *   *

'ఆచారిగారున్నారండీ!' అంటూ లోపలి కొచ్చాడు దీపాలవేళ శివయ్య. తనకి తెలుసు కచ్చితంగా ఆచారిగారు ఊళ్లోనే లేరని.

వంటింట్లోంచే 'వచ్చే' అని కేకవేసి రానేఒచ్చింది తాయారమ్మ పొత్తిమంచి సర్దుకుంటూ తీరా శివయ్యని చూసి సంభ్రమాశ్చర్యాలతో తెల్లబోయి 'మీరా!... రండి! రండి!' అంది కంగారు కనపడనీయకుండా. నిజానికి తనకి అతని వేపే చూడాలనున్నా, కష్టంమీద దృష్టి నేలకి ఆన్చింది సిగ్గు కురుస్తూ.

'నాన్నగారున్నారేమో అని' అందు కున్నాడు శివయ్య, ఆమెను నఖశిఖ పర్యంతం కళ్లతో క్రాస్ ఎగ్జామిన్ చేస్తూ.

'లేరండీ. ఉదయమే ఉత్తరావిల్లి శిస్తు వసూళ్ళకని బయల్దేరారు. దివాణం నౌఖరీ మరి. నెలకి పట్టున పదిరోజుల పాటు ఇంటి పట్టున ఉండరుకదా! ఏం ఉద్యోగమో ముసిలి కాలంలో'

'ఏంచేస్తావమ్మా. తలమున్కకున్నాక తంటాలు పడాలి. పోనీ, కులాసాగా ఉన్నారుకద?

'ఏం కులాసా? ఏదో తింటున్నాం తిరుగుతున్నాం తప్ప...' ముఖం విచారంగా పెట్టి.

'...అవును పాపం! ఏంటో, మీనాన్నగారంతకం టేనూ! ఆమాత్రం ఇంట్లోవాళ్ల విషయమే పట్టించుకోపోతే ఎల్లా అండీ!'

'చీమూ నెత్తురూ చిక్కగా ఉన్న మీకు దాంట్లో కష్టసుఖాలు తెలుసు కాబట్టి మీరామాత్రం సానుభూతి చూపిస్తున్నారు నామీద. మానాన్నగారికేం? అన్నీ అనుభవించి కీళ్లు జారిన వారు. ఇంతకీ ఎద్దుపుండు కాకికేం నొప్పా చెప్పండీ?'

'ఔనులెండి' నిజం చెప్తున్నా, మీరు నమ్ముతారో నమ్మరో కాని రాత్రులు ఒక్కణ్ణే మీవిషయం ఆలోచిస్తున్న కొద్దీ నా గుండెలు చెరువై పోతున్నాయంటే నమ్మండి! మీ యవ్వనం ఇలా వనంలో వెన్నెలై పోతూంటే దగ్గరే ఉండి చూస్తూ ఊరుకోవటమా అని ఒకటేబాధ!'

"అయ్యో పాపం! మీ హృదయం నవనీతం మరి, లేకపోతే దిక్కూ దివాణం లేకుండా మూల పడున్న ముండ గోడెవరికొక్కావాలి? నేనెలా చస్తే ఎవరేడవాలి?' —కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

'అబ్బా! మీరలా ఏడిస్తే నే భరించలేను స్మండీ!' పోనీ... మీకే ఏదో దారి చూసుగోకూడదూ అంటూ!'

'అఁ! ఒక్కటే దారి, గోదారి!'

'తప్పు! తప్పు! అభిలాషే ఉండాలి కాని అవకాశం ఉండక పోతుందటండీ?'

'ఆమాటకొస్తే అభిలాషుండని దెవర్తి చెప్పండీ? కోరికలున్న మాత్రాన కొనసాగిపోతే ఇంకేం?'

'కాని కృషంటూ ఒకటుంది కదండీ? ఆ పైనా 'లలాటరేఖా నపునః ప్రయాతీ?'

'సరే! ఇంతకీ మీకే సెలవియ్యకూడదూ అదేదో—' ఎందుకో తృళ్లిపడి నాలిక్కరుచుకుంది తీరా అనేశాక.

'సెలవియ్యటానికే ముందిలెండి. ఎన్నాళ్ళిలా గూళ్లల్లో మగ్గిపోతారు?... స్వేచ్ఛ కోసం అదును పట్టె రెక్కలు కదిలించ మంటూ...'

'ఖరారే అంటారా?' అశ తొంగి చూసిందామెలో.

'తాయారమ్మ తయారంటే మనది ఖరార్! తిరుగులే! చేతిలో చెయ్యేసి చెప్తున్నా'

...చెయ్యీ చెయ్యీ కలుసుకున్నయ్!

'మరోనాడు—కాదు, మర్నాడు!— రచ్చరాయి దగ్గిర మళ్లా రణగొణ ధ్వని! నాడు నీలాటి రేవులో పుట్టిన నీలాపనింద రచ్చరాతి చర్చలో రచ్చకెక్కి, నేడు నిక్కచ్చిగా నిజమయి ఊరుకుంది— ఏమరి ఉన్న కుక్కల్ని ఉసి గలిపాక ఊరుకుంటాయా?

★

తీసిపోని తెలివి

"జానకీరాణి"

"ఇదుగోండి. ఈ మాటు జీతం రాగానే నేనో రెండుచీరెలు కొనుక్కోవాలండి. బొత్తిగా చీరెలు లేవు" అని యింటికిరాగానే కాఫీ కప్పు చేతికిస్తూ లక్ష్మి మొదలుపెట్టింది. శర్మ వినిపించుకోనివాడల్లే కళ్లజోడుతీసి తుడువనారంభించాడు.

"మొన్న పేరంటానికి వెళ్ళడానికి చీర లేక మానుకోవలసి వచ్చింది. ఏమిటి చెప్పండీ దరిద్రం? ఎప్పటికప్పుడు క్రొత్త ఖర్చులు వస్తూనే వుంటాయి. ఈ మారు ఏ ఖర్చు తగ్గించుకుంటారోగాని, నాకు రెండు చీరెలైనా కొనకతప్పదు." అని మళ్ళీ అందుకుంది లక్ష్మి. శర్మ ఏమీ మాట్లాడకపోయేసరికి లక్ష్మి అతని ముఖం వంక తేరిపార చూచింది.

"మిమ్మల్నేనండి. గోడకు, పటాలకి ఉపన్యాసం యిస్తున్నాననుకున్నారా?"

శర్మ తలఎత్తాడు. "గోడలు, పటాలు చీర లివ్వవని, నాకే చెపుతున్నావని తెలుసు. కానీ 40 రూపాయలు నవుతాయే దల్లా? 20 రూపాయలకు తక్కువ చీరెలు తమకి పనికి రావాయె."

లక్ష్మి చటుక్కున ఎత్తుకుంది.

"అవునుగానీ, అడగడం మర్చిపోయాను. మీరు దీపావళికి కొన్న నల్లచీర ఎంతండీ?"

"18 రూపాయలు. ఏం, అల్లా అడుగుతున్నావు?" లక్ష్మిముఖాన చిరునవ్వు విరిసింది. "18 రూపాయలా ఏం?" అంటూ సూటిగా కళ్లల్లోకి చూచింది.

"కాక, చవగ్గా దొరుకుతున్నాయా ఏమిటి చీరలు?"

"సరేగానీ, మొన్న వాళ్ళ సరోజిని కట్టుకున్న చీరకూడ నా చీరలాంటిదేగా?"

"ఔను. ఐతే ఏమంటావు?"

"సరోజిని 10 రూపాయలకు కొన్నది. మీ రెందుకు 8 రూపాయలు దండగ పెట్టారు?"

"నేను కొన్నది 18కే. అప్పటికీ యిప్పటికీ ధరలలో సహస్రాంశం తేడావున్నది తెలుసా?"

"సరోజిని కూడా దీపావళికే కొన్నది తెలుసా?" లక్ష్మి చిలిపినవ్వులు శర్మకి చిరాకు కలిగించాయి.

"నా మాటకంటే, సరోజిని మాటమీద నీకు నమ్మకం యెక్కువా?" అన్నాడు కోపంగా శర్మ.

"అయ్యో రాత. మీ మాట నమ్మాలి కూడాను. ఇంతకీ 10 రూపాయలకు రావాల్సింది 18 రూపాయ లెందుకైందీ? అంటాను."

"ఏమోమరి. వాళ్లాయనేమైనా చవగ్గా కొనుక్కొచ్చాడేమో."

శర్మ తలవంచి, నవ్వును దాచి మాట్లాడుతున్నాడని లక్ష్మి కనిపెట్టింది.

లక్ష్మి కోపంతో మాట్లాడుతున్నప్పుడు చూపే భావప్రదర్శనలు చిత్రవిచిత్రాలుగా వుంటాయి. అది చూస్తే శర్మకి నవ్వు. ఆమె మండిపడుతుంటే అతను నవ్వుతుంటాడు. అతను నవ్వినకొద్దీ లక్ష్మికి మరింత ఆగ్రహం.

"ఎందుకల్లా లోపల్లోపల నవ్వుకుంటారు? మహా గొప్ప తెలివే ఐనట్టు కాడికి డబ్బు దండగపెడ్తూ 'ఖర్చులు తగ్గించాలి, తగ్గించాలి' అంటూ ధర్మపన్నాలు చెపుతారు. ఆ 8 రూపాయలతో యీ నెల చాకలిఖర్చు పూరేది. అన్ని విషయాల్లో మీ రింత మందంగా వుంటారేమండీ?" లక్ష్మి కోపం పట్టలేకపోయింది.

శర్మకి మనస్సు చివుక్కుమనిపించింది.

"నేనేమీ దండగ చేయటంలేదు."

"లేకపోతే 10 రూపాయల చీర 18 రూపాయలకు కొనడమేం? అది దండగ కాదా?"

"నేనేమీ 18 రూపాయలకు కొనలేదు."

"ఖరీ దెంతని అడిగితే 18 అని చెప్తారేం?"

"18 రూపాయలకు కొన్నాను కాబట్టి అల్లా చెప్పాను."

"అదేమిటండీ! దండగ పెట్టలేదంటారు మళ్ళీ 18 కే కొన్నానంటారు. అంత తిక మకగా మాట్లాడుతారేం?"

శర్మ వాదించలేక దబాయించటం మొదలెట్టాడు. "నేను చెప్పేది నీకు అర్థం కావటంలేదా? నేను 18 కి కొన్నాను. దండగేమీ పెట్టలేదు."

లక్ష్మి ఒక్కక్షణం తీక్షణంగా చూచింది. "వుదండి తలంటుతాను. బుఱ్ఱ వేడెక్కి ఒళ్లు మర్చిపోయారల్లే ఉంది." అంటూ లక్ష్మి లోపల కెళ్లింది. తిరిగి ఫలహారంతో వచ్చింది. ఆమెకు మరొక సందేహం కలిగింది.

"మరి బిల్లులో 18 అని వ్రాసి వుంది కాదండీ?"


"ఔను. 10 ని 18 చేయడానికి ఒక్క సున్న క్రింద అతికిస్తే చాలని తెలియదా కలకంఠీ!" లక్ష్మి చిన్నబుచ్చుకుంది. ఎందుకొచ్చిన అవస్థండీ అదంతా? 10 రూపాయలే అంటే నేను కొట్టేదాన్నా. తిట్టేదాన్నా!"

ఆపైన ఒక్కమాటైనా అనకుండా బల్ల సర్దసాగింది. ఇల్లాంటి విషయాల్ని గురించి కనీసం రెండురోజులైనా దెప్పిపొడిచే లక్ష్మి నిశ్శబ్దంగా ఉండేసరికి శర్మకి అపరిమితమైన ఆశ్చర్యం వేసింది

"లక్ష్మీ, యింతకీ ఆ చీర కట్టుకోవటం మానేసినట్లు వున్నావే?"

(40 వ-పేజీజీ చూడండి)

రేడియో గింజలు



శ్రీ తాయ్యేటి భానుమూర్తి

జన సమూహం కిటకిటలాడుతోంది. యెటుచూసినా మెసలటానికి వీల్లేక చంటిపిల్లలతో తల్లులు సతమతమౌతున్నారు. చెయ్యటానికేమీ తోచక కొందరు యింటిముఖం పడదామా అని ఆలోచిస్తున్నారు. బజారులో ఆ ఒక్క దుకాణం దగ్గరే అంత జనం విరగబడ్డారంటే విశేషం వుండాలిగా. ప్రతివాడు యేమిటి విశేషం అని అడిగేవాడే గాని తెలుసుకుని చెప్పేవాడు లేడు. చెప్పటానికి తీరికనేది వుంటేగా. పోనీ యే బోర్డేనా వుందా అంటే ఎన్ని గంటలనుంచి పాదరక్షల ఆగ్రహానికి గురవుతోందో, పాపం ఆ రేకుబోర్డు జనంమధ్యనుంచి ఒక పల్లెపడుచు ఒక చంకలో చంటిబిడ్డతో రెండో చేతిలో బుట్టతో రాపిడికి ఓర్చుకుంటూ 'బాబ్బాబు యీ ఒక్క కారే చూడండి బాబు! పొద్దిన్నించీ గంజి నేదు. పంటి పిల్లోడు సంపేత్తున్నాడు నాయనా! పెద్దాళ్ళం యెలాగోలాగా గడుపుకుందుం. పిల్లోణ్ణైనా నూడు బాబు,' అంటూ విలపిస్తోంది. ఆ పడుచు స్వతస్సిద్ధంగా వయస్సుచేత మనిషిలా కనబడుతుందేమోగాని తిండిలేక లోతుగా పోయిన కళ్లు బక్కచిక్కిన వళ్లు మాసి చినిగిపోతూన్న వస్త్రం, సంస్కారం లేని జుట్టు ఇవన్నీ కేవలం జీవించలేని స్థితిలో వున్న ఆ స్త్రీ కొందరుచేసే దారుణ పాపాలకి గుర్తై సమానత్వంలా కనిపిస్తోంది. ఎవరికి కావాలి? అయ్యో! అని విలపించటానికి? అయ్యో! అనిమాత్రం చేసేదేమిటి? ఒకనాడు చేసినా మర్నాడు చేసేదెవరు? జాతి యీ విధంగా కృశించి నశించే పర్యంతం తయారవటానికి కారణం యెవరు? ఎవర్నడిగితే యెవరు చెప్తారు? చివరికి వచ్చే సమాధానం కర్మ అనేనా? కొందరు శరీరాలు పెంచుకుని పూలపాన్పులమీద దొర్లే స్థితిలో యెందుకుంటారు? దాని కిచ్చే సమాధానం పూర్వపుణ్య సుకృతం. అంతేనా?

ఆ గుంపు ఒక్క తోపుతో చంకలోని పిల్లాడు కేర్‌మన్నాడు. జనం షాహుకారు బియ్యం లేవంటున్నా నెట్టుకుపోతున్నారు. షాహుకారు జనాన్ని త్రోసుకుంటూ వచ్చి బయటపడ్డాడు. కొందరు లోపలికిపోయి వుత్తబుట్టలతో యివతలకొచ్చారు. పాపం ఆ పడుచుమాత్రం తన ధోరణి వదలలేదు. 'బాబు మరో కాసు తీసుకోండి బాబు లేకపోతే చచ్చిపోతాం బాబూ,' అని షావుకార్ని వెంటాడింది. 'పోతేపో యెవర్నుద్దరిస్తా' వని కసురుకున్నాడు షావుకారు. నాలుగడుగులేసి ముందుకొచ్చింది. ఎవడో దార్నిపోతూంటే అడిగింది గింజలు దొరుకుతాయా అని. వాడేదో రహస్యంగా చెప్పేసరికి వుత్సాహంతో బయలుదేరింది. సందులు గొందులు దాటి ఒక పూరిపాక చేరింది. చుట్ట కాలుస్తో గల్లాపెట్టె దగ్గర ఓ లంబోదరుడు కూచున్నాడు. ఆదుర్దాగా అడిగింది. 'ఏం బాబూ తిండిగింజలు దొరుకుతాయా?'

'ఆ...ఎన్ని?'

'ఓ కుంచెడు'

'కుంచెడే!...అయినా చూసిస్తాను.'

'ఎంత బాబు?'

'ఆరు రూపాయలు.'

'అమ్మ నాయనో ఆరు రూపాయలే!'

'ఏ వనుకున్నావ్!'

'మాకు పూట కిచ్చారే రూపాయి ఎలా బతకమంటావ్ బాబూ?'

'నన్నేం చెయ్యమంటావ్? ప్రభుత్వం అలా వుంటే.'

'దీనికంతా ప్రభుత్వం ఏంచేస్తుంది బాబయ్యా నీలాటాళ్లు అమ్ముతుంటే.

'నీ క్షిష్టముంటే కొను లేకపోతే పో గోలచెయ్యక.'

'అయిత్తే పాతగింజలేనా?'

'కాదు. రడిమేడ్ ఆలిండియావి.'

'ఈటికే అంత డబ్బా! బస్తా ముప్పయి నాలు గమ్ముతూంటే.'

'ముప్పయినాలుగులేదు నలభయినాలుగు లేదు, అయి రేడియోగింజలు ఎళ్లి కొనుక్కో!'

'అయితే ఆ బియ్యం మనూళ్లో వుంటాయా బాబూ?'

'ఓ...యీమధ్యనే పంచాయతీబోర్డాఫీసులో పెట్టారాకొట్టు. కాని రోజూ ఐదు నిమిషాలు తక్కువ ఏడుగంటల కమ్ముతారు సాయంత్రం. చప్పునెళ్లు.'

'అయితే పోతాబాబూ ఏమో పొట్ట నింపుకోటానికి ఏయయితే నేం.' అని పరుగులమీద ఆఫీసుకి చేరింది. కొంతమంది జనం రచ్చబండమీద కూర్చున్నారు. శ్రావ్యంగా సంగీతం పాడుతోంది రేడియో. క్లార్కు తన్మయుడై బుఱ్ఱతిప్పుతున్నాడు. 'బియ్యం యియ్యండి' అన్న స్త్రీకంఠం విని తుళ్లిపడ్డాడు. పల్లెపడుచు

(40-వ పేజీ చూడండి)


దాశరథీ! కరుణాపయోనిధీ!



ఒట్టు

"రవి"

కాఫీ నీళ్లూ సేవించీ
కారా కిల్లీ నమలుచును
బట్టలు కొందామని నేను
బయలుదేరితిని బజారుకి

వెశవెడ అడుగులు వేయుచును
విచార సూచిత వదనముతో
కాంతం పెనిమిటి గారపుడు
కనిపించారొక కార్నరులో

"ఏమిటి మాష్టా రెందులకో
యిదిగావున్నా" రన్నాను.
"ఏమని చెప్పనురా బాబు!
యిప్పుడు చిక్కొకటొచ్చింది.

"మాసము రోజుల దాకాను
మాటలాడనని మా కాంతం
ఒట్టు బెట్టుకొని యేడ్చింది,
బెట్టుగ మూతి బిగించింది."

"విచారమెందుకు మాష్టారు?
పెళ్లాం పలకను పొమ్మంటే
యెంత అదృష్టం మాష్టారూ?
యెగసి గంతు మరి వేయాలి."

"అదిగాదయ్యా ఫుసలయ్యా!
ఆగడువీనాటితో తీరింది.
అందులకే యీ విచారము"
అంటూ ముందుకు సాగారు. ★

హకల్‌బెరీ ఫిన్

మార్క్ ట్వేన్

బొమ్మరిల్లు సీరియల్

మళ్లీ ప్రయాణం సాగించాము. పడవలో నిశ్శబ్దంగా కూర్చుని కెయిరోకోసం ఎదురు చూట్టం తప్ప మరే పనీ లేదు. కెయిరో అంటూ తారసిల్లాలేగాని, తక్షణం తాను ఆ పట్టణాన్ని గుర్తు పట్టగలనని జిమ్ దృఢవిశ్వాసంతో ఉన్నాడు. ఎందుకంటే కెయిరోను గుర్తుపడితే తను స్వేచ్ఛ పొందేటట్టు, లేకపోతే మళ్ళీ ఎప్పటిలాగా బానిసతనంలో మగ్గేటట్టు. తన అదృష్టం బావుందా గుర్తుపడతాడు; లేకపోతే లేదు. నిమిష నిమిషానికి జిమ్ లేచి "అదుగో కెయిరో!" అనేవాడు.

కాని ప్రతిసారీ జిమ్ ఆశాభంగం పొందేవాడు. లైట్లనుకున్నవి కాస్తా ఏ మిణుగురు పురుగుల గుంపో అయి ఊరుకునేవి. తాను దాదాపు స్వేచ్ఛ పొందినట్టే, స్వేచ్ఛకు పదిఅడుగుల సమీపానికి వచ్చినట్టే భావించుకున్నాడు జిమ్. సంతోషంతో జ్వరం వచ్చేటట్టుకూడా ఉందన్నాడు.

జిమ్‌మాటలు వింటుంటే నాకు సంతోషం కలగటానికి బదులు విచారం ఎక్కువ కాసాగింది. జిమ్ ఇంక కాసేపట్లో స్వతంత్రుడు కాబోతున్నాడు. అతడు స్వతంత్రుడు కావటానికి బాధ్యత ఎవరిది? నాది. ఆ పాపం ఎవరిది? నాది. ఈ ఆలోచనతో నాకు మతిపోయినంత పనైంది. ఇంతవరకు ఈఆలోచన నాకు తట్టనే లేదు. జిమ్‌ను బానిసతనంనుండి రక్షిస్తున్నానంటే రక్షిస్తున్నాననుకున్నాను గాని అందులో ఇంత మహాపాపం ఉందని నాకు తోచనే లేదు. జిమ్ తన యజమానురాలినుండి తప్పించుకుపోవటానికి బాధ్యత నాది కాదని, తప్పించుకుపొమ్మని అతన్ని నేను పురికొల్పలేదని సమాధానం చెప్పుకున్నాను. కాని నాఅంతరాత్మ ఊరుకోలేదు. గుచ్చి గుచ్చి ఇలా అడగసాగింది: "జిమ్ పారిపోతున్నట్లు నీకు తెలుసు. తెలిసినప్పుడు నువ్వుమళ్ళీ ఊళ్లోకి పోయి మిస్ వాట్సన్‌తో ఆముక్క చెప్పివుండాలి. అది నీవిధి." అవును. అది నావిధి. కాదని ఎలా అనగలను. అంతరాత్మ అక్కడితో ఊరుకోక ఇంకా అంది: "పాపం మిస్ వాట్సన్ నీకేం అపకారం చేసింది? నిన్నెప్పుడన్నా ఒక్కమాటన్నా అన్నదా? నీకెంతో సహాయం చేసిందే! నీకు చదువు చెప్పాలని, మంచి మర్యాద నేర్పాలని, నిన్ను బాగు చెయ్యాలని ఎంతో హైరానపడిందే! అటువంటి మిస్‌వాట్సన్‌కి ఇంత అపకారం చెయ్యాల్సిన అవసరమేమిటి నీకు? జిమ్ ఆవిడ సొంతబానిస. వాడు తప్పించుకుపోతుంటే చూస్తూ వూరుకోవటం, పైగా పడవలో కూర్చోబెట్టుకుని స్వేచ్ఛా రాష్ట్రాలకు తీసుకుపోవటం నీకు ధర్మమేనా? చెప్పు ధర్మమేనా అంట?"

అంతరాత్మ ఇల్లా పొడిచి పొడిచి అడిగితే కుర్రవాణ్ణి, అర్థం శుభం తెలియనివాణ్ణి నేనేమి చెబుతాను? మనస్సులో ఆందోళన ప్రబలమైంది. జిమ్ ఉన్నట్టుండి లేచి "అదుగో కెయిరో" అన్నప్పుడల్లా నాకు ఆమాట గుండెల్లో గాలంలా గుచ్చుకునేది.

జిమ్ తను స్వేచ్ఛ పొందబోతున్నానుగదా అనే సంతోషంలో తెగ వాగనారంభించాడు. స్వేచ్ఛ

పొందగానే ముందు మంచి ఉద్యోగం చూసుకుంటాడట. వచ్చిన జీతం వచ్చినట్టు నిలవ చేస్తాడట. ఒక్క సెంట్ ఖర్చు పెట్టడట. బాగా డబ్బు నిలవైన తరవాత మాపూరి పక్కన ఊళ్లో ఒక భూస్వామి దగ్గర బానిసగా ఉంటున్న తన పెళ్లాన్ని కొనుక్కుని, విడుదల చేసి తెచ్చుకుంటాడట. ఇద్దరూ కలిసి మళ్ళీ కొంత డబ్బు నిలవచేసి ఇంకోవూళ్లో బానిసలుగా ఉంటున్న తమ ఇద్దరు పిల్లల్ని విడుదలచేసి తెచ్చుకుంటారట. పిల్లల యజమాని పిల్లల్ని అమ్మటానికి ఒప్పుకోకపోతే ఎవరిచేతనైనా దొంగతనంగానైనా తెప్పించుకుంటాడట.

జిమ్ మాటలు వింటుంటే నా అంతరాత్మ పెట్టే బాధ ఇంకా ఎక్కువైంది. జిమ్ తన జన్మలో ఎప్పుడైనా ఇల్లాంటి అధర్మపు మాటలు మాట్లాడాడూ? తను స్వతంత్రుడు కాబోతున్నాననేసరికి నీతీ, న్యాయం ఏమీ లేకుండా యజమానినుంచి తన పిల్లల్ని దొంగిలిస్తానంటున్నాడు. దీనికంతటికీ కారణం ఎవరు? నేనే.

చివరికీ సమస్యను ఎలాగో ఓలాగు పరిష్కారం చేయాలనుకున్నాను. మొదటిసారిగా ఎక్కడ లైట్లు కనిపిస్తే అక్కడికిపోయి జిమ్‌ను పట్టించాలనుకున్నాను.

కొంతసేపటి కొకచోట వెలుతురు కనిపించింది. జిమ్ లేచి "అదుగోనండి హాక్‌గారూ! అదే కెయిరో. ఈసారి తప్పదు. అదే, అదే." అని చంకలు కొట్టుకున్నాడు.

"జిమ్! నేను ముందు డింగీలో పోయి చూసి వస్తా, కెయిరో అవునో, కాదో," అన్నాను.

జిమ్ డింగీ, తెడ్డు సిద్ధంచేశాడు. తనకోటు విప్పి నేను కూర్చునేందుకు పరిచాడు. నేను బయల్దేరుతుంటే పడవలో నుంచుని ఇలా అన్నాడు:

"ఇంకొంచెం సేపట్లో నేను స్వతంత్రుణ్ణవుతాను. ఇదంతా హాక్‌గారి చలవ. ఆయన నామీద దయతలచకపోతే నే నీ జన్మలో స్వతంత్రుణ్ణయ్యేవాడినా? ఇది హాక్‌గారి పనే. మీ మేలు ఎప్పటికీ మరిచిపోనండి ; జిమ్‌కు స్నేహితుడంటూ ఎవరన్నా వుంటే, మీరే. మీరే నాకు తల్లీ, తండ్రీ, అన్నీ."

జిమ్‌ను పట్టించాలని వెడుతున్న నాకు వాడి మాటలు అనగానే చెయ్యాడలేదు. నామీద ఇంత కృతజ్ఞత చూపిస్తున్న అమాయకుణ్ణి, సాధువును ఎలా పట్టించగలను, అనుకున్నాను. కాని నాకర్తవ్యం నేను చేసితీరాలి. న్యాయవిరుద్ధంగా పారిపోతున్న నీగ్రోను పట్టి అప్పగించటం నావిధి.

ఇలా యాభై, అరవై గజాలు పోయేసరికి ఎవరిదో మరొక పడవ వచ్చి నాడింగీని కలుసుకుంది. వాళ్లు నన్ను చూసి ఆగారు. నేనూ ఆగాను. వాళ్లలో ఒక డడిగాడు:

"అదేమి టక్కడ?"

"మాపడవేనండి."

"అందులో ఎవరున్నారు ?

"ఒక మొగమనిషి, ఒక ఆడమనిషి ఉన్నారండి."

"ఇవ్వాళ అయిదుగురు నీగ్రోలు తప్పించుకుని పారిపోయారు. మీపడవలో మనిషి తెల్లవాడా, నల్లవాడా."

నేను వెంటనే సమాధాన మివ్వలేదు. ఇద్దామన్నా మాట పెగలలేదు. అంతకంతకూ నీరసం ఎక్కువౌతున్నట్లున్నది. చివరికి అప్రయత్నంగా సమాధాన మిచ్చాను.

"తెల్లవాడే నండి."

"అల్లాగా? అయినా మేముకూడా ఒకసారి చూసి రావటం మంచిదనుకుంటా."

"అవునండి. నేనూ అదే అందామనుకుంటున్నాను. అందులో మానాన్న, అమ్మ తప్ప ఇంకెవరూ లేరు. మానాన్నకు జబ్బుగా వుంది కాస్త మీరొచ్చి ఆ కనిపించే లైటుదాకా మాపడవని నడుపుకుపోతే—"

"నల్లే. మీపని చూసేలోగా మాపని చెడుతుంది. మీతో కూచోటానికి మాకు తీరిక లేదు. పద. ఒక్కసారి మీపడవలో వెదికి మా దోవన మేము పోతాము."

"మీయిష్టం. అలాగే పదండి," అని నాడింగీ వెనక్కి తిప్పాను. నాలుగైదు గజాలు పోయాక ఇలాగన్నాను:

"మీరు వచ్చారంటే మానాన్న చాలా సంతోషిస్తాడండి. ఎందర్నడిగినా మా పడవచాయలకే రావటంలేదండి. మేము ఈరాత్రికి ఏదో వూళ్లో దిగాలి. పడవను నే నొక్కణ్ణే ఒడ్డు పట్టించలేను. మీరొస్తే మానాన్న మీకెంతైనా ఋణపడివుంటాడు."

"మీనాన్న కేమిటి జబ్బు?"

"అది—అది—ఏం లేదండి. అంత పెద్ద జబ్బు కాదండి—"

నే నిల్లా అనుమానంగా అనేసరికి వాళ్లు తమ పడవ ఆపారు. ఒకడన్నాడు: "ఏయ్, కుర్రాడా? నిజంచెప్పు. మీనాన్న కేం జబ్బు?"

"ఏం లేదండి—అహా—చెబుతానండి—మీరు వెనక్కి వెళ్లి పోమంటే నిజం చెప్తానండి—మీరే వచ్చి చూడండి—పడవ అట్టే దూరం లేదుగా—రెండు నిమిషాల్లో మీరే చూడొచ్చండి ఏం జబ్బో. రండి సార్."

"అయ్యో బాబోయ్! ఇదేదో మోసంలాగా వుంది. వెనక్కి తిప్పరా, జాన్! ఈ దరిదాపుల్లో ఉండటం ప్రమాదం. ఏయ్, కుర్రాడా! దూరంగా వుండు, దగ్గిరికి రాకు. మీనాన్నకి మశూచికం [illegible]ంది. అంతేనా? ఆమాట ముందే చెప్పకపోయావ్?

నీ పడవసంగతి, నీగ్రోలసంగతి దేవుడెరుగునుగాని మాదోవన మేము పోతాము. ఏమిటి నీ వుద్దేశ్యం? మీ మశూచికం అందరికీ అంటించాలనా?"

"అది కాదండి సార్. ముందే మశూచికమని చెబితే మీరు రారని చెప్పలేదు. ఇదివరకు అలా చెప్పబట్టే ఎవ్వరూ మా దరికేనా రాకుండా పారిపోయారు. సార్, సార్. మీరైనా కనికరించి మా పడవను కాస్త ఒడ్డుపట్టించండి."

"మేము రావటమే? బాబోయ్, ఊహూ. మీ నాన్న తాలూకు మశూచికం మాకంటుకుంటే జీవితాంతంవరకూ ఏడుస్తూ కూచోవాలి. మేము రాము గాని ఒకచిన్నమాట చెబుతాను విను. నువ్వు తిన్నగా మీ పడవలోకి పో. నీ అంతట నువ్వు ఒడ్డుకి రావాలని ప్రయత్నించకు. ఒక ఇరవైమైళ్లదాకా ఇల్లాగే పడవని పోనియ్యి. అప్పటికి బాగా తెల్లవారుతుంది. అక్కడొక చిన్నపట్నం కనిపిస్తుంది. నువ్వు కేకలువేస్తే ఎవళ్లుపడితే వాళ్లు సహాయానికి వస్తారు. మీనాన్నకి ఏదో జ్వరమొచ్చిందని చెప్పు. మశూచికమని చెప్పకు. తెలిసిందా? పాపం మీరు బీదవాళ్లలాగా వున్నారు. ఇదిగో ఈ చెక్కమీద ఇరవై డాలర్ల బంగారునాణెం పెడుతున్నాను. ఈ చెక్క నీ దగ్గిరికి రాగానే తీసుకో. నిన్నుచూస్తే జాలివేస్తోంది. అయినా ఏంచేస్తాం? తెలిసితెలిసి మశూచికం రోగిదగ్గిరికి ఎల్లా వస్తాము?"

జాన్ అనబడే ఆ రెండోమనిషి చెక్కమీద ఇంకొక ఇరవై డాలర్ల నాణెం పెట్టాడు. చెక్క నా దగ్గిరికి రాగానే రెండు నాణాలు తీసుకున్నాను.

"వెళ్లొస్తాం కుర్రాడా! పారిపోయిన నీగ్రో ఎక్కడన్నా కనిపిస్తే పట్టించు. పట్టిచ్చినవాళ్లకి బహుమానం కూడా వుంది."

"అల్లాగే నండి."

నేను మా పడవ నెక్కాను. నామనస్సు మనస్సులో లేదు. తెలిసి తెలిసి ఘోరపాపం చేశాను. జిమ్‌ను పట్టిద్దామని బయల్దేరి, లేనిపోని అబద్ధాలాడి వెనక్కి వచ్చాను. నే నిక బాగుపడట మనేది కలలో మాటనుకున్నాను. మంచిపని చెయ్యటం నాకు చస్తే చేతకాదు. ఎంతసేపూ చెడ్డపనులు చెయ్యటమే

చేతనవును. ఇక నాగతి అంతే.

ఇంతలో ఇంకో ఆలోచన తట్టింది. మాట వరసకి నేను మంచిపనే చేశాననుకో. అంటే జిమ్‌ను పట్టించాననుకో. అప్పుడు మాత్రం నాకు మనశ్శాంతి ఉండేదా? ఊహు. ఎల్లా ఉంటుంది? నన్ను నమ్ముకున్నవాడు, అమాయకుడు, మంచివాడు అయిన జిమ్‌ను ద్రోహంచేసి పట్టించినట్లయితే నామనస్సుకు శాంతి ఎక్కణ్ణించి వస్తుంది? కనుక అదీ లాభంలేదు. పట్టివ్వలేదని ఇప్పుడెంత బాధ పడుతున్నానో, పట్టిస్తే అప్పుడూ అంతే బాధపడేవాణ్ణి. అందుచేత మంచిపని చేసినా, చెడ్డపనిచేసినా ఫలితం ఒకటే నన్నమాట. ఫలితం ఒకటే అయినప్పుడు ఏ పనిచేస్తే మాత్రమేమి? ఈప్రశ్నకు ఎంతకూ సమాధానం దొరకలేదు. ఇక దాన్నిగూర్చి ఆలోచన అనవసరమని మనస్సును కట్టిపెట్టాను. ఎప్పటి కేది మంచిదని తోస్తే అదే చెయ్యటం ఉత్తమమనుకున్నాను.

మాపడవ డేరాలోకి వెళ్లిచూస్తే జిమ్ లేడు. చుట్టుపక్కల ఎక్కడా లేడు. నెమ్మదిగా పిలిచాను:

"జిమ్ !"

"ఇక్కడున్నానండిహాక్‌గారూ! గట్టిగా మాట్లాడకండి. వాళ్లు వెళ్ళిపోయారా ?" అని జిమ్ హీనస్వరం వినవచ్చింది. నీళ్లలోకి చూశాను. గాలి పీల్చేందుకు ముక్కుమాత్రం బైటపెట్టి జిమ్ పడవ పక్కన నీళ్లలో దాక్కుని ఉన్నాడు. నన్ను చూసి బయటికి వచ్చాడు.

"వాళ్లమాటలు వినిపించగానే నీళ్లలోకి జారి పడవకింద దాక్కున్నానండి. వాళ్లు గనక మన పడవలోకి వస్తే మునిగీత కొడుతూ ఒడ్డుకు పోదామనుకున్నాను. కాని హాక్‌గారూ! వాళ్లని బలేగా మస్కా కొట్టించారండి. మీరు అంత కలిపించి చెప్పకపోతే, వాళ్లు మనపడవను వెదక్కుండా వెనక్కి పోయేవారు గాదు. మీమేలెప్పటికీ మరచిపోనండి."

కొత్తవాళ్లనుండి సంపాదించిన నలభై డాలర్ల డబ్బునుగూర్చి మాట్లాడుకున్నాము. కెయిరో వెళ్లగానే పొగబోటులో ప్రయాణం చేద్దామనీ, ఆప్రయాణానికి ఈడబ్బు పనికొస్తుందనీ, జిమ్‌అన్నాడు.

తెల్లవారేసమయానికి ఒకచోట మకాం చేశాము. ఆ పగలల్లా మా సామాను మూటలు మూటలుగా కట్టడంలో మునిగిపోయాడు జిమ్.

ఆరాత్రి పదిగంటలకు ఒక పట్నం కనిపించింది. నేను అది కెయిరో అవునో కాదో కనుక్కుందామని డింగీలో బయల్దేరాను. కొంత దూరం పోయాక మరొక డింగీలో పోతూ ఒకడు కనిపించాడు. అతన్ని అడిగాను:

"మిస్టర్ ! ఆ కనిపించేది కెయిరోయేనా ?"

"కెయిరో? నీ కేమైనా బుర్ర పాడైందా ?"

"మరి అది ఏం పట్టణం ?"

"ఏదైతే నేంలే. నీదోవన నువ్వు పో. నాదోవన నన్ను పోనియ్. ఆట్టే మాట్లాడించావంటే వీపు పగులుతుంది."

చేసేదిలేక మళ్ళీ పడవవద్దకు వెళ్లాను. ఆ పట్టణం కూడా కెయిరో కానందుకు జిమ్‌కు చాలా ఆశాభంగమైంది. "ఫరవాలేదు, దగ్గిర పడ్డాములే" అని ఓదార్చాను తెల్లవారేలోగా మరొక పట్టణం కనిపించింది. కాని అది ఒక మెట్టమీద వుంది. అందుచేత అది కెయిరోకాదని నిశ్చయించుకుని ముందుకు సాగిపోయాము. తెల్లవారకముందే ఒకచోట ఆగాము. కొంతసేపటికి నాకేదో అనుమానం కలిగింది. జిమ్‌కూడా అనుమానం సూచించే మొహం పెట్టాడు.

"జిమ్! ఆరాత్రి పొగమంచు వచ్చిందే. అప్పుడే కెయిరోదాటి వచ్చినట్టున్నాము," అన్నాను. జిమ్ కొంతసేపు మాట్లాడలేదు. నీరసించిపోయి నదికేసి దీన దృష్టులు చూస్తూ ఉండిపోయాడు. చివరికిలాగన్నాడు:

"హాక్‌గారూ! ఇంక మనం కెయిరో, గియిరో—ఆ సంగతి ఎత్తనేవద్దు. నాలాంటి నిర్భాగ్యులకు స్వేచ్ఛపొందే అదృష్టం లేదు. జాక్సన్ ద్వీపంలో మీరు పాముకుబుసం పట్టుకొచ్చినప్పుడే అనుకున్నాను; కష్టాలు నాకు ఈ జన్మలో తప్పవని."

"జిమ్ ! నువ్వన్నది నిజమే. ఆపాముకుబుసమే మమ్మిల్లా ఏడిపిస్తోంది."

"మీరు మాత్రం ఏం చేస్తారు ? తెలియక ముట్టుకున్నారు గాని తెలిస్తే ఎందుకు ముట్టుకుంటారు ?"

కెయిరో దాటి వచ్చినట్టు మాకెల్లా అను

మానం కలిగిందంటే మేమున్నది మిసిసిపీనది బురద నీళ్లలోనే.

ఏం చెయ్యాలో తోచక ఆ పగలంతా మతి పోయినట్టు గడిపాము. రాత్రి మళ్లీ బయల్దేరే సమయానికి చూసుకుంటే మా పడవ వున్నది గాని, పడవకు కట్టేసిన డింగీ కాస్తా తెంచుకుని పోయింది. చక్కటి డింగీ పోయిందే అని విచారించాము. ఇదికూడా పాముకుబుసంచేసిన పనే ననుకున్నాము.

కాని పాముకుబుసం తాలూకు దుష్ఫలితాలు అంతటితో ఆగిపోలేదు. అన్నిటికంటె పెద్ద అఘాయిత్యం ఆరోజు రాత్రి జరిగింది.


మేము ఇంకా నది దిగువకు పోవటం అనవసరం. ఎందుకంటే కైయిరో పట్టణం దాటి వచ్చాము. కైయిరోనుంచిగాని స్వేచ్ఛారాష్ట్రాలలోకి పోవటానికి వీల్లేదు. కనుక వచ్చినదోవనే తిరుగు ప్రయాణం చెయ్యాలి. తిరుగు ప్రయాణం చెయ్యటానికి ఎదురు ప్రవాహంలో మాపెద్ద పడవ పనికిరాదు. దానికి డింగీ కావాలి. ఉన్నడింగీ పోయింది. కొత్త డింగీ కొనాలి.

కొంతదూరం నదిదిగువకే పోయి ఏపట్టణంలోనైనా డింగీ లమ్ముతుంటే ఒకటి కొనాలనుకున్నాము. బయలుదేరి కొంతదూరం పోయాము. దాదాపు మూడుగంటలు ప్రయాణంచేసినా మాకు ఏపట్టణమూ తగల్లేదు. ఆకాశమంతా మబ్బులతో మూసుకుపోయి గాఢాంధకారంగా వుంది. కన్ను పొడుచుకున్నా ఎదుట ఏముందో కానరావటం లేదు. ఆ చీకట్లో మాకు నది ఎగువకు వస్తున్న ఒక పెద్ద పొగబోటు ఎదురైంది. దానినుండి మేము తప్పించుకోటానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినాయి. పొగబోటు చాలా పెద్దది. ఎంత పక్కకుపోయినా దాన్నుండి దూరంగా పోలేకపోయాము. చివరికా పొగబోటు మాపడవను పట్టీకొట్టించి ముందుకు సాగిపోయింది. మాపడవ ముక్కలు ముక్కలై వుంటుందేమో కూడా; కాని ప్రాణాలు రక్షించుకునే తొందరలో మాపడవ గతేమైందో మేము చూడలేదు. పొగబోటు చక్రం నాకు తగలకుండా నీళ్లలో ముప్ఫయ్ అడుగుల లోతుదాకా మునిగాను. ఒక్క నిమిషం ఉండి మళ్లీ పైకి వచ్చాను. బోటు ముందుకు వెళ్లిపోయింది. మా పడవగాని, జిమ్‌గాని కనిపించలేదు. జిమ్‌ను కేకలువేసి పిలుస్తూ ఒడ్డుకు యీదుకుంటూ పోయాను. దాదాపు రెండు మైళ్లయినా యీదితే గాని నేల తగల్లేదు.

ఒడ్డున నిలబడి కొంతసేపు ఆయాసం తీర్చుకున్నాను. జిమ్ ఏమైనాడో తెలియలేదు. ఎన్ని కేకలు వేసినా సమాధానం లేదు. తరవాత ఫర్లాంగు, రెండు ఫర్లాంగుల దూరంలో వెలుతురు కనిపిస్తే దానికేసి నడవసాగాను. అక్కడొక రెండంతస్తుల మేడ వున్నది. మేడపై కిటికీలోంచి వెలుతురు వస్తోంది. ఎవరి కంటా పడకూడదనుకుని గబగబా నడుస్తున్నాను. ఇంటి ముంగిటికొచ్చేసరికి ఒకడజను వేటకుక్కలు నన్ను ముట్టడించాయి. మరొక్క అడుగుకూడా ముందుకు వెయ్యలేకపోయాను.

(ఇంకావుంది)

స్వప్న లోకంలో ఆలిస్



బొమ్మల కథ

ఆలిస్ నడిచి నడిచి అడవి మధ్యలోకి వెళ్లింది. అక్కడ హఠాత్తుగా ఇద్దరు వింత వ్యక్తులు చెట్టు చాటునుంచి వచ్చి దారి అడ్డగించారు. ఒకడు ట్వీడిల్‌డం. మరొకడు ట్వీడిల్‌డీ. తెలియని కారడవిలో తిరగవద్దని ఆలిస్‌కి సలహా చెప్పారు. ముచ్చటైన కథ కూడా చెప్పారు.

వాల్రస్ అనే నీటి జంతువు ఆలిచిప్పల్ని మోసం చేసిందట. "మీకు లోకంలో వింతలన్నీ చూపిస్తాను నాతో రండి" అందిట వాల్రస్. "చక్కని ఫలహారాలు రుచిచూపిస్తాను" అని ఊరించిందట. స్నేహితుడితో కలిసి ఉత్తుత్తికర్ర ఇల్లొకటి ఒడ్డున కట్టింది వాల్రస్. పెద్దలు చెప్పే మాటలు పెడచెవిని పెట్టి బుల్లిఆలిచిప్పలన్నీ వెళ్లాయి. "రండి రండి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది వాల్రస్. స్నేహితుడు దారిచూపించాడు. అంతే. ఆలిచిప్పలు మళ్ళీ తిరిగి రాలేదుట. ఉత్తి డిప్పలు ఒడ్డున గిరవాటేసింది వాల్రస్.

ఆలిస్ ఈ కథ విని కూడా పట్టుదల వదల్లేదు. కథ చెప్పిన ఇద్దరూ వెనక్కి పిలుస్తున్నా వినక అడివి ప్రవేశించింది.




ఇద్దరువింతవ్యక్తులు చెట్టుచాటునుంచివచ్చి దారి అడ్డగించారు.



"మీకు లోకంలో వింతలన్నీ చూపిస్తాను నాతో రండి" అంది వాల్రస్ ఆలిచిప్ప పిల్లలతో.

* * *

"రండిరండి" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది వాల్రస్.



అంతులేని బేరం

శ్రీ గురజాడవారి బాచి.

ఐర్లాండూ, స్కాట్లాండూ మొదలగు ప్రాంతాల నుంచి గ్రామీణు లెవరయినా లండను వెళ్లదలుస్తే లండను గురించి పరిచయంవున్న అనుభవజ్ఞుల్ని అన్ని విషయాలు అడిగి మరీ వెళుతూ వుండేవారుట. ఎందుకంటే లండను మహా పెద్ద పట్నంకదూ, అందుకని గ్రామాల నుంచి వెళ్లేవారు ఆ పట్నవాసం మజాలో మోసపోతూ వుండడం జరుగుతూ వుండేది.

కనుక అలాటి మోసాలకి గురి కాకుండా వుండాలంటే లండన్ పట్నంతో పరిచయంవుండి ఆమజాలన్నీ తెలిసిన వారి సలహాలు తీసుకొని పట్నం వెళ్ళితే బాగుంటుందని జాకోబిన్ అనేవాడికి ఆలోచన తట్టింది. జాకోబిన్ పాపం ఎప్పుడూ లండను వెళ్లలేదు. లండను వెళ్లి మంచి మంచి బట్టలు కుట్టించుకొని తెచ్చుకుందామని అతని అభిలాష. ఆ గ్రామంలో జాన్ మాత్రం చాలా సార్లు లండను వెళ్లి అన్ని విషయాలూ తెలుసుకున్న వాడు. జాకోబిన్ జాన్ దగ్గరకి వెళ్లి తను లండను వెళ్లుతున్నాననీ తనకి ఏమేనా సలహా ఈయమనీ అడిగాడు. జాన్ అన్నాడు కదా "ఎప్పటికే పరిస్థితి ఎదురవుతే దానికి తగ్గట్టు తెలివి తేటలు ఉపయోగించాలి కాని ముందుగా ఏసలహా ఈయగలం అబ్బాయీ" అన్నాడు. జాన్ చెప్పినది నిజమయినా జాకోబిన్‌కి ఆమాట నచ్చలేదు. అయినా వూరుకోక తను మంచి సూటు కుట్టిద్దామని పట్నం వెళ్లుతున్నాననీ, ఆ ఒక్క విషయంలోనూ తాను మోసపోకుండా సలహా ఈయమనీ ప్రాధేయపడ్డాడు. అందుకు జాన్ అంగీకరించి పట్నవాసంలో ధరలు ఒకటికి రెండింతలు చెప్పేస్తూ వుంటారనీ, కనుక లండన్‌లో ఏబట్టలయినా బేరమాడినప్పుడు చెప్పిన ధరలో సగానికి అడగమని జాన్ సలహా ఇచ్చాడు "ఓస్ ఇంతేనా కిటుకు!" అని జాకో

(39-వ పేజీ చూడండి)





ఏప్రిల్ 1వ తేదీన ఎవరిని పడితే వారిని 'ఏప్రిల్ ఫూల్' అని ఏడిపించటం పిల్లలకు సరదా. అందులోనూ మాష్టర్లనే యీ పేరు పెట్టి పిలిచి ఏడ్పించటంలో మరీ సరదా. కానీ—మాష్టర్లు పిల్లలు అనుకొన్నంత తెలివి తక్కువవారా?

మేము, అప్పుడు 5వ ఫారం చదువుతున్నాము. ఏప్రిల్ నెల వచ్చేసరికి స్కూళ్లు అన్నీ ప్రొద్దుటింతల మాత్రమే పనిచేయటం మామూలేగా! సరిగా ఏప్రిల్ 1నే మాకు యింగ్లీషు వ్యాకరణం చెప్పే ముసలి మేష్టారు యింగ్లీషు భాషలో కామా, కోలన్, సెమికోలన్ వీటిని గూర్చిన పుపయోగాలు బోధిస్తున్నారు. మూడవ పిరీయడ్ పొడుగునా పాఠం చెప్పారు. తరువాత యింటర్వెల్. మళ్ళీ 4వ పిరియడ్ కూడా ఆయన క్లాసే. మళ్ళీ యిదే పాఠం చెప్తానని ఆయనా బయటకు వెళ్లారు; మేమూ బయటకు వెళ్లి మళ్లీ ఎవరి స్థానంలో వారు వచ్చి కూర్చున్నాం. మాష్టారు యింకా రాలేదు. ఇంతలో మా నేస్తానికి మంచి ఆలోచన 'స్ట్రైక్' అయింది. సీమసున్నం ముక్క తీసుకొని బోర్డుమీద

April Fcol
Go to School
Learn your lessons like a fool
Call your teacher a dam fool.

అని వ్రాసి వచ్చాడు. వీడి తెలివి చూచి మేమంతా సంతోషించాం. మాష్టారువచ్చి యిదిచూచి ఏమైపోతారో అని వూహించుకొంటూ మరీ ఆనందించాం. గంట మోగింది. మాష్టారు రానే వచ్చారు. ఎప్పుడెప్పుడు ఆయన బోర్డుకేసి తిరిగి, తెల్ల మొహం వేస్తాడా, ఎప్పుడు అది చూచి నవ్వుదామాని మేమందరం తొందర పడుతున్నాం. ఆయన మాత్రం క్లాసులోకి వచ్చీ రావటమే పిల్లలకేసి తిరిగి అలానే వుండి పక్కా పదినిమిషాలపాటు 'కామా' గొడవ చెప్పి దాని వుదహరణలు ఏవో వ్రాద్దాం కదా అని బోర్డువైపుకు తిరిగారు. ఇంకేం— మేమను కొన్నట్టే ఆయన తెల్లబోయారు. ఇటు తిరిగి చూచారు. ఎవరికి వారు పిల్లలు అందరూ గబుక్కున నవ్వటం మానేశారు. ఆయన కళ్లలో మెరుపు మెరసి నశ్శైంది. పెదిమల మీదికి చిరునవ్వు తెచ్చుకొని—

"ఆబోర్డుమీద వున్న పద్యంలో 'పంక్చుయేషన్ మార్కులు' ఎక్కడ పెట్టాలో చూపిస్తాను. జాగ్రత్తగా చూడండి" అంటూ బోర్డు దగ్గరకు కదలి

"April Fool,
Go to School;
Learn your lessons, like a fool
Call your teacher a dam fool!"

అని సవరించారు. 'లెసన్స్' తరువాత ఆయన పెట్టిన కామాతో మేమే ఫూల్స్ అయ్యాం.

మరి ఏ మేష్టారునైనా ఏడ్పించడం మాకు సాధ్యమౌతుందేమో కాని యీయనను మాత్రం ఏడ్పించలేమని మాకు మరోసారి ఋజువు అయింది.

ఆరోజు నుంచీ నాకు ప్రతి ఏప్రిల్ ఫస్టునా యీ పద్యం, ఆ మేష్టారూ, ఆ 'కామా' తప్పక జ్ఞాపకం వస్తూనే వున్నాయి.

—వియన్—

కంగారూ



అది 1770 వ సంవత్సరం. 'ఎన్డీవర్' అనే ఓడ ఒకటి ఆస్ట్రేలియా సముద్రతీరాన్ని తాకింది. ఓడ కెప్టెన్ జేమ్సు కుక్ తన మనుష్యులలో కొందరిని గట్టుపైకి వెళ్ళి తిండికి ఏమైనా తెమ్మన్నాడు. మరి కొంత సేపటిలో ఆ మనుష్యులు తామెవ్వరూ అంతకుముందు సముద్రంలో కానీ, భూమిమీద కానీ కని విని ఎరుగని ఒక ఆకారాన్ని మోసుకొచ్చి, అదిచూచి తామే ఆశ్చర్యపోవటం మొదలుపెట్టారు. వారు తెచ్చిన ఆకారం బాగా 5 అడుగుల పొడవు వున్నది. చిన్ని తల; చూడముచ్చటగా వున్నది. ఆ మెడ జింక మెడలాగా బలే చక్కని వంపు తిరిగివున్నది. పై భాగాలన్నీ యింత తీరుగావుంటే ఆ కారం అడుగుకుపోయినకొద్దీ తేలిపోయింది. 4 అడుగుల పొడవున యింత లావు తోకకూడా వున్నది. కళ్లు చూడబోతే తళుకుతళుకుగా వున్నాయి. చిన్ని ముక్కు. పెదిమలు - మన కుందేలు పెదిమిల్లా కుదురుగావున్నాయి. చేతులు - మనుష్యుల చేతుల్లానే వున్నాయి. అన్నిటికంటే ఆశ్చర్యం ఏమిటంటే - యిప్పుడు చాలా మంది చదువుకొన్న యువతీ యువకులకువున్నట్లు ఆ మృగానికికూడా ఒకతోలుసంచి వున్నది. మనుష్యుల్లో కొందరికి తాము వాడే సంచులు తమ శరీరంలో భాగాలుగా భావించుకొంటారు. ఈ మృగానికిమాత్రం సంచి శరీరంలో భాగమే. మనం వాడే తోలుసంచులతో పోల్చానని యీ సంచీలో కూడా కోర్టుకాయితాలు, హెయిర్ పిన్‌లు, ఫేసుపౌడరు యిత్యాదయః వుంటాయనుకొనేరు. ఇలాటివాటి కోసం కాకపోతే, చొక్కా జేబుల్లో మీ స్కూలుపిల్లలు బఠానీలు, వేరుశనగకాయలు, బలపపు పిక్కలు దాచుకొన్నట్లు, ఆ మృగంకూడా తన 'అన్నం' దాచుకొంటుందనుకొంటారేమో; అదీ కాదు - అందులో దాని పాపాయి వుంటుంది. మీరు చూసే వుంటారు - పొలాల్లో పని చేసే ఆడకూలీలు కొందరు తమ పిల్లలను తమ వీపుపైన ఎక్కించుకొని గుడ్డలతో తమవంటికి బిగించి కట్టుకొంటారు. అల్లాగే ఇల్లుఅంటూ ఏమీలేని యీ మృగం పిల్లలను పొట్టలోనే దాచుకొని ఎక్కడికి పడితే అక్కడకు వెళ్ళిపోతూ వుంటుంది.

ఇంతకీ ఆమృగంపేరు ఏమిటో తెలిసిందా? అది వుండే ఆస్ట్రేలియాలో ఏమనేవారో తెలియదు కానీ, 1770 లో కెప్టెన్‌కుక్ మనుష్యులు పోయి ఆస్ట్రేలియాదేశపు ప్రజలను దీని పేరేమిటని అడిగితే వారు ఏమిటో చేతులు తిప్పుతూ కళ్లుపెద్దవిచేసి 'కంగారూ' అన్నారట. ఈ మాటను తర్జుమా చేస్తే "ఏమిటో వివరించిచెప్పటానికి ప్రయత్నంచేయటంకూడా వృథా ప్రయాసే" నని భావం వస్తుందట. సహజంగా యీ మృగం చాలా ఖంగారు మృగం. అందుచేత యీ మృగానికి కంగారు పేరుపెట్టటం సమంజసంగా వున్నట్లు తెలుగు వాళ్ళకు తోస్తుంది.

కెప్టెన్‌కుక్ అనుభవం తదనంతరం యూరపుకు చెందిన జంతుశాస్త్రవేత్తలు కంగారు పుట్టుపూర్వోత్తరాలు, జీవితరీతులను

గూర్చి పరిశోధనలు ప్రారంభించారు. మొట్టమొదట కంగారు — అనేది ఒక పెద్దరకం ఎలుక అన్నారు. తరువాత 'కాదు కాదు' 'ఇది శరీరంలోనే సంచులువుండే జంతువిశేషం' అని దానికి వేరొక పేరు పెట్టారు. కంగారు ఒక్క ఆస్ట్రేలియాలోతప్ప ప్రపంచంలో మరెక్కడా కనుపించదు.

కొన్ని వేల ఏళ్ళక్రితం యిప్పుడు ఆస్ట్రేలియాగా పిలువబడుతున్న భూఖండంకూడా యిప్పటి ఆసియా ఖండంతో కలసివుండేదనీ, క్రమేపీ కాలవశాన ఆసియా ఆస్ట్రేలియా ఖండాలమధ్యగల భూభాగం నీట మునిగిపోయిందనీ శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అట్టి పరిణామంమూలంగానే కంగారూఅనే యీ మృగజాతి మరెక్కడా లేకపోయినా ఒక్క ఆస్ట్రేలియాలో మిగిలివున్నాయని పెద్దలు అభిప్రాయపడుతున్నారు.

కంగారూ బారుగా నిలుచుంటే మనిషికంటే పొడుగే బరువుకూడా 200 పౌనులకు తగ్గదు. కంగారూ కూర్చొనేపద్ధతిలో ఒకవిశేషం వున్నది. వెనుకవైపు కాళ్ళలో పాదంచివరనుంచి మోకాలివరకు నేలకు ఆనించి, యిటు తోకను కూడా నేలపై అదో వయ్యారంగా వుంచి, మొత్తానికి ముక్కాలిపీట మీద కూర్చొన్నట్లు కూర్చొంటుంది. ఈ భంగిమలో కూర్చొని వున్నప్పుడుకూడా దీనిఎత్తుభూమిపైనుంచి 5 అడుగులు వుంటుంది. ఆ వెనుక కాళ్లల్లో ఎంతో కండబలంవుండి, యింత పెద్ద ఆకారమూ ఒక్కవూపులో 10 అడుగులఎత్తు ఆవరణను అవలీలగా దాటవేయిస్తుంది. ఈ జంతువు అసలు చాలా పిరికి. ఎంత పిరికిఅయినా యిక దిక్కుతోచని పరిస్థితి వచ్చిందంటే ఆ వెనుక కాలితోనే ఒక్కతాపు తన్ని వరసగా అరడజను కుక్కలను చంపివేయగలదు. మనిషి కాలిని అగ్గిపుల్లను విరగగొట్టినంత తేలికగా తుంచివేయగలదు. ఇంత ఆకారం యింత సత్తువవుండే కంగారూపిల్ల ఎంతవుంటుందనుకొంటున్నారేమిటీ! ఒక్క చిన్న చెంచాలో మూడు కంగారూ పిల్లలను తేలికగా పట్టించవచ్చునంటే మీరు ఆశ్చర్యపోవచ్చు. కంగారూ పాపాయిపుట్టినప్పుడు ఒక్కఅంగుళంకంటేకూడా తక్కువపొడుగువుంటుంది. దాని పైచర్మంలోనుంచీ లోపలిభాగాలు కొంచెంకొంచెం కనుపిస్తూ వుంటాయికూడా (వానపాము మాదిరిగా). అప్పుడు దీని శరీరంలోకల్లా కాస్త ఎదిగినభాగం చేతులు మాత్రమే. ఈ చిన్న చేతులతో తన తల్లి పొట్టమీది వున్నిని పట్టుకొని తనకోసం సిద్ధంగా వున్న సంచీలోకి పోయి ఒదిగి కూర్చొంటుంది. ఇంచుమించు ప్రతిసారీ యీ పసిగుడ్డు తనంతటతానే సంచీలోనుంచి పైకి వచ్చి లోపలికి పోతూవుంటుంది. ఎప్పుడైనా యిది తనంతట తనుగా సంచీలోకి పోలేకపోతే అప్పుడు వాళ్ల అమ్మ తన పెదవులతో దీనిని పొదవి పట్టుకొని పొట్టలోని సంచిలోకి దోపుకొంటుంది. కంగారూ తడవకు ఒకపిల్లనే కంటుంది. కనుక యీ సంచీలో చోటు చాలదేమో అనే అనుమానం ఏ పిల్లకంగారూకూ వుండదు. సంచీలోకి దూరగానే పాపాయి అక్కడే వుండే పాలతిత్తిని నోట కరుచుకొంటుంది. మళ్లీ గాలి పీల్చుకోవటానికైనా కూడా ఆ తిత్తిని నోటినుంచీ తీయదు. మరి అంతసేపు చిన్న కంగారూ గాలి ఎలా పీల్చుకోగలుగుతున్నదీ శాస్త్రకారులకు మొదట్లో అర్థంఅయిందికాదు. తరువాత తరువాత జరిపిన పరిశోధనలమూలంగా కంగారూ గొంతుకు ముక్కు వెనుకభాగానికీ అదనంగా ఒక జాయింటు వున్నదనీ, యిటు ఒకవంక విడవకుండా పాలు తాగుతున్నా ఆ రెండో గొట్టంగుండా గాలిపోతూవస్తూవుంటుందనీ ఆ కారణంచేతనే కంగారూకు పొలకమారదనీ వెల్లడిఅయింది.

చిన్న కంగారూకు నాలుగు నెలలు దాటేసరికి తల్లిపాలు మానివేసి యిక అప్పటినుంచీ మాటిమాటికీ, రైలుపెట్టె కిటికీలోనుంచీ మనం తల బైటికిపెట్టి చూచినట్లుగా యిట్టే ఆ సంచీలోనుంచీ బయటకు తొంగిచూసి, అట్టే లోపలికి పోతుంటుంది. ఇంకో విశేషం — తల్లి కంగారూను ఎప్పుడుపట్టుకొన్నా, దాని సంచీలో పాపాయి అంతకుముందే తప్పించుకు పారిపోతుంది. అపాయం ఆసన్నమైందని తోచినప్పుడు తల్లి కంగారే పొట్టసంచీలోవున్న పిల్లను ఆపాళంగా ఏ పొదలోకో విసిరివేసి, అపాయం తప్పిపోయాక మళ్లీ అక్కడకువచ్చి ఆపిల్లను భద్రంగా తీసుకొని పొట్టసంచీలో దాచుకొనిపోతుంది. సంచీలోనుంచి పాపాయిని బయటకు విసరివేయటానికి

తల్లి మృగం ఆగనక్కరలేదు. సంచిలోవున్న కండరాలకే స్ప్రింగుకువుండేశక్తి వుంటుంది. ఆ కారణంచేత పరిగెత్తుతూ పరిగెత్తుతూనే పిల్లను బయటకు పడవేయగలదు.

కంగారూ మృగాలు ఒంటరిగా వుండలేవు 20 మొదలు 50 వరకు జట్లుగా చేరి తిరుగుతుంటాయి. వీటికి ఆరోగ్యసూత్రాలు చాలా బాగా తెలుసు. ఆ సూత్రాలను చాలా నియమంతో పాటిస్తాయి కూడా. ప్రొద్దున నిద్దుర లేవంగానే ఒకసారి, మళ్లా సాయంకాలమో, లేకపోతే వెన్నెలలోనో గడ్డి మేస్తాయి. మిగిలిన సమయంలో చెట్లనీడల్లోచేరి ఆడుకొంటాయి. ఇవి ఆడేఆటలలో ముఖ్యమైనది బాక్సింగ్. రెండు కంగారూలు ఒకదానికి ఎదురుగుండా ఒకటి నిలొ చొని రెండు చేతులతో నూ గుండెలు కప్పుకొంటాయి. వెనుక కాళ్లు, తోక ఆధారంగా చేసి ముక్కాలిపీటంవేసి యిక అక్కడ నుంచీ ఎదిరి మృగాన్ని తానుకొట్టబోవటమూ, అవతల మృగం కొట్టే దెబ్బలను నేవళంగా తప్పించుకోవటమూ చూస్తుంటే యివి బాక్సింగ్ స్కూలులో చాలా శ్రద్ధగా యీ విద్యనంతా అభ్యసించాయా అనిపిస్తుంది. ఇలా గంటల తరబడి అవి కుస్తీలు పట్టుతాయి. అవి అసలు కుస్తీలకు దిగటం ఏదో పెద్దగా గెలుపొందాలనే పట్టుదలతో కాదు. ఆటకోసమే ఆడుతాయి. దాగుడుమూతల ఆట కూడా తరచు ఆడుతుంటాయి.

కంగారు చాలా ఖంగారైన మృగమని చెప్పానుకదూ. అసలు అంతదూరంలో అపాయంవుందంటేనే యీ కంగారూ గంటకు 50 మైళ్లవేగంతో పారిపోతుంది. వేటగాళ్లు సామాన్యులా! వూరకుక్కలను వెంట తరుముతారు. అప్పుడు యీ మృగం పరిగెత్తగలిగినంత దూరం పరిగెత్తి యిక లాభంలేదని తోచినప్పుడు ఏదైనా ఒక కొలను వంటిది చూచి అందులో తనకు బాగా నడుముపైవరకు నీరువచ్చే చోటికి వెళ్లి అక్కడ ఆగుతుంది. అంతవరకూ అందకుండా పరిగెత్తిన మృగం ఆగిందిగదా అని సంబరాలుపడుతూ యీ వూరకుక్కలు కూడా నీటిలోకి దిగివస్తాయి. వాటిని దగ్గరదాకా రానిచ్చి అక్కడ తనకాలితో వాటిమెడ పట్టుకొని ఎంతసేపైనా మళ్ళీపైకి లేవకుండా ఆ కుక్క తలకాయను కంగారూ అలాగే నీటిలోముంచి వుంచుతుంది. ఇక అంతటితో ఆ కుక్క 'హారీ' అనవలసిందే ఒకానొక సందర్భంలో ఒక కంగారూ యీ పద్ధతిని అవలంబించి వరుసగా ఆరువూరకుక్కలనుహతమార్చింది.

కంగారూ మృగాల చర్మాలు, వాటివున్ని విదేశాలలో వస్త్రాలంకారాలకోసం వినియోగిస్తారు. ఆవిధంగా యీమృగాలు ఆస్ట్రేలియన్లకు డబ్బగణించి పెట్టుతున్నాయి వాటి మాంసంకూడా చాలామంది అతి యిష్టంగా తింటూ వుంటారు.

వీటి ఆకారంలో వున్న క్రొత్తదనాన్ని, వీటి భారీ తనాన్ని పురస్కరించుకొని ఆ దేశ వాసులు ఎన్నెన్నో కథలలో యీకంగారుకు అతి ప్రత్యేకమైన పాత్రలు కల్పించి చెప్పుకొంటూ వుంటారు. ★

★ బొమ్మల గారడీ ★



ఈ బొమ్మలో వున్నవాడు ఎవరో తెలుసా? – గొప్ప మాంత్రికుడు. మాజిక్ చేసే అందరిలాగా యీాయన గారడీ అంతా తానే చేసెయ్యడు. కొంత మీాచేతకూడా చేయిస్తాడు. ఈ మంత్రగాడు ముందుగా తన హేట్ తీసి చేత్తో పట్టుకొన్నాడు. అంతటితో అయిపోతుందనుకొన్నాను. కాని ఏమిటో కుడిచేయి పైకెత్తి పట్టుకొని ఒకటి... రెండు ...మూాడు అన్నాడు. మూాడు అంకెలతో ఆగుతాడనుకొన్నా! ఊహు– ముప్పైఐదువరకు అంకెలు చదివేశాడు. ఆఖరంగా చిరునవ్వు నవ్వుతూ ఆ అంకెలన్నీ ఒకదానితో ఒకటి కలిపి చూడమన్నాడు. ఏదీ – ఒకటి నుంచీ 35 వరకు పెన్సలు గీతలతో కలిపి చూడండి; ఏమాతుందో!

అంతులేనిబేరం

(34–వ పేజీ తరువాయి)

బిన్ అనుకొని లండన్ బయులుదేరాడు.

జాకోబిన్ లండను చేరి మంచి సూట్లు అమ్మే దుకాణానికి వెళ్లి తనకి నచ్చిన సూటుతీసి బేరం ఆడాడు. కొట్టువాడికీ జాకోబిన్‌కీ ఈవిధంగా బేరం సాగింది:

జా:–ఈసూటు ఖరీదెంతోయ్!

కొ:–ఇరవైనాలుగు షిల్లింగులు.

జా:–ఓస్, అంతధరా?పన్నెండు షిల్లింగుల కియ్యవూ?

కొ:–లేదండి, కావలిస్తే పదహారు షిల్లింగుల కిస్తాను!

జా:–పదహారేమిటి, ఎనిమిది షిల్లింగుల కిస్తావా చెప్పు?

కొ:–మీాకు నచ్చితే పన్నెండు షిల్లింగుల కిస్తాను. అంతకి తగ్గదు!.

జా:–పన్నెండు షిల్లింగు లెవరిస్తారయ్యా, కావలిస్తే ఆరుషిల్లింగు లిస్తాను, ఇచ్చెయ్!

కొ:–ఏం టయ్యోయ్ నీబేరం, నువ్వూ, ఆఖరిమాట ఎనిమిది షిల్లింగులకి ఇస్తా, నచ్చితే తీసుకో!

జా:–నాలుగు షిల్లింగుల కన్నా ఎక్కువ ఇవ్వను!!

కొ:–నువ్వూ నీ బేరం బాగా జతపడ్డావయ్యా మాకు! కావలిస్తే సూటు ఉట్టినే ఇచ్చేస్తా తీసుకుపోవయ్యా!!

జా:–అలా అయితే రెండుసూట్లు ఇయ్యి తీసుకుంటా!!!

★

జిగిబిగి

(15-వ పేజీ తరువాయి)

గుసేగా వున్నారు. వాళ్ళు...నీకు విని పిస్తూంటాయనుకుంటూ ఆవిడ అంకెలు. !

ఆమ్లెట్ కత్తితో కోసి ఫోర్కుతో గుచ్చి వొక ముక్క యెత్తి నోట్లో పెట్టు కుంటూ నా వేపు ఓరగా చూసి, ముసిముసి నవ్వుతో అన్నాడు, 'వాడి ఓర్మికి మెచ్చు కోవాలి కదూ...'

నాకు చిత్రై తింది. 'శివా.. మీ సుకు మారాన్ని యిటీవల చూసేవూ?'

'లేదురా. గం తే శ్ళయింది ఎలా వుంటాడు! ఆ హిడింబి వాడిని మ్రింగివేసి వుంటుంది. !

'లేదురా వాడే దాన్ని మింగేసేడు. రోజూ మెత్తగా తంతాడు - రోజూ వో అరగంట, తప్పన్నా లేకపోయినా, పాఠ శాలలో పీరియడ్‌లా చింతకాయ పచ్చడి చేస్తాడు'

మా యెదురుగా యెదురింటాయన వొస్తు న్నాడు. అతడీ రోజులలో నాకు 'నమస్తే' చెప్పతాడు. నేను జాలిగా నమస్తే అందు కుంటా.

'అదేమిటండోయ్ పాలడబ్బాలా వుంది!'

'ఔను'

'ఇంతరాత్రి!'

'మా ఆవిడ సినీమాకు వెళ్ళింది మర్చి పోయిందనుకొంటూ...'

మర్నాడుదయం మాగుమ్మంలో, నేను దంతధావన చేస్తూంటే, పొరుగింటాయన పైకెడుతున్నాడు. నాదగ్గరకు రాగానే-

'నమస్తే'

'నమస్తే...అన్నట్టు నిన్నరాత్రి... మీ ఫ్రండట...నాకూ స్నేహితుడే...శివా నందం అగుపించేడు...'

'ఓహో హో...వాడా...కులాసాగా వున్నాడా...

'వాడికేం పూలరంగడిలా వున్నాడు'

'వాడు పరమ ఛాందసుడండోయ్! క్లాసులో మాంసాహారుల ప్రక్కకూచునే వాడు కాడు...వాసన కొడుతుందట... మేం వాడిని 'స్వామీ శివానందా' అని వుడికించేవాళ్లం' ★

తీసిపోని తెలివి

(22-వ పేజీ తరువాయి)

"ఊ." అనేసి బల్లసర్దుతూనే ఉంది లక్ష్మి. శర్మకి కుతూహలం ఎక్కువైంది

"ఐతే నీ పని బాగుంది కొన్న చీరలు పెటెలో పెట్టి పూజిస్తూ, కొత్తవాటకోసం ఏడ్చిపెడ్తావేం?" లక్ష్మి మాట్లాడలేదు. పెదవులపై సాక్షాత్కరించనున్న చిలిపి నవ్వును దాచేస్తోంది.

"నిజం చెప్పమంటారా ఎందుకు కట్టు కోవటంలేదో?"

"ఏమైనా రహస్యముందా యేమిటీ కొంపతీసి?"

"రహస్యమే. ఇన్నాళ్లు చెప్పడానికి భయపడ్డాను. కానీ, యివాళ్ల తమ ప్రతాపం తెలియవచ్చేసరికి యిక దాచడం అనవసర మనిపిస్తోంది." అన్నది లక్ష్మి ఉపోద్ఘాతంగా. శర్మకి అంతుచిక్కలేదు విషయ మేమిటో.

"ఇంతకీ దేవిగారి భావమేమిటో అవ గాహన కావటంలేదు."

"దీపావళినాడు కొన్నారా ఆ చీర. అవ్వాళ్లే అరుగుమీదనుంచుని పక్కనింటి వాళ్ళ రామం కాల్చే తూటాలను చూస్తు న్నాను. ఇంతలోకే రామం స్నేహితు డెవరో తూటావిసిరేసరికి నిప్పురవ్వలు చీరమీదపడి, కుచ్చెళ్లలో పావుగజం మేర కాలిపోయింది. అప్పటినుంచీ మీకు చెప్ప డానికి దడుస్తూ, పెట్టెలో దాచాను. మీరు చేసిన ఘనకార్యం ముందు యిది ఏపాటి దని యివాళ్ళ చెప్పేశాను. అరే! ఎందు కంత ఆశ్చర్యపోతారు? మీ కంటే తెలివి గలపనేమీ నేను చెయ్యలేదులెండి"

ఆశ్చర్యంతో శర్మగుండె ఆగిపోయిం దేమో? ★

రేడియో గింజలు

(23-వ పేజీ తరువాయి)


బుట్టకిందెట్టి డబ్బు లెక్క పెడుతూంది. చంకలో కుట్టాడు రేడియో పాటకి కర్లె పెదుపుతున్నాడు. క్లార్కుకి అర్థం కాలేదు

'బియ్యం యిక్కడెందుకుంటాయ్?' అని గద్దించాడు.

'మ రెక్కడుంటాయ్ ప్రతీవోడు యిదోటి నేర్చుకున్నాడు తిండి మీకే గాని మా కక్కరలేదా? ఏయో గింజలు రేడియో గింజలే అంటాం ఏం చేస్తాం?'

క్లార్కు విభ్రాంతుడయ్యాడు. అతని కేసో తట్టి, 'సరే. రెండు నిమిషాలోపిక పట్టు' అని చెప్పి తనలో తనే నవ్వుకొ న్నాడు

ఇంతలో సంగీతం ఆగింది. 'చెన్నపురి బజార్లో ఈనెల పదవతేదీనున్న ధర పచ్చి బియ్యం మొదటిరకం రెండింపీరియల మణుగుబస్తా సంచీతోసహా ముప్ఫయి నాలుగు రూపాయల నాలుగణాల నాలుగు పైసలు...' అని చదివేస్తోంది రేడియో. పల్లె పడుచు గ్రహించింది. 'ఇదా బాబూ! నే నింకా రేడియో గింజలంటే సరికొత్తబియ్య మనుకున్నాను. తిండి లేక చచ్చిపోయే కూలాటోళ్లతోటా సరసాలు. ఆ చెప్పే వాడికేనా బుద్ధుండాలి. ఆడికి లేకపోతే సదువుకున్నాడికి నీకేనా వుండాలిగందా?' అంటూ వుగ్రరూపం దాల్చి వెళ్లిపోయింది. రేడియో ధ్వనిలో క్లార్కుకి ఏమీ విని పించలేదు. రేడియో నిత్యం ఇలా చెబు తూనే వుంది. కాని ఆ పడుచు ఆకలిమంట లతో అన్న వాక్యాల్ని మాత్రం ప్రసారం చెయ్యలేకపోయింది. ★



గణపతికి తోడునీడలు—కొండయ్య, పంతులూ.
పీపుల్సువారి "పల్లెటూరు"లో నాగభూషణం, ఎస్. వి. రంగారావు, డా. బసవరాజు.

భరణీవారి "ప్రేమ" సమీక్ష

"నాది ప్రేమప్రపంచ మ్మొక; నాకు పాంచ
భౌతికమ్మౌ జగత్తొక స్వప్నమటులు."

అని ఒకప్పుడొక భావకవి రాశాడు. ఎక్కడో దూరంగా, నాగరికతా గంధం సోకని, అకలిదప్పులులేని ఆనందమయమైన ఆదర్శలోకం. ఆ లోకంలో ప్రేయసీ ప్రియులు ప్రథమ వీక్షణంలోనే ప్రగాఢంగా ప్రేమించుకుంటారు. ప్రేమ నౌకల్లో ప్రేమగాలి పీలుస్తూ, ప్రేమాన్నం తింటూ ప్రేమే సర్వంగా గడుపుతారు. వారికీ బాధలు వస్తాయి; అవి మధురంగా ఉంటాయి. వారికీ సమస్యలుంటాయి; అవి ప్రేమసమస్యలు. ఆ లోకానికి మామూలు లోకం పరమ శత్రువు; ఆ లోకంలో కనిపించే మామూలు లోకానికి ఈ ఆదర్శ ప్రేమికుల ప్రేమను భగ్నం చెయ్యటం తప్ప వేరే పని లేదు. ఆ లోకంలో ఇంకా ఏమి ఉంటాయంటారా? చతురస్రప్రేమ వుంటుంది అంటే ఒక మంచి అమ్మాయిని మంచి అబ్బాయి, చెడ్డ అబ్బాయి; ఆ మంచి అబ్బాయిని మంచి అమ్మాయి, చెడ్డ అమ్మాయి ప్రేమిస్తారు. అక్కడి మనుష్యులు నూటికి [illegible] మంచివాళ్ళో, లేక చెడ్డవాళ్ళో [illegible] వుంటారు. ప్రేయసీ ప్రియులు ఒకరి ప్రేమ నొకరు శంకించుకోవటం ప్రేయసి ఆఖరి [illegible] ఆకారం [illegible] [illegible] కనిపిస్తుంది.

[illegible] తయారు చేసిన "ప్రేమ" చిత్రం ఆంధ్రదేశమంతటా దిగ్విజయంగా నడుస్తోంది. ఈ చిత్రానికి భానుమతి స్వయంగా కథ రాసింది [illegible] కథా రచ[illegible] [illegible] అంత [illegible] [illegible] చక్రపాణి [illegible] "ప్రేమ" కథలో [illegible] ఆమె ఎక్కడా అంత [illegible] [illegible] రచనా [illegible] [illegible] ఆదర్శ ప్రేమ [illegible] [illegible] ఈ కథ [illegible] [illegible]. భావకవిత్వం [illegible] ప్రజాబాహుళ్యానికి [illegible] [illegible]. "ప్రేమ" కథలో [illegible] [illegible] ప్రభావం [illegible] [illegible] ప్రేమకు సజీవమైన మూర్తిత్వం లభించింది.



జంపనవారి "మేనరికం" లో తల్లీకొడుకులు జి. వరలక్ష్మి, రామశర్మ.